# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 2 - సంచిక 7 ఏప్రిల్ 2024 వెల : రూ.15



ఇండియా కూటమిని ఆదరించండి

ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీ 'న్యాయపత్ర'

ప్రజల కోసం ప్రత్యామ్నాయ విధానాలు సీపీఎం మేనిఫెస్టో

బీజేపీ ప్రభుత్వాన్ని మార్చాలి సీపీఐ ఎన్నికల ప్రణాళిక

ఇండియా కూటమిని ఎందుకు గెలిపించాలి?

'దక్షిణ' ద్వారం తెరుచుకుంటుందా?

వికసిత భారత్ విశ్వరూపం!

ఎలక్టోరల్ బాండ్లు - కార్పొరేట్లకు విందులు

బీజేపీ గూటికి చేరితే పునీతులే.. 25 మంది ప్రతిపక్ష నేతలపై నో యాక్షన్

బొంకుల దిబ్బ రాజకీయం

పేదరికపు గణాంకాలు మరోసారి..

ఎన్నికల రూల్ బుక్‌ను మార్చి రాయాలా ?

పాత పౌరసత్వ చట్టం.. కొత్త సమస్య

హిందూత్వ,సామాజిక న్యాయం ఒకే ఒరలో ఇమడవు!

కులం కూడా ఒక సామాజిక పెట్టుబడే!

ప్రశ్నించడం నేర్చుకోపోతే పతనం ఖాయం

డిగ్రీలు లేని ప్రిన్సిపాలూ, మరో పరిశోధకుడు

పురాతన సమాజం

'గోరఖ్‌పూర్' విషాదానికి అక్షర సాక్ష్యం!?

ప్రజాతంత్ర భారత ప్రవక్త బాబా సాహెబ్ అంబేద్కర్

ఏప్రిల్ - 2024
పేజీలు : 44

# దారి దీపం మాసపత్రిక

సంపుటి : 2 - సంచిక : 7


డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

ఈ సంచికలో..

1. ఇండియా కూటమిని ఆదరించండి
- సంపాదకీయం 3
2. ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీ 'న్యాయపత్ర' 4
3. ప్రజల కోసం ప్రత్యామ్నాయ విధానాలు 5
4. బీజేపీ ప్రభుత్వాన్ని మార్చాలి - 8
5. ఇండియా కూటమిని ఎందుకు గెలిపించాలి?
- వడ్డే శోభనాద్రీశ్వరరావు 9
6. 'దక్షిణ' ద్వారం తెరుచుకుంటుందా?
- కె.శ్రీనివాస్ 10
7. వికసిత భారత్ విశ్వరూపం!
- జి.శ్రీరామమూర్తి 12
8. ఎలక్టోరల్ బాండ్లు - కార్పొరేట్లకు విందులు
- మజ్జి కేశవ్ 14




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

9. బీజేపీ గూటికి చేరితే పునీతులే.. 25 మంది ప్రతిపక్ష నేతలపై 'నో యాక్షన్' 16
10. బొంకుల దిబ్బ రాజకీయం - సవ్యసాచి 17
11. పేదరికపు గణాంకాలు మరోసారి.. - ప్రభాత్ పట్నాయక్ 18
12. ఎన్నికల రూల్‌బుక్‌ను మార్చి రాయాలా?! - అశోక్ లావాసా 20
13. పాత పౌరసత్వ చట్టం.. కొత్త సమస్య - మాడభూషి శ్రీధర్ 22
14. హిందూత్వ,సామాజిక న్యాయం ఒకే ఒరలో ఇమడవు! - బి.వి.రాఘవులు 25
15. కులం కూడా ఒక సామాజిక పెట్టుబడే! - ప్రొఫెసర్.కె.యస్.చలం 28
16. ప్రశ్నించడం నేర్చుకోపోతే పతనం ఖాయం - కె.రామచంద్రమూర్తి 33
17. డిగ్రీలు లేని ప్రిన్సిపాలూ, మరో పరిశోధకుడు - డాక్టర్ దేవరాజు మహారాజు 35
18. పురాతన సమాజం - శిరంశెట్టి కాంతారావు 37
19. 'గోరఖ్‌పూర్' విషాదానికి అక్షర సాక్ష్యం!? - వి.విజయ్‌కుమార్ 38
20. ప్రజాతంత్ర భారత ప్రవక్త బాబా సాహెబ్ అంబేద్కర్ - కొండూరి వీరయ్య 39
21. లాల్ సలామ్ - నాయిని నర్సింహులు 42
22. కార్టూన్స్ 43 23. కొత్త పుస్తకాల స్వీకారం - 44

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM

దారి దీపం
మాసపత్రిక
మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# ఇండియా కూటమిని ఆదరించండి

ఎన్నికలలో ఈవీఎంల మీద అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మీరు ఎవరికి ఓటు వేసినా అవి మాకే వస్తాయి అంటూ అక్కడక్కడా బీజేపీ నేతలు చేస్తున్న ప్రకటనలు దీనికి బలాన్ని చేకూరుస్తున్నాయి. కొన్నిచోట్ల ఓటింగ్ ప్రారంభానికి ముందు వేసే ట్రయల్‌లో ఏ మీట నొక్కినా అది కమలానికి వెళ్లడం ఈ అనుమానాలను మరింత పెంచింది. తెలంగాణలో ఫోన్ టాపింగ్‌లాగ ఈవీఎంల టాపింగ్ ఎప్పుడు బద్దలవుతుందో అప్పటి వరకు ఈ అనుమానాలు అలాగే వుండిపోతాయి. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ దొంగాట రాజకీయాన్ని నడిపిస్తున్నది. ఒక పక్క చంద్రబాబుతో పొత్తు పెట్టుకుంది. చంద్రబాబుకు ఓటమి భయం, ఇంకో పక్క కేసుల భయం ఉన్నాయి. జగన్ పార్టీకీ ఆది నుంచి కేసుల భయం వుంది. ఇలా ఇద్దరినీ బీజేపీ లొంగదీసుకుంది. ఇద్దరూ ప్రత్యేక హోదాను వదులుకున్నారు. విభజన హామీలను తుంగలోకి తొక్కారు. తమకున్న భయాలతో ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టారు.

గడిచిన పదేళ్లలో పొత్తులో వున్నా, లేకపోయినా ఈ రెండు పార్టీలూ పార్లమెంటులో బీజేపీతోనే వున్నాయి. బీజేపీ తెచ్చిన నల్ల చట్టాలన్నింటికీ ఈ పార్టీలు మద్దతుగా నిలబడ్డాయి. బీజేపీకి ఈ రాష్ట్రంలో ఒక శాతం ఓట్లు కూడా లేవు. కాని, రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల మద్దతు ఎల్లప్పుడూ వీరే దక్కించుకుంటున్నారు. ఇక్కడ బీజేపీకి ఈవీఎంలతో పనిలేదు. ఆ పని చంద్రబాబు, జగన్‌లు చేసి పెడుతున్నారు. ఈ రాష్ట్రంలో పార్లమెంట్‌కు ఇటు చంద్రబాబు కూటమికి వేసినా, అటు జగన్ పార్టీకి వేసినా అన్నీ బీజేపీ పంచకే చేరిపోతాయి. ఇది ఆంధ్రప్రజలతో బీజేపీ ఆడుతున్న దొంగాట. ఈ రెండు పార్టీలను లొంగదీసుకుని తెలుగు ప్రజల్ని నట్టేట ముంచుతున్న దొంగాట. రాష్ట్రంలో ఈ దొంగాట పార్టీలకు అర్థబలం వుంది. అంగబలం వుంది. మీడియా బలం వుంది. పోటీ ఇద్దరి మధ్యే వున్నట్టు, గెలుపోటములు తమవే అన్నట్టు ప్రచారం చేస్తున్నారు.


ఇప్పుడు కొత్తగా ఇండియా కూటమి ఆంధ్రప్రదేశ్ ఎన్నికల బరిలోకి దిగింది. ఇందులో కాంగ్రెస్‌తోపాటు వామపక్షాలు, ఇతర పార్టీలు వున్నాయి. వీటికి అంగబలం, ఆర్థిక బలం, మీడియా బలం తక్కువ. కాని, ఆంధ్ర ప్రజలకు ఉజ్వల భవిష్యత్‌నిచ్చే ఎజెండా బలం వుంది. ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీలతోపాటు జన జీవనాన్ని మెరుగుపరిచే గ్యారంటీలు ఉన్నాయి. ఒకనాడు పై బలాలు అంతగా లేని జనతా పార్టీని ప్రజలు గెలిపించారు. 1980 దశకంలో రాష్ట్రంలో అత్యంత బలహీనంగా వున్న ఇందిరా కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారు. దొంగాట పార్టీలు కేవలం డబ్బుతో, ఆర్భాట ప్రచారాలతో, మీడియాతో మాత్రమే గెలవలేదు. ఎన్నికలు ప్రజలు ఆడే ఆట. ఇది తమ ఆట అని భావిస్తే ఎంతటి బలంగా కనిపించే దొంగాట పార్టీలను మట్టికరిపించగలరు. ఇండియా కూటమిని ప్రజలు ఆదరించి ఓటేస్తే నవ్విన నాప చేనే పండుతుంది. రాష్ట్రంలో దొంగాట రాజకీయానికి తెరపడుతుంది. ❑

**- డీవీవీఎస్ వర్మ, సంపాదకులు, 85006 78977**

# ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీ 'న్యాయపత్ర'

**కాంగ్రెస్ మేనిఫెస్టో 2024**

కాంగ్రెస్ పార్టీ సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. శుక్రవారం ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తదితరులు 48 పేజీల 'న్యాయ్ పత్ర' పేరిట బుక్‌లెట్‌ను రిలీజ్ చేశారు. ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి, సంక్షేమ సూత్రాల ప్రాతిపదికన దీన్ని రూపొందించినట్లు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ చిదంబరం తెలిపారు. గత పదేళ్లుగా ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని, అన్ని రంగాల్లో విధ్వంసమే జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేదల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తామని ఆయన హామీ ఇచ్చారు."గత యూపీఏ ప్రభుత్వం 24 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చింది. 2024లో అధికారం చేపట్టాక మరో 23 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కల్పిస్తాం" అని చిదంబరం చెప్పారు.




**'న్యాయ్'ల గురించి వివరించిన ఖర్గే..**

కాంగ్రెస్ మేనిఫెస్టోను దేశంలోని పేద ప్రజలకు అంకితం చేస్తున్నామని పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. దేశ రాజకీయ చరిత్రలో న్యాయ పత్రాలుగా వీటిని ప్రజలు గుర్తుంచుకుంటారని చెప్పారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో రాహుల్‌గాంధీ అందిస్తామన్న ఐదు న్యాయ్‌ల గురించి, 25 గ్యారంటీల గురించి న్యాయ పత్రాలలో ప్రస్తావన ఉందన్నారు. "యువ న్యాయ్ కింద ప్రతి విద్యావంతుడికి అప్రెంటిస్‌గా పనిచేసే అవకాశం కల్పిస్తాం. దీని కోసం ఒక్కొక్కరిపై రూ.లక్ష వెచ్చిస్తాం. మహిళా న్యాయ్ కింద పేదింటి ఆడవారికి ఏటా రూ.లక్ష సాయం అందిస్తాం. కిసాన్ న్యాయ్ కింద రైతులకు రుణమాఫీ చేస్తాం. పంటలకు కనీస మద్దతు ధరలను కల్పించే చట్టాన్ని చేస్తాం. శ్రామిక్ న్యాయ్ కింద ఉపాధి హామీ పథకంలో కనీసం రూ.400 వేతనం ఇస్తాం. హిస్సేదార్ న్యాయ్‌లో భాగంగా సామాజిక, ఆర్థిక సమానతల కోసం జాతీయ జనగణన చేపడతాం. 'రక్షా న్యాయ్' కింద విదేశీ వ్యవహారాల్లో కూడా మార్పులు తీసుకొస్తాం" అని న్యాయ్‌ల గురించి ఖర్గే వివరించారు. తాము అమలు చేయగలిగే అంశాలనే మేనిఫెస్టోలో చేర్చామని స్పష్టం చేశారు.

**"విపక్ష నేతలను ప్రధాని మోదీ జైళ్లలో పెట్టిస్తున్నారు. మా పార్టీపై రూ.3,500 కోట్ల జరిమానాలు విధించారు. ఇప్పుడు మాపై జరిగినవి.. రేపు మీడియాపైనా జరగొచ్చు. దేశ ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు ప్రజలు ఏకమై పోరాడి మోదీని గద్దె దించాలి. ప్రధాని భయపడి ఇప్పటి వరకు మణిపూర్‌కు వెళ్లలేదు.. మా నేత రాహుల్ అక్కడికి వెళ్లారు. భయపడే నేత దేశానికి మంచి చేయలేరు"** అని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే పేర్కొన్నారు.

**మేనిఫెస్టోలోని కీలక హామీలు**

- అగ్నిపథ్ పథకం రద్దు.
- జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా.
- రైట్ టు అప్రెంటిస్ చట్టం.

- మహాలక్ష్మి పథకం కింద పేద మహిళలకు ఏటా రూ.లక్ష సాయం.
- ప్రభుత్వ ఉద్యోగాల పరీక్ష ఫీజుల రద్దు.
- మార్చి 15 నాటికి ఉన్న విద్యా రుణాలు రద్దు. ఆ సొమ్మును ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తుంది.
- మైనార్టీలకు వస్త్రధారణ, ఆహారం, భాషలను పర్సనల్ లా ప్రకారం ఎంచుకొనే హక్కు ఇస్తాం.
- తప్పుడు వార్తల నియంత్రణకు 1978 నాటి ప్రెస్ కౌన్సిల్ ఇండియా చట్టాన్ని సవరిస్తాం.
- దేశవ్యాప్తంగా కుల గణన.. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగింపు.
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు.
- విద్యార్థులకు కూడా ఏటా లక్ష సాయం.
- రైతులకు రుణమాఫీ చేస్తారు.
- కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చి రైతుల ఆదాయాన్ని పెంచుతారు.
- వ్యవసాయ పరికరాలపై జీఎస్టీని తగ్గిస్తారు.

## ఐదు న్యాయ్‌లు ఇవీ..

### 1.హిస్సేదారి న్యాయ్

- సామాజిక, ఆర్థిక కుల గణన.
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్‌ల కల్పనపై 50 శాతం పరిమితి తొలగింపు.
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం ప్రత్యేక బడ్జెట్.
- అటవీ హక్కుల చట్టం క్లెయిమ్‌లను ఏడాదిలోగా పరిష్కరించే హామీ.
- గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను షెడ్యూల్ ఏరియాగా గుర్తింపు.

### 2.కిసాన్ న్యాయ్

- ఈ హామీ కింద రైతులను ఆదుకునే లక్ష్యంతో కాంగ్రెస్ సమగ్ర ప్యాకేజీని ప్రకటించింది.
- స్వామినాథన్ ఫార్ములా ప్రకారం పంటలకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించడం.
- రుణమాఫీ కమిషన్ ఏర్పాటు.
- పంట నష్టానికి 30 రోజుల్లో బీమా పరిహారం ఇచ్చే గ్యారెంటీ.
- రైతుల లబ్ధికి ఎగుమతి-దిగుమతి విధానం.
- వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ మినహాయింపు.

### 3.శ్రామిక్ న్యాయ్

- రైట్ టు హెల్త్ చట్టం.
- ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద ఉన్న కార్మికులందరినీ కలుపుకొని రోజుకు రూ. 400 కనీస వేతనం.
- పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం అమలు.
- అసంఘటిత రంగ కార్మికులకు జీవిత బీమా, ప్రమాద బీమా కవరేజీ.
- ప్రభుత్వంలోని కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాలను నిలిపేయడం.

### 4.యువ న్యాయ్

- కేంద్ర ప్రభుత్వంలో 30 లక్షల ఉద్యోగాల భర్తీకి హామీ.
- యువతకు ఏడాదిపాటు అప్రెంటిస్‌షిప్.
- పేపర్ లీక్‌ను అరికట్టడానికి కఠినమైన చట్టం.
- గిగ్ వర్కర్ల సామాజిక భద్రతకు చర్యలు.
- స్టార్టప్ ఫండ్ ఏర్పాటుకు హామీ.

### 5.నారీ న్యాయ్

- ప్రతి పేద కుటుంబంలో ఒక మహిళకు సంవత్సరానికి రూ.1 లక్ష హామీ.
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు.
- ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల జీవనోపాధిని మెరుగుపరచడం కోసం రెట్టింపు జీతం.
- మహిళల హక్కుల రక్షణకు అధికారి మైత్రి ఏర్పాటు.
- వర్కింగ్ ఉమెన్ కోసం సావిత్రిబాయి పూలె పేరుతో రెట్టింపు హాస్టల్స్.

### మేనిఫెస్టోలోని 10 ఛాప్టర్లలో..

ఎన్నికల మేనిఫెస్టోలో మొత్తం 10 ఛాప్టర్లు ఉన్నాయి. సమానత్వం, యువత, మహిళలు, రైతులు, కార్మికులు, రాజ్యాంగ పరిరక్షణ, ఆర్థిక వ్యవస్థ, సమాఖ్య వ్యవస్థ, జాతీయ భద్రత, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలను ఈ ఛాప్టర్లలో ప్రస్తావించారు. మొత్తం మేనిఫెస్టోలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీల ఫొటోలను హైలైట్ చేశారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రలో పాల్గొన్న ఒక ఫొటోను మేనిఫెస్టో బుక్ లెట్ చివరి పేజీలో పెట్టి.. దానిపై 'హాత్ బద్లేగా హాలాత్' అనే నినాదాన్ని పబ్లిష్ చేశారు. చివరి పేజీకంటే ముందున్న ఓ పేజీలో సోనియా గాంధీ నవ్వుతున్న ఫొటోను పబ్లిష్ చేశారు. ❑

**ఈ సంచిక రూపొందించే నాటికి బీజేపీ మేనిఫెస్టో - 2024 విడుదల కాలేదు.**

# ప్రజల కోసం ప్రత్యామ్నాయ విధానాలు

**సీపీఎం**
**మేనిఫెస్టో**
**2024**

**'బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలి. లోక్‌సభలో సీపీఎం, వామపక్షాల బలాన్ని పెంచాలి. కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకికవాద ప్రభుత్వం ఏర్పడేలా చూడాలి' అని సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. లోక్‌సభ ఎన్నికల కోసం సీపీఎం ఎన్నికల ప్రణాళికను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, బృందాకరత్, నీలోత్పల్ బసు తదితరులతో కలసి ఏప్రిల్ నాలుగో తేదీ గురువారం న్యూఢిల్లీలో విడుదల చేశారు.**



ప్రజల కోసం చేపట్టాల్సిన ప్రజానుకూల, ప్రత్యామ్నాయ విధానాలను ఆ మ్యానిఫెస్టో వివరించింది. కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దశాబ్దకాలంగా సాగించిన పాలనతో లౌకికవాద, ప్రజాస్వామ్య, భారత రిపబ్లిక్ ఉనికే ప్రమాదంలో పడిన నేపథ్యంలో 2024 లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. రాజ్యాంగానికి నాలుగు మూల స్తంభాలుగా భావించే లౌకికవాద ప్రజాస్వామ్యం, ఆర్థిక సార్వభౌమత్వం, సమాఖ్యవాదం, సామాజిక న్యాయం వ్యవస్థలను ఒక పద్ధతి ప్రకారం ధ్వంసం చేసే క్రమాన్ని ఈనాడు భారత్ చూస్తోంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని, పార్లమెంట్‌లో తనకున్న మెజారిటీని దుర్వినియోగం చేస్తూ, నిరంకుశవాద, మతోన్మాద మోడీ ప్రభుత్వం దేశంలోని కార్మికుల హక్కులను నాశనం చేసేందుకు ఫాసిస్ట్ పద్ధతులను ఉపయోగిస్తోంది. తద్వారా భారతదేశాన్ని ప్రపంచంలోకెల్లా అత్యంత అసమానతలతో కలిగిన సమాజాల్లో ఒకటిగా మారుస్తోంది. మరోపక్క ప్రజలను మతపరంగా విభజించేందుకు విషపూరితమైన తన మతోన్మాద సిద్ధాంతాలను ప్రయోగిస్తోంది. ఈ నేపథ్యంలో 18వ లోక్‌సభకు జరిగే ఎన్నికలు కీలకమైన ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. భారత రాజ్యాంగం ద్వారా నిర్దేశించబడిన భారత రిపబ్లిక్ యొక్క లౌకిక, ప్రజాస్వామ్య స్వభావాన్ని పరిరక్షించడానికి ఎన్నికల్లో 'ప్రజలమైన మనం' మన ఓటు ద్వారా ఎన్నికల ఫలితాన్ని నిర్ణయించాలి. ఆ విషయంలో మనం ఎలాంటి పొరపాట్లు చేయరాదు – భారత రిపబ్లిక్ లౌకిక, ప్రజాస్వామ్య స్వభావాన్ని పూర్తిగా ఆవేశంతో కూడిన, అసహనం, విద్వేషం, హింసల ప్రాతిపదిక కలిగిన నిరంకుశవాద, ఫాసిస్ట్, హిందూత్వ దేశంగా మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. దేశంలోని ప్రతి వ్యవస్థలోనూ అనూహ్యమైన రీతిలో చొచ్చుకుపోయి భారతదేశ ప్రజలనరాల్లోకి తన మతోన్మాద విషాన్ని వ్యాపింపచేస్తున్న బీజేపీ మూల సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ బహిరంగంగా ప్రకటిస్తున్న లక్ష్యం ఇదే. ఆ ప్రయత్నాలకు వ్యతిరేకంగా భారతదేశాన్ని కాపాడేలా ఈ లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి.

గత లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఈ ఐదేళ్లలో, భారత్ అనేక పోరాటాలను చూసింది, కార్మికులు, రైతులు, ఆది వాసీలు, దళితులు, మహిళలు, యువత, విద్యార్థుల ప్రజా స్వామ్య పోరాటాల ద్వారా తీవ్ర ప్రతిఘటనను చవి చూసింది. ప్రజలు ఐక్యంగా వుండి పోరాడితే ఈ ప్రభుత్వం సాగించే అణచివేతను, అధికారాన్ని శక్తి సామర్థ్యాలను ఈ పోరాటాలు సవాలు చేయగలవని, ఓడించగలవని రుజువైంది. ముఖ్యంగా రైతుల చారిత్రక పోరాటం దీన్ని రుజువు చేసింది కూడా. ఇదే కాలంలో, సీపీఎం నేతృత్వంలో వామపక్ష ప్రజాస్వామ్య సంఘటన(ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అమలు చేసిన ప్రత్యామ్నాయ విధానాలను మనం చూశాం. ఆర్థికపరంగా చిక్కుల్లో పడేయడా నికి కేంద్రం అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రజానుకూల విధానాలకు, మత సామరస్యతకు ఒక ఆశా కిరణంగా ఆవిర్భవించింది. బీజేపీ దాని మిత్రపక్షాలను ఓడించడమే ప్రతి దేశభక్తుని కర్తవ్యమన్న స్పష్టమైన అవగాహన తో సీపీఎం తన ఎన్నికల ప్రణాళికను భారతదేశ ప్రజల ముం దుంచుతోంది. ఈ సమిష్టి కర్తవ్యాన్ని బలోపేతం చేసేందుకు, కేంద్రంలో లౌకికవాద ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో సాయపడేందుకు తన శక్తివంచన లేకుండా పాటు పడుతుంది. ఇందుకు ప్రజానుకూల విధానాలకు హామీ కల్పించేందుకు గానూ పార్లమెంట్‌లో సీపీఎంకు బలమైన ఉనికి అత్యవసరం.

- రాజకీయాలు, రాజ్యం, ప్రభుత్వం, పాలన నుండి మతాన్ని వేరు చేయాలన్న సూత్రం పట్ల తన నిబద్ధతను ప్రకటిస్తూ, దీని కోసం రాజీ లేని పోరాటం సాగిస్తాం.
- విద్వేష ప్రసంగాలు, నేరాలకు వ్యతిరేకంగా చట్టం కోసం పోరాడుతుంది. సీఏఏను రద్దు చేసేందుకు కట్టుబడి వుంది.
- యూఏపీఏ, పీఎంఎల్ఏ వంటి అన్ని నిరంకుశ చట్టాల రద్దుకు సీపీఎం నిలబడుతుంది.
- స్వతంత్ర సంస్థల స్వయంప్రతిపత్తిని పరిరక్షిస్తూ, బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవడానికి, ప్రజల ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు కట్టుబడి వుంది.
- భారతదేశ ఆర్థిక సార్వభౌమాధికారాన్ని కాపాడే విధానాలకు సీపీఎం కట్టుబడి వుంది.
- ప్రభుత్వరంగ ప్రైవేటీకరణను పునస్సమీక్షించి, తిప్పికొట్టాలి.
- కుబేరులపై పన్ను విధించడంతోపాటు సాధారణ సంపద పన్నును, వారసత్వ పన్నును చట్టబద్ధం చేయాలి.
- ప్రస్తుత లేబర్ కోడ్‌ల స్థానంలో కార్మికుల హక్కులు ప్రతిబింబించేలా కార్మిక అనుకూల చట్టాలు వుండాలి.
- స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి)కు చట్టబద్ధమైన హామీ కల్పించడం ద్వారా భారతదేశ రైతాంగానికి భద్రత కల్పించడంపైనే ఆహార భద్రత ఆధారపడి వుంటుంది.
- పని హక్కును రాజ్యాంగ హక్కుగా చేర్చాలి.
- ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలి. అదనంగా ఉద్యోగాలను సృష్టించగలిగేలా ఎంఎస్‌ఎంఇలను బలోపేతం చేసి, విస్తరించాలి.
- ఎంజీఎన్ఆర్ఈజీఏకు బడ్జెట్‌లో కేటాయింపులను రెట్టింపు చేయాలి. పట్టణ ఉపాధికి హామీ కల్పిస్తూ కొత్త చట్టాన్ని రూపొందించాలి. నిరుద్యోగ భృతిని కల్పించాలి. ఉపాధి నష్టంతో కూడిన వృద్ధికి సంబంధించిన ప్రస్తుత విధానాల్లో మార్పు తీసుకురావడం ద్వారా భారతదేశ ప్రజల లాభాలను నాశనం చేయడాన్ని తప్పనిసరిగా మార్చాలి.
- సార్వజనీన విద్యా హక్కును బలోపేతం చేయాలి. ఉన్నత విద్య ప్రైవేటీకరణను ఆపాలి.
- విద్యా రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు జీడీపీలో కనీసం ఆరు శాతానికి పెంచాలని సీపీఎం కోరుతోంది.
- వాణిజ్యీకరణ, మతతత్వకరణ, కేంద్రీకరణ విధానాలను తిప్పికొట్టడానికి కట్టుబడి వుంది.
- మోడీ ప్రభుత్వం తీవ్రంగా నీరుగార్చిన రాష్ట్రాల రాజ్యాంగ హక్కుల పునరుద్ధరణకు సీపీఎం గట్టిగా నిలబడివుంది.
- కేంద్రం వసూలు చేసే సర్‌చార్జీలు, సెస్సుల్లో వాటాలతో సహా మొత్తం కేంద్ర పన్నుల్లో 50 శాతాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలి. రాష్ట్రాలను ఫణంగా పెట్టి కేంద్రీకరణను పెంపొందించే విధానాలకు స్వస్తి పలకాలి.
- ముఖ్యమంత్రి ప్రతిపాదించే ముగ్గురు నిపుణుల కమిటీ నుండే గవర్నర్‌ను ఎంపిక చేయాలి.
- ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం చట్టాన్ని రూపొందించాలి.
- రిజర్వుడ్ పోస్టుల్లో ఖాళీల తక్షణ భర్తీకి, ఆదివాసీల రాజ్యాంగ, చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణకు, సాంస్కృతిక సమీకరణ ముగింపునకు కట్టుబడి వుంది.
- దేశంలో ఓబీసీలపై సక్రమ డేటాను పొందడానికి గానూ ఎన్నాళ్ళుగానో చేపట్టాల్సి వున్న 2021 సాధారణ జనగణనతోపాటు కుల గణన నిర్వహించడం అవసరం.
- మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లను తక్షణమే అమలు చేసేందుకు, నేరాల్లో మహిళా బాధితులకు న్యాయం అందించే క్రమాలను బలోపేతం చేయాలి.
- ఎన్నికల వ్యవస్థలో ధనబల వినియోగాన్ని అణచివేసేందుకు అత్యవసరంగా ఎన్నికల సంస్కరణలు చేపట్టాలి. ఇందుకు ఎన్నికలకు ప్రభుత్వ నిధులనే ఉపయోగించాలి.
- రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు విరాళాలు ఇవ్వడాన్ని నిషేధించాలి. ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరిచేందుకు కార్పొరేట్లు విరాళాలు ఇవ్వాలి. అటువంటి విరాళాలన్నీ ప్రభుత్వ ఎన్నికల నిధిలో జమచేయాలి. వాటిని ప్రభుత్వ నిధులుగా ఉపయోగించాలి.
- 370వ అధికరణ ద్వారా జమ్మూ కాశ్మీర్‌కు మంజూరైన స్వయం ప్రతిపత్తి హోదాకు సీపీఎం కట్టుబడి వుంది. జమ్మూ కాశ్మీర్ ప్రజల హక్కుల పరిరక్షించేందుకు గానూ ప్రతి వేదికను ఇందుకు ఉపయోగించుకోవడానికి సీపీఎం నిబద్ధతతో వుంది. రాష్ట్ర అసెంబ్లీకి తక్షణమే ఎన్నికలు నిర్వహించడానికి సీపీఎం కట్టుబడి వుంది. ఈ దిశగా మొదటి చర్యగా పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలి.
- మన దేశ ప్రయోజనాలను నెరవేర్చే అలీన విదేశాంగ విధానానికి సీపీఎం కట్టుబడి వుంది. మన దేశ భద్రతకు సంబంధించిన ప్రతి కోణాన్ని పరిరక్షించుకుంటూనే మన పొరుగు దేశాలతో సత్సంబంధాలు వుండాలని భావిస్తోంది.
- ప్రజల జీవన ప్రమాణాలు అత్యంత దయనీయంగా దిగజారిపోవడాన్ని దృష్టిలో వుంచుకుని ఆశ్రిత పక్షపాతం, పెట్టుబడిదారీవాదం, మతం-కార్పొరేట్ సంబంధాలకు సంబంధించిన ప్రస్తుత దిశా నిర్దేశాన్ని పూర్తిగా సవరించాలి.
- సీపీఎం ప్రత్యామ్నాయ విధానాలను ఎన్నికల ప్రణాళిక రెండో భాగంలో ప్రజల ముందు సవివరంగా వుంచుతామని పేర్కొంది. ❑

# బీజేపీ ప్రభుత్వాన్ని మార్చాలి

**సీపీఐ మేనిఫెస్టో 2024**

**దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదలే ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఎన్నికల ప్రణాళిక స్పష్టం చేసింది. 2024లో జరిగే 18వ లోక్‌సభ ఎన్నికలకు పార్టీ ప్రణాళికను సీపీఐ ఏప్రిల్ ఆరో తేదీ శనివారం ఢిల్లీలో విడుదల చేసింది. కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం దేశానికి వినాశకరమైనదిగా రుజువైందని, అందువల్ల ఈ ప్రభుత్వాన్ని మార్చవలసిందేనని పిలుపు ఇచ్చింది. ఆర్థిక నిర్వహణలో వైఫల్యం కారణంగా నరేంద్రమోదీ పరిపాలనలో దేశ ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయని విమర్శించింది.**

'బీజేపీ పరిపాలన ఫలితంగా సంపన్నవర్గాల్లో అసాధారణ రీతిలో సంపద కేంద్రీకరణకు దారి తీసింది. అదే సమయంలో పేదలు మరింత పేదరికంలోకి దిగజారారు. హిందుత్వ సిద్ధాంతమే లక్ష్యంగా ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రణలో ఉన్న బీజేపీ మనదేశ రాజ్యాంగ స్వరూపమైన సెక్యులరిజం, సోషలిజం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి మౌలిక విలువలపై దాడి చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. బీజేపీ తిరిగి అధికారం చేపడితే దేశ ప్రజల కష్టాలు మరింతగా పెరిగిపోతాయి. మోదీ విజయం రాజ్యాంగ లక్ష్యాలకు మరణశాసనంగా మారుతుంది' అని ఎన్నికల ప్రణాళిక హెచ్చరించింది. సీపీఐ ఎన్నికల ప్రణాళికను పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా తదితరులు విడుదల చేశారు.

### బ్యాలట్ ద్వారా బుద్ధి చెప్పాలి

ఈ లోక్‌సభ ఎన్నికలు మన దేశానికి, భవిష్యత్తుకు ఎంతో కీలకమైనవి. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో బీజేపీ విఫలమైంది. జనరంజకమైన, ప్రజల బాధలు, సమస్యలు పట్టించుకునే ప్రభుత్వం మాత్రమే ఈ సంక్షోభం నుండి ప్రజలను బయట పడేయగలదు. దేశంలో సామాజిక వ్యవస్థ, ప్రజల మధ్య సంబంధాలు చాలా ఒత్తిడికి గురవుతున్నాయి. కానీ మోదీ గ్యారంటీలు, వికసిత్ భారత్ పేరుతో దేశ ప్రజల దృష్టిని బీజేపీ దారి మళ్లించే ప్రయత్నం చేస్తోంది. అదే సమయంలో మన దేశ వ్యవసాయదారులు, గ్రామీణ ప్రజలు




గతంకంటే దారుణ కష్టాలు అనుభవిస్తున్నారు. మోదీ ఇంతకు ముందు ఇచ్చిన గ్యారంటీలు, అచ్చేదిన్ వాగ్దానాలు ఏమైపోయాయో అందరికీ తెలిసిందే. మన స్వాతంత్ర్య సమర యోధులు లౌకిక, ప్రజాస్వామ్య, సంక్షేమరాజ్యంగా భారత దేశాన్ని తీర్చిదిద్దాలని కోరుకున్నారు. కానీ బీజేపీ ప్రయత్నాలతో ఈ విలువలన్నీ ప్రజాజీవితం నుండి తుడిచిపెట్టుకుపోతున్నాయి. నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు దారుణంగా పెరిగిపోయాయి. ఎన్నికల బాండ్ల బాగోతం వెలుగులోకి వచ్చాక ఆధునిక భారతదేశ చరిత్రలో బీజేపీ అత్యంత అవినీతికర పార్టీగా అవతరించింది. నయానో భయానో ఈ ఎన్నికల్లో గెలిచి తీరాలని బీజేపీ భావిస్తున్నదని, ఇందుకోసం ప్రతిపక్షాలను భయపెట్టేందుకు ఈడీ, సీబీఐ, ఆదాయపన్ను శాఖ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కు ద్వారా తీర్పు చెప్పి మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాలి. తగిన బుద్ధి చెప్పాలి. ఇందుకు పార్లమెంటు లోపలా, వెలుపలా ప్రజల తరపున పోరాటం చేసేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ జనాభిప్రాయాన్ని కూడగడుతున్నది'.

### ఎన్నికల ప్రణాళికలో కీలకాంశాలు ఇవే

- స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, లౌకికతత్వం, సోషలిజం, సమాఖ్యవాదం పెంపొందించేందుకు సీపీఐ పోరాడుతుంది.
- అసమానతల నిర్మూలన, సంపద పన్ను, వారసత్వ పన్ను, కార్పొరేట్ పన్ను పెంపుదల వంటి చర్యల ద్వారా దేశ వనరుల వృద్ధి చర్యలను సీపీఐ ప్రవేశపెడుతుంది.
- విద్య, వైద్య రంగాలకు నిధుల పెంపు, విద్యా, ఆరోగ్య రంగాలలో మౌలిక **(మిగతా 15వ పేజీలో)**

# 2024 ఎన్నికలలో ఇండియా కూటమిని ఎందుకు గెలిపించాలి?



భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక - వడ్డే శోభనాద్రీశ్వరరావు

- 1.భారత రాజ్యాంగం, ప్రాధమిక హక్కులు, పౌరులకు, పత్రికలకు స్వేచ్ఛా స్వాతంత్రాలు, రాష్ట్రాల హక్కులు, మత సామరస్యం కాపాడబడాలంటే..
- 2. M.S.స్వామినాధన్ సిఫార్సు C2+50% చట్టబద్ధ M.S.P. లభించి రైతుల ఆదాయం మెరుగుపడాలంటే.. ఎకరాకు వరి పంటకు రూ.683/-x22.5 క్వింటాల్, రూ.15,000/-, మినుముకు రూ.1,862/- × 4 క్విం రూ.7,448/- పత్తికి రూ.2022×5 క్వింటాల్ రూ. 10,060/- వేరుశనగకు రూ.1,562×7 క్వింటాల్ రూ. 11,500/- అదనంగా ఆదాయం రైతుకు రావాలంటే..
- 3.రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ జరగాలంటే..
- 4.ఆహారోత్పత్తులపై జి.యస్.టి.ని తొలగించడమే కాకుండా రైతులకు మేలు చేకూర్చేలా ఎగుమతి దిగుమతి విధానం సవరించబడాలంటే..
- 5.ప్రకృతి వైపరీత్యాల వలన జరిగిన పంట నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ 30 రోజుల లోపల అందించబడాలంటే..
- 6.కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లు రద్దు కావాలంటే..
- 7.రాజ్యాంగ విరుద్ధంగా, పౌరహక్కులను హరిస్తూ మోడి తెచ్చిన ఉపా (UAPA), MLA ఇది సెబీ, చట్ట సవరణలు, మున్నగునవి ఉపసంహరించబడాలంటే..
- 8.కేంద్ర ప్రభుత్వంలో మరియు ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగావున్న 30 లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయబడాలంటే..
- 9.కేంద్ర ప్రభుత్వోద్యోగాలలో మహిళలకు 50% రిజర్వేషన్, పేద కుటుంబాలలో ఒక మహిళ పేర సంవత్సరానికి లక్ష రూపాయలు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకాలలో మహిళా శ్రామికులకు కేంద్రం ఇచ్చు సహకారాన్ని రెట్టింపు చేయడం మున్నగు కార్యక్రమాల ద్వారా మహిళలకు న్యాయం చేకూర్చబడాలంటే..
- 10.పేదలకు విద్యా, వైద్య సౌకర్యాలు అందుబాటులో వుండాలంటే..
- 11.మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకంతోసహా కనీస వేతనం రూ.400/-గా నిర్ణయించబడటం మున్నగు అంశాలు అమలై సమాజంలో అన్ని వర్గాల కష్ట జీవులకు, పేదలకు, న్యాయం చేకూరాలంటే INDIA కూటమిని అధికారంలోకి తీసుకురావలసిన ఆవశ్యకత వుంది.
- 12. ఎలక్ట్రిసిటి బిల్ 2020ను రద్దు చేసి, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించడం ఆగిపోవాలంటే.. గత పదేళ్లలో మోడి, బి.జె.పి. ప్రభుత్వం దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే కాక, దేశ సంపదను ప్రభుత్వ ఆస్తులను, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, విద్యుత్ సంస్థలు పి.ఎస్.యూలతో సహా కారు చౌకగా అదానీ, అంబానీలకు కట్టబెడుతూ, పేదలపై పన్నుల భారాన్ని పెంచడమేకాక, దేశంలో అక్రమ పద్ధతులలో వేలకు వేల కోట్ల రూపాయలను ఎలక్టోరల్ బాండ్స్ రూపంలోనూ, విడిగాను దండుకొంటూ.. ప్రతిపక్ష నాయకులపైన పత్రికలు, మ్యాగజైన్స్ ఎడిటర్లతో సహా జర్నలిస్టులపైన కేసులు, దాడులు, నెలలు, సంవత్సరాల పర్యంతం బెయిలు రానీయకుండా అత్యంత అమానుషంగా ప్రవర్తిస్తూ, రాష్ట్రాల హక్కులను హరిస్తూ, మత ఘర్షణలను ప్రోత్సహిస్తూ మైనారిటీల ఆస్తులను, మసీదులను, చర్చిలను కూలగొడుతున్న బి.జె.పి.ని చిత్తు చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలిన సమయం ఆసన్నమయ్యింది.

### ఆంధ్రప్రదేశ్లో INDIA కూటమిని గెలిపించాల్సిన ఆవశ్యకత

- 1.విభజిత నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర సత్వర అభివృద్ధి కోసం.. రాష్ట్రానికి పదేళ్లపాటు ప్రత్యేక హెూదాతోపాటు ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక నిధులు ప్రోత్సాహకాలు, ఉమ్మడి ఆస్తుల విభజన జరగాలంటే..
- 2.భూసేకరణ, పునరావాసాలతో సహా పోలవరం జాతీయ ప్రాజెక్టు పూర్తి చేయబడాలంటే..
- 3.రాష్ట్రంలో ఒక మేజర్ పోర్టు నిర్మించబడాలంటే
- 4.కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంతోపాటు, 32 మంది తెలుగు బిడ్డల ఆత్మ బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ రద్దు కావాలంటే.. బొగ్గు, ఇనుము, గనులు కేటాయించబడాలంటే..
- 5.అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి కావాలంటే..
- 6.ఇండస్ట్రియల్ కారిడార్లు, కె.జి.బేసిన్ గ్యాస్, పెట్రోలియంలలో రాష్ట్ర వాటా సాకారమవ్వాలంటే..
- 7.విశాఖ రైల్వే జోన్, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ చేపట్టబడి రాష్ట్రంలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ వున్న లక్షలాది మంది విద్యావంతులైన **(మిగతా 15వ పేజీలో)**

# 'దక్షిణ' ద్వారం తెరుచుకుంటుందా?



- కె.శ్రీనివాస్

**శివుడూ పార్వతీ పెళ్లి చేసుకుంటుంటే, అంబానీ చిన్న కొడుకు పెళ్లికి వచ్చినట్టుగా, పోలోమంటూ దేవ లోకంలోని వీఐపీలు అందరూ హిమాలయాలకు వెళ్లారట. ఉత్తరం దిక్కున బరువు ఎక్కువై భూమి ఒకవైపు ఒరిగిపోవడం మొదలుపెట్టింది. దక్షిణం వైపు బరువు పడితే కానీ, తూకం సరిపోదని అనుకుని అగస్త్య ముని దక్షిణాదికి వచ్చి, బేలన్స్ చేశాడట. ఇదికాక మరొక కథ కూడా ఉంది.**

వింధ్య పర్వతం అడ్డూ ఆపూ లేకుండా నిలువుగా పెరిగిపోవడం మొదలు పెట్టిందట. ఆకాశంలోకి చొచ్చుకువెళ్లి సూర్యుడికీ చంద్రుడికీ కూడా అడ్డుపడి, గ్రహగతులు ఆగిపోయేట్టు చేసిందట. ఉత్తరానికీ దక్షిణానికీ రాకపోకలు అసాధ్యమయ్యాయట. లోకమంతా వచ్చి మొరపెట్టుకుంటే, అగస్త్యుడు వింధ్య దగ్గరికి వచ్చి, నేను దక్షిణం వైపు పోవాలి దారివ్వమని అడిగాడు. అగస్త్యుడంటేనే పర్వతాలనే కదిలించగలవాడు అని అర్థం కదా, అందుకని గౌరవంగా, వింధ్యుడు తలవంచి, తన ఎత్తు తగ్గించుకున్నాడు. నేను మళ్లీ దక్షిణం నుంచి ఉత్తరం వైపుకు తిరిగివెడతాను. అప్పటిదాకా ఇట్లాగే ఉండు అని అగస్త్యుడు చెప్పాడు. అగస్త్యుడు తిరిగి ఉత్తర దిక్కు వెళ్లలేదు. వంగిపోయిన వింధ్య అట్లాగే, దక్షిణానికి దారి ఇస్తూ మిగిలిపోయింది. దక్షిణం వాళ్లు, ముఖ్యంగా తమిళుల కథలో కొన్ని చేర్పులుంటాయి. తమిళుల మొదటి వ్యాకరణం పేరు అగత్తియం. రాసింది అగస్త్యుడు. అతను ఉత్తరాది నుంచి వస్తే వచ్చాడు కానీ, దక్షిణంలో స్థిరపడి, ద్రావిడం నేర్చుకుని భాషకు సేవ చేశాడు. ఆర్య ద్రావిడ సమాజాలకు మధ్య అవరోధాలను తొలగించి, ఉత్తరం వారు దక్షిణానికి వలసరావడానికి, దక్షిణాన్ని లోబరచుకోవడానికి అగస్త్యుడిని ఒక సంకేతంగా చెప్పేవాళ్లు ఉన్నారు. బలి చక్రవర్తి కథ కూడా అటువంటిదే అంటారు! ప్రధానమైన ద్రావిడ భాషలు మాట్లాడే ప్రాంతాలు భారత దేశంలో దక్షిణంలో ఉన్న మాట నిజమే కానీ, అంతమాత్రమే చెబితే సరిపోదు. మూడు వైపులా సముద్రం ఆవరించిన ద్వీపకల్ప భాగంలో ఉన్నాయని చెప్పుకోవాలి. మధ్య ఆసియా నుంచి ఉత్తర భారతంలోకి ప్రవేశించిన ఆర్యులు ఐదు నదుల మైదానాల నుంచి క్రమంగా గంగా యమునా బేసిన్‌లోకి విస్తరించి తమదైన నాగరికతను నిర్మించుకున్నారు. తమ ప్రస్థానాన్ని దక్షిణాదికి కొనసాగించడం వారికి అంత సులభం కాలేదు. వంగ దేశం నుంచి సముద్రతీరం గుండా ఓఢ్రదేశం మీదుగా దక్షిణానికి రావడం ఏమంత సులువు కాలేదు. మరణానంతర వైతరిణి ఒరిస్సాలోనే ఉందట. వింధ్య పర్వత శ్రేణి, దండకారణ్యం నైసర్గిక కుడ్యాలుగా నిలిచాయి. అశోకుడు ఆంధ్ర, కర్ణాటకలలో కూడా శిలా శాసనాలు వేశాడు. కానీ, ఈ ప్రాంతాలు మగధలో భాగమయ్యాయో లేదో చెప్పలేము. మౌర్యులు, శాలివాహనులు, కాకతీయులు, మొగలులు, కుతుబ్ షాహిలు దిగువకు దూసుకుపోయారు కానీ, దక్షిణాన ఎంతో కొంత కొస అజేయంగానే మిగిలిపోయింది. భారతీయ జనతా పార్టీ పదేళ్ల రాజసూయంలో కూడా దక్షిణాగ్ర భాగం ఇంకా స్వాధీనం కాలేదు.

దక్షిణ రాష్ట్రాలలో కలిగే ప్రయోజనానికి మించి నరేంద్రమోదీ ఎక్కువ కష్టపడుతున్నారు. 'సౌత్ పుష్' అంటున్నది జాతీయ ఇంగ్లీషు మీడియా. కొరకరాని కొయ్యగా ఉన్న దక్షిణాదిని ఈసారి లొంగదీసుకోవాలని ఆయన పట్టుదలగా ఉన్నారని చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా దేశమంతటికీ తన రాజకీయ ప్రాబల్యాన్ని విస్తరించినా, ఆ పార్టీలో కూడా ఉత్తరాది నాయకత్వానిదే పైచేయి అయినా, స్థానికంగా అటానమీని అనుమతించింది. అనేక రంగాలలో ఉత్తరాది ఆధిపత్యానికి తానొక రాయబారిగా కాంగ్రెస్ వ్యవహరించలేదు. దక్షిణ భారతంలో వ్యక్తమైన స్థానిక ఆకాంక్షలను నెరవేర్చింది, భయాలను గౌరవించింది. ప్రాంతీయ పార్టీ చేతిలో ఓడిపోవడం తమిళనాడుతోనే కాంగ్రెస్ మొదటిసారిగా రుచిచూసింది. బీజేపీ పరిస్థితి వేరు. అతి బలహీనంగా ఉన్న కాలం నుంచి (జన సంఘంగా ఉన్నప్పుడు కూడా) దాన్ని ఉత్తరాది పార్టీగానే దక్షిణాది జనం భావించారు. ఎమర్జెన్సీ తరువాత కానీ, 1980 దశకం చివరలో కానీ ఉత్తరాది మధ్యే వాద పార్టీ ప్రభంజనాలు దక్షిణాదిని పెద్దగా కదిలించలేదు. తమ జాతీయ వాదానికి దేశవ్యాప్త ఆమోదం కోసం, 'ప్రగతిశీల' భారతంలో విజయం కోసం భారతీయ జనతా పార్టీకి బెంగాల్‌లోను, దక్షిణ రాష్ట్రాలలోను గెలుపు కావాలి. అతి సూక్ష్మ స్థాయి నుంచి పనిచేసుకుంటూ పథకం ప్రకారం బలాన్ని పెంచుకోగలిగిన 'శక్తి' బీజేపీకి ఉంది. కార్యశీలురైన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఫలితాలు ఎట్లా ఉన్నా, వారి ప్రయత్నాన్ని

మెచ్చుకోవచ్చు.

అశోకుడు కాకపోయినా, హర్షుడు కొంత, ఔరంగజేబు మరికొంత దక్షిణంలోకి చొచ్చుకు వచ్చి ఆ తరువాత ఆగిపోయారు. గోవా ఎట్లాగూ భౌగోళికంగా తప్ప సాంస్కృతికంగా దక్షిణం కాదు. తక్కిన ఐదు రాష్ట్రాలూ ఉత్తరాది ప్రభావం నుంచి సమానంగా రక్షించుకున్నాయని చెప్పలేము. కర్ణాటక విజయం బీజేపీకి కొత్తేమీ కాదు. పొత్తులతోనో, ఫిరాయింపులతోనో బీజేపీ కర్ణాటకలో ఒకటి రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 2014లోనే ఒక మైనర్ భాగస్వామిగా అయినా ప్రభుత్వంలో ఉన్నది. తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో ప్రభావశీలమైన ఉనికితో ఎప్పటి నుంచో ఉంటూ, గత పార్లమెంటు ఎన్నికలలో నాలుగు స్థానాలతో, సుమారు 20 శాతం ఓట్లతో పెద్ద విజయ విస్తరణ చేసుకోగలిగింది. కేరళలో 2016లో ఒక ఎమ్మెల్యేను గెలిపించుకున్న బీజేపీ, 2021లో 11 శాతానికి పైగా ఓట్లను సంపాదించింది. మరి కొత్తగా, దక్షిణ ద్వారాన్ని బద్దలు కొట్టడమనే ఘనకార్యంలో మోదీ ప్రస్తుతం ఉన్నారని అనడం సమంజసమేనా? అక్కడక్కడా బలంగానో, బలహీనంగానో ఉనికిలో ఉన్నప్పటికీ, సారాంశంలో దక్షిణాది ఇంకా పట్టుబడలేదన్న లోటు మాత్రం బీజేపీకి ఉన్నది. వింధ్య పర్వతం ఎక్కడున్నదో గుర్తించి, దాన్ని వంచగలిగితే, దక్షిణంలోకి మహాద్వారం తెరుచుకుంటుందని ఆశిస్తున్నది.

అంచుల్లో పలచబడుతున్నప్పటికీ, లోలోపలి అడవి దట్టంగానే మిగిలినట్టు, దక్షిణాదిలో కూడా కొంత అతి దక్షిణం ఉన్నది. భావపరంగానూ, భౌగోళికంగానూ కూడా ఉత్తరత్వానికి కొరుకుడుపడని కంచుకోటలు దక్షిణంలో మిగిలే ఉన్నాయి. వాటిని కొట్టగలిగితే, గంగా కావేరీ అనుసంధానం జరిగినట్టే. బీజేపీకి, మోదీకి అదే అంతిమ లక్ష్యం కావచ్చును కానీ, ప్రస్తుతం దానిమీదే గురిపెట్టారనడం సరికాదు. ఎందుకంటే, మోదీ 'సౌత్ పుష్' దాడి వ్యూహం కాదు. ఆత్మరక్షణా వ్యూహం మాత్రమే. ఉత్తరాదిలో ఈ సారి తరిగిపోయే అవకాశమున్న సంఖ్యను దక్షణాదిలో భర్తీ చేసుకోవడం కోసం మాత్రమే ఈ ప్రత్యేక ప్రయత్నం. తమిళనాడు, కేరళల్లో ప్రస్తుతానికి కొత్త ఆశ ఏమీ లేదు. ఆ రెండు రాష్ట్రాలలో గతం కంటె నాలుగు ఓట్లు పెంచుకోవడమే లక్ష్యం. అతి దక్షిణం అని భౌగోళికంగా చెప్పగలిగే రాష్ట్రాలు ఆ రెండూ. కర్ణాటకలో ఒకవేళ కాంగ్రెస్ మీద విముఖత కలిగినా, గతంలో ఉన్న బలాన్ని దాదాపుగా నిలుపుకోవడమే తప్ప అదనపు ప్రయోజనం లేదు. సాంస్కృతికంగా, సామాజికంగా ఆ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు ఈ పాటికే ఉత్తరాది ప్రభావంలో పడిపోయాయి. కొత్తగా భావజాల పరంగా గెలుచుకునే ప్రాంతాలు, వర్గాలు ప్రస్తుతం అయితే లేవు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించినప్పటికీ, అందులో బీజేపీ పాలు అతి తక్కువ. కాకపోతే, దీర్ఘకాలికంగా బీజేపీ విస్తరణ ప్రయత్నాలకు ఆ విజయం తోడ్పడవచ్చు. తెలంగాణలో బీజేపీ ప్రభావం పెరుగుతున్నదన్న వార్తలు నిజమైతే మాత్రం, అది ఆ పార్టీకి కీలకమయిన విజయం అవుతుంది. దక్షిణ దిశగా తోసిన 'తోపు' ఫలితం ఇచ్చినట్టు.

ఎందువల్ల అంటే, తెలంగాణలో అధిక ప్రభావం చూపగలిగితే కనుక, బీజేపీ వెంటనే రెండో స్థానానికి, అతి త్వరలో అధికార స్థానానికి చేరుకోగలుగుతుంది. తెలంగాణలో బలం పెంచుకోవడం అంటే, పొత్తుల సాయంతో ఆంధ్రాలో నాలుగు సీట్లు సంపాదించుకున్నట్టు కాదు. తన సొంత 'సిద్ధాంత' బలంతో సంపాదించుకున్నట్టు. తన వేళ్లను తెలంగాణ నేలలో బలంగా నాటుకున్నట్టు. తెలంగాణ సమాజం ఆ మేరకు బీజేపీయీకరణం చెందినట్టు కూడా. దాని పర్యవసానాలు, ప్రభావాలు ఎట్లా ఉంటాయో సామాజిక, రాజకీయ పరిశీలకులు పోల్చుకోవచ్చు. తమిళనాడు, కేరళ అతి దక్షిణం అయినట్టు, తెలంగాణ ఎప్పటి నుంచో పలచబడిన దక్షిణం. చారిత్రకంగా ఉత్తర, దక్షిణాల మధ్య ఉండడం వల్ల కావచ్చు, ఉత్తరాది వలసలు అధికంగా ఉండడం వల్ల కావచ్చు, ముస్లిమ్ పాలకుల కింద దీర్ఘకాలం ఉన్న చరిత్ర వల్ల కావచ్చు, తెలంగాణ బీజేపీకి పంట పండించుకోవడానికి అనువైన క్షేత్రంగా ఉండింది. అయితే, అక్కడ భూస్వామ్యానికి, రాచరికానికి వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టు, విప్లవ చరిత్ర ఉన్నది కాబట్టి, మితవాద రాజకీయాలకు అనువైన పరిస్థితులు ఇంతకాలం లేకుండా పోయాయి. తెలంగాణ వేదిక మీద ప్రజా ఉద్యమ రాజకీయాలు బలహీనపడి, సామాజిక దృష్టి కోణాలు పలచబడడం మొదలయింది. దురదృష్టవశాత్తు, అందుకు ప్రత్యేక రాష్ట్ర సాధన అనంతర దశాబ్ద కాలం కూడా తోడ్పడింది. ఒకనాడు ఎక్కడ ప్రజా ఉద్యమాలు బలంగా ఉన్నాయో అటువంటి చోట్లనే ఇప్పుడు మత ఉద్రిక్తతలు, తీవ్ర జాతీయవాదంపై ఆకర్షణలు పెరిగిపోయాయి. చిన్న పట్టణాలలో, జిల్లా కేంద్రాలలో యువకులు, విద్యార్థులు మోదీ ఆకర్షణలో ఉన్నారని, 'కొత్త' రాజకీయాలంటే ఉగ్రూతలూగుతున్నారని వింటున్నప్పుడు, తెలంగాణలో అనూహ్యమైనది జరగబోతున్నదా అనిపిస్తున్నది. నాలుగైదు స్థానాలు గెలుస్తుందని కొందరు, లేదు, తొమ్మిది స్థానాల దాకా గెలిచి కాంగ్రెస్‌ను రెండో స్థానంలోకి నెట్టివేస్తుందని మరికొందరు లెక్కలు వేస్తున్నారు. ఏది నిజమైనా, అది బీజేపీని తెలంగాణలో రెండో స్థానానికి తెస్తుంది. బీఆర్ఎస్‌లో కొందరిని, కాంగ్రెస్‌లో కూడా కొందరిని తమ వైపు తిప్పుకుని చక్రం తిప్పగల అవకాశం బీజేపీకి వస్తుంది. 'మితవాద' జాతీయ జీవనస్రవంతిలో కలిసే అవకాశం తెలంగాణకు లభిస్తుంది. ❑

# వికసిత భారత్ విశ్వరూపం!



- జి.శ్రీరామమూర్తి

**ఆర్థికాభివృద్ధిలో దేశం ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నది. ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థికశక్తిగా రూపుదిద్దుకుంది. బ్రిటన్‌ను మించిపోయింది. ఐదేళ్లలో జర్మనీని, జపాన్‌ను కూడా దాటేసి తృతీయ ఆర్థికశక్తిగా ఆవిర్భవిస్తోందని జోస్యాలు వెలువడ్డాయి. ఇండియా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు ఈ ఏడాది 6.5 శాతానికి చేరుకుంటుందని ప్రపంచ ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇది 8 శాతాన్ని తాకుతుందని కేంద్ర ఆర్థిక శాఖ సగర్వంగా చాటుకుంటోంది. త్వరలోనే సంపన్నదేశం కావడం ఖాయమని, అయితే వచ్చే పాతికేళ్లపాటు ఏటా 8 శాతం వృద్ధిని సాధిస్తే తప్ప ఆ స్థాయిని చేరుకోలేమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇలా, వృద్ధిరేటు గురించి ఇంత గొప్పలు పోతున్నప్పటికీ మానవాభివృద్ధిలో చాలా వెనుకబడి ఉన్నాము.**

వ్యవసాయ రంగం మీద ఆధారపడి బతుకులీడుస్తున్న అసంఖ్యాకమైన మిగులు కార్మిక శక్తిని ఇతర లాభసాటి ఉత్పాదక రంగాల్లోకి బదలాయిస్తేనే దేశం నిజంగా అభివృద్ధి చెందినట్లని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే కార్మికుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్నీ నొక్కి చెబుతున్నారు. ఇంజనీరింగ్ వంటి పట్టభద్రుల్లో సైతం ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కొరవడిన చేదు వాస్తవం మన ముందు ఉంది. మన దేశంలో తయారీరంగం ఇంకా పుంజుకోవలసి ఉంది. చైనా ఆ రంగంలో దూసుకెళ్లడం వల్లే విశేష స్థాయిలో ఉద్యోగాలు కల్పించగలిగింది.

చైనాతో విసిగిపోయిన బహుళజాతి సంస్థలు తమ పెట్టుబడులను మన దేశానికు తరలిస్తాయన్న అంచనాలు ఫలించలేదు. పాలకవర్గాలే రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను మతపరంగా విభజించి నిరంతరం ఘర్షణ వాతావరణాన్ని పోషిస్తుంటే పెట్టుబడులు ఏ విధంగా తరలివస్తాయి ? అందుకే మన తయారీరంగం ఇంకా దేశీయ మార్కెట్ దయాదాక్షిణ్యాల పైనే ఆధారపడి బతుకుతున్నది. అంతర్జాతీయ మార్కెట్‌ను ఆకట్టుకుని ఎగుమతులను పెంచుకోలేకపోతున్నది. ఉత్పత్తిని బట్టి ప్రోత్సాహం (ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్-పిఎల్ఐ) పథకమూ ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు.

మన జీడీపీలో సర్వీసుల రంగం వాటా 50 శాతం పైనే ఉండగా తయారీరంగం అట్టడుగున 16-17 శాతం దాటడం లేదు. దాన్ని 25 శాతానికి పెంచాలనే లక్ష్యంతో 2014లో ప్రధాని నరేంద్ర మోడీ మేక్ ఇన్ ఇండియాను ఆవిష్కరించినా అది విఫలమయింది. తయారీ రంగంలో పరిశ్రమలు అధిక సంఖ్యలో ఏర్పాటయితే తప్ప వ్యవసాయరంగం నుంచి అదనపు కార్మికశక్తిని బదలాయించడం సాధ్యపడదు. సర్వీసుల రంగంలో విశేష ప్రగతికి తోడ్పడుతున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) వంటి రంగాలకు అవసరమైన ఉన్నత విద్యావంతులు సాగు రంగంలోని కార్మిక శక్తి నుంచి లభించరు. వారికి ఉపాధి కల్పించగల ప్రత్యామ్నాయ రంగం తయారీరంగమే. దేశంలోని మొత్తం కార్మికశక్తిలో 45.76 శాతం మంది ప్రస్తుతం వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారని పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే-పిఎల్ఎఫ్ఎస్ గణాంకాలు వెల్లడించాయి.

దేశ జనాభాలో అత్యధికంగా ఉన్న పేదల బతుకులను బాగు పరచనంత వరకు ప్రపంచంలో ఐదో ఆర్థికశక్తిగా ఎదిగామని, మూడో స్థాయికి దూసుకుపోతున్నామని చెప్పుకుని మురిసిపోయే హక్కు, అర్హత మనకు ఉండవు. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా ఆహారోత్పత్తి చేసే దేశాల్లో మన దేశం రెండోస్థానంలో ఉన్నా ప్రపంచ ఆకలిసూచీలోని 125 దేశాల్లో మన ర్యాంకు మాత్రం 111. ప్రపంచంలో పోషకాహారం లభించని జనంలోని పావు వంతు మందికి మన దేశం నిలయంగా ఉంది. 19 కోట్ల మంది ఆకలితో అలమటిస్తున్నారు. 2022లో వెలువరించిన ప్రపంచ ఆకలిసూచీ ప్రకారం 121 దేశాల్లో ఇండియా ర్యాంకు 107 కాగా, మనకంటే ఎంతో మెరుగైన స్థితిలో పాకిస్తాన్ (99వ స్థానం), నైజీరియా (103వ స్థానం) ఉండడం గమనించవలసిన విషయం. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం దేశంలో ఐదు, ఐదేళ్లలోపు పిల్లల్లో మూడింట ఒక వంతు మంది వయసుకు తగ్గ పొడవులో లేరు. ప్రతి ఐదుగురిలో ఒకరు ఎత్తుకు తగ్గ బరువు లేరు.

గత పదేళ్లలో దేశంలో పాతిక కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారనే ఒక ప్రచారం ఈ మధ్య హఠాత్తుగా ఊపు అందుకుంది. ప్రధాని నరేంద్రమోడీ పాలనలో 2022-23

నాటికి 24.8 కోట్ల మంది పేదలు బహుముఖీన పేదరికం నుంచి విముక్తి పొందారని నీతి అయోగ్ తన కొత్త నివేదికలో వెల్లడించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ప్రధాని నరేంద్ర మోడీ వంటి వారు దీనిని పదే పదే చెప్పుకుంటున్నారు. అయితే చాలామంది ఆర్థికవేత్తలు దీనిని సహేతుకమైన ప్రశ్నలతో, ప్రతివాదనలతో ఖండించారు. 2014 నుంచి 2022 వరకు ఎనిమిదేళ్లపాటు వినియోగ ఖర్చుకు సంబంధించిన సర్వేలు జరుపకుండా బహుముఖీన దారిద్ర్య సూచిని రూపొందించడం ఒక రాజకీయ కుట్ర అని బాత్ యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ సంతోష్ మెహ్రోత్ర ఎండగట్టారు. నీతి అయోగ్ చెబుతున్నట్టు ప్రజల బతుకుల్లో ఏమైనా మెరుగుదల వచ్చిందీ అంటే, మోడీ పాలన కంటే ముందున్న ప్రభుత్వాలు ఆరోగ్యం, విద్య, సంక్షేమరంగాల్లో వేసిన పునాది, చేసిన కృషి వల్ల సాధ్యమైనదిమాత్రమేనని మెహ్రోత్ర వాఖ్యానించారు. పూర్వపు యూపీఏ ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని, ఆహార భద్రతాచట్టాన్ని తెచ్చి విద్య, ఆరోగ్య, ఆహార రంగాల్లో బాగా నిధులు వినియోగించిన విషయాన్ని మెహ్రోత్ర గుర్తు చేశారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగిన దాఖలాలు లేకుండా బహుముఖీన పేదరికం నుంచి బయటపడినట్టు చెప్పలేమని నిపుణులెందరో అభిప్రాయపడుతున్నారు.

ప్రధాని మోడీ ప్రభుత్వం 2014 నుంచి అమలు చేసిన అనేక పథకాలు ప్రజలను పేదరికం ఊబిలోనుంచి బయటకు లాగాయని బీజేపీ పెద్దలు చెప్పుకుంటున్నారు.

> **ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా ఉచితంగా ఆహారధాన్యాల సరఫరా, పీఎం ఆవాస్ యోజన ద్వారా పేదలకు ఇళ్ళు, జన్‌ధన్ యోజన ద్వారా నగదు బదిలీ, ఇంకా ఉజ్వల యోజన ద్వారా చౌక వంటగ్యాస్ వంటి అనేక పథకాలు పేదల బతుకులను మార్చివేశాయని అమిత్ షా వంటి పెద్దలు చాటింపు వేస్తున్నారు. ఈ పథకాలు చేస్తున్న మేలు సముద్రంలో నీటి బొట్టు కంటే బహు తక్కువ అనడం అసంబద్ధం కాబోదు. అలాగే ఇవి మోడీ ప్రభుత్వమే కొత్తగా ప్రవేశపెట్టినవి కావు.**

దక్షిణాదిలో రూపాయికే కిలోబియ్యం, ఉచితబియ్యం, అమ్మ కాంటీన్లు, అన్న కాంటీన్లు, ఉచిత ఇళ్ళు వంటి పథకాలు ఎన్నో చిరకాలంగా అమలవుతున్నాయి. ఎన్ని చేసినా అవి కలిగించే ప్రయోజనాన్ని అదుపులేని ద్రవ్యోల్బణం, అధిక ధరలు హరించివేస్తున్నాయి. పేదల బతుకులను ఉన్నచోటి నుంచి అరసెంటిమీటరైనా ముందుకు జరపలేకపోతున్నాయి. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు ఏ చిన్న పథకమూ అమలు చేయనక్కరలేదు. ధరలను కొంతకాలమైనా సహేతుకస్థాయిలో నిలిపి ఉంచితే చాలు. పేదరికం తప్పనిసరిగా తగ్గి తీరుతుంది. అది చేయకుండా ఇంకేమి చేసినా వృథాయే.

గోరు చుట్టు మీద రోకటి పోటులా దేశంలో ఆర్థికవ్యత్యాసాలు గత పదేళ్లలో ఎంతగా పెరిగిపోయాయో గణాంక వివరాలు కళ్ళకు కడుతున్నాయి. ఈ వ్యత్యాసాలు బ్రెజిల్, దక్షిణాఫ్రికా, అమెరికాలోకంటే భారత్‌లో ఎక్కువగా, మరీ ఘోరంగా ఉన్నాయని రుజువైంది. మన దేశంలో అత్యంత ఐశ్వర్యవంతులయిన ఒక్కశాతం మంది గుప్పెట్లోనే 40.1 శాతం సంపద కేంద్రీకృతమైనట్టు నివేదిక చాటింది. నలుగురు ఆర్థికవేత్తలు 2022-23లో పారిస్ నుంచి నిగ్గుతేల్చిన ఈ స్థాయి వ్యత్యాసాలను ఇండియాలో 1961 నుంచి ఎన్నడూ చూడలేదని ఆ నివేదిక స్పష్టం చేసింది. సంపాదనలోనే కాదు, ప్రజల అదాయాల్లోనూ ఈ తేడా కొట్టొచ్చినట్టుగా ఉందని పేర్కొంది. భారత్‌లో బిలియనీర్ రాజ్ ఏలుబడి సాగుతోందని ఆ ఆర్థికవేత్తలు వ్యాఖ్యానించారు. కుల, మత శ్రేణుల వారీగా అసమానతలు పేరుకుపోయాయని అభిప్రాయపడ్డారు. భారతీయ సమాజం కర్మ సిద్ధాంతం ఇరుసు మీద తిరుగుతున్నదని వ్యాఖ్యానించారు. మరోవైపు గత పదేళ్ల ఎన్‌డీఏ పాలనలో పెన్షన్, గ్రాట్యుటీ వంటి సామాజిక భద్రత కలిగిన స్థిరమైన ఉద్యోగాల కల్పన లేనేలేదని శాస్త్రీయ సర్వేలు స్పష్టం చేశాయి. దేశంలోని 34 శాతం కుటుంబాలు రోజుకు రూ.375 (జాతీయ క్షేత్రస్థాయి కనీస వేతనం) కంటే తక్కువ సంపాదిస్తున్న చేదు వాస్తవాన్ని ఎత్తి చూపాయి. దేశంలోని నిరుద్యోగ యువతలో సెకండరీ లేక ఉన్నత విద్య చదువుకున్నవారు 2000లో 35 శాతం కాగా 2022 నాటికి 65.7 శాతానికి పెరిగిందని అంతర్జాతీయ కార్మికసంస్థ నివేదిక తేల్చి చెప్పింది. మానవాభివృద్ధి సంస్థ ఇదే మాట నొక్కి చెప్పింది. అంత మందికి ప్రభుత్వం నేరుగా ఉద్యోగాలు కల్పించడం కష్టం అనే మాట వాస్తవమే. ప్రైవేటు రంగంలో పెట్టుబడులను విశేషంగా ఆకర్షించి భారీసంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కలిగించే దిశగా కృషి చేయాలి.

2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా చేస్తామని ప్రధాని నరేంద్ర మోడీ గొప్పలు పోవడాన్ని చూసి రఘురామ్ రాజన్ వంటి ఆర్థికవేత్తలు నవ్వుకుంటున్నారు. చాలా మందికి ఉన్నత పాఠశాల విద్య కూడా అందుబాటులో లేని పరిస్థితిలో అది దుస్సాధ్యమని రాజన్ చేసిన హెచ్చరిక గమనించదగినది. 140 కోట్ల జనాభాలో సగంకంటే ఎక్కువ మంది 30 సంవత్సరాలలోపు వారు కావడం వరమైతే వారికి సరైన చదువు, నైపుణ్యాలు కొరవడడం శాపమని ఆయన చేసిన విశ్లేషణ కొట్టివేయదగింది కానే కాదు. ❑

# ఎలక్టోరల్ బాండ్లు - కార్పొరేట్లకు విందులు



- మజ్జి కేశవ్

అవినీతిని అంతమొందిస్తాననీ, బయట స్విస్ బ్యాంకుల్లో దాచుకున్న నల్లధనం తెప్పించి భారతీయ సహోదరుల ఖాతాల్లోకి నేరుగా వేసేస్తానన్న ప్రధాని వాగ్దానం ఇంకా ప్రజలు మరిచిపోలేదు. బయట నల్లధనం మాట అటుంచి, అది వస్తుందా లేదా అన్నమాట పక్కన పెట్టి, మనదేశంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఎలక్టోరల్ బాండ్ల విషయంలో ఏం జరుగుతోంది? అత్యంత భారీ స్థాయిలో కార్పొరేట్లు ఎలక్టోరల్ బాండ్లు కొన్నారు. దాన వీర శూర కర్ణుల్లా రాజకీయ పార్టీలకు దానం చేశారు. 1950లో రాజ్యాంగం అమలు చేసుకున్నాం. భారతదేశాన్ని ఇలా పరిపాలించడాని కోసమా? మరి ప్రజా సంక్షేమం ఎక్కడికి వెళ్ళింది? ప్రజలకు ఏవేవో రాయితీలు ఇచ్చేస్తే సరిపోతుందా? కార్పొరేట్లు, రాజకీయ పార్టీలు కుమ్మక్కై విపరీతమైన డబ్బుతో ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని అత్యంత ఖరీదైన వ్యవహారంగా మార్చే స్తూ, ఒక పరిశ్రమగా మార్చేస్తూ ప్రజలకు ఏవేవో చిన్నచిన్న రాయితీలు పడేస్తూ కొనసాగించడమేనా ప్రజాస్వామ్యం అంటే? భారతదేశ ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యమని, ఈ ప్రజాస్వామ్యం నుండి బయటి దేశాలు చాలా నేర్చుకోవాలని మనం అప్పుడప్పుడు వింటుంటాం. ఇలాంటి ప్రజాస్వామ్యం కోసమా ప్రజలు వేచి చూసేది? నేర్చుకోవాల్సింది? కార్పొరేట్లు దానధర్మాలు చేయడం అన్నది ఊరికేనా? ఏ రకమైన ప్రయోజనాలు వారికి ఉండవా? ఇంత అధిక స్థాయిలో కార్పొరేట్లు ఎలక్టోరల్ బాండ్లు కొని ఆయా పార్టీలకు దానం చేయడం ఏ విధమైన ప్రయోజనాల కోసం? ప్రజా వ్యతిరేకమైన కార్పొరేట్ అనుకూలమైన పాలసీ నిర్ణయాలలో ఏ రకమైన పాత్రను ఈ ఎలక్టోరల్ బాండ్లు పోషించాయి? ఈరోజు భారతీయ పౌరుడి మెదడులో వస్తున్న ప్రశ్నలు ఇవి.

ఫిబ్రవరి 15వ తేదీన సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌లో భారత ప్రభుత్వం కొనసాగిస్తున్న ఎలక్టోరల్ బాండ్లు చట్ట వ్యతిరేకమని తెలిపింది. అలా జడ్జిమెంట్ ఇచ్చే లోగానే కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం గత కొన్నేళ్లుగా సాగుతూనే ఉంది. ఎలక్టోరల్ బాండ్ల పేరు మీద కార్పొరేట్ల డబ్బు పార్టీల అకౌంట్లోకి వెళ్ళిపోతూనే ఉంది. వేలు, లక్షలు కాదు. కోట్లలోనే. భారతదేశ ప్రజాస్వామ్యంలో 1950 నుండి ఇంత అధిక స్థాయిలో, అధిక మొత్తంలో పార్టీలకు విరాళాలు అందడం అన్నది జరగలేదు. దేశం మొత్తం మీద ఎన్నో రాష్ట్రాలలో లాటరీలను నిర్వహిస్తున్న ఒక లాటరీ కంపెనీ ఈ విరాళాల్లో మొదటి శ్రేణిలో ఉంది. ఇది మరింత ఆశ్చర్యం కలిగించే విషయం. వాస్తవ జీవితాన్ని పక్కకు తోసి, కార్మికుడి, మధ్యతరగతి ప్రజల డబ్బులను లాటరీ పేర్ల మీద కాజేసే విధానం అనేదే ప్రజా వ్యతిరేక విధానం. సాధారణ మనిషి దగ్గర నుండి మనిషి బలహీనతలను సొమ్ము చేసుకుని లాటరీ వ్యాపారాలను కొనసాగిస్తూ దోపిడీ చేయడం అనేది ప్రజా వ్యతిరేకతతో కూడుకున్నది. మార్చి 2018 నుంచి జూలై 2021 వరకు రూ.7380.638 కోట్ల విలువైన 14,363 ఎలక్టోరల్ బాండ్లు అమ్మకాలు జరిగాయి. ఇప్పటి వరకు అన్ని పార్టీలు కలిసి రూ.12 వేల కోట్లు సంపాదించాయి. బీజేపీకి 6566.11, కాంగ్రెస్‌కి 1123.29 కోట్లు ఈ బాండ్లు అందించాయని ఏడీఆర్ రిపోర్ట్ ద్వారా తెలుస్తోంది.

ఈ ఎలక్టోరల్ బాండ్లలో అత్యధికంగా ప్రయోజనం పొందింది కేంద్రంలోనూ, కొన్ని రాష్ట్రాల్లోనూ ఉన్న బీజేపీయే. ఆ తర్వాత, ఇతర పార్టీలు ప్రయోజనం పొందాయి.. ఒక్క ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ మొత్తంగా కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్లు కొని వివిధ రకాల పార్టీలకు అందజేసింది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి 542 కోట్లు, డీఎంకేకు 509 కోట్లు, వైసీపీకి 149 కోట్లు, బీజేపీకి వంద కోట్లు, కాంగ్రెస్‌కు 50 కోట్లు ఫండింగ్ చేసింది. ఒక లాటరీ కంపెనీ ఇంత అధిక స్థాయిలో బాండ్లను కొని రాజకీయ పార్టీలకు సంతోష పెట్టడంలో ఏ రకమైన ప్రయోజనాలు ఉంటాయి అనేది మనం అర్థం చేసుకోవచ్చు. ఒక ప్రైవేటు ఆసుపత్రి,36 ఫార్మా కంపెనీలు రూ.93 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు కొని పార్టీలకు దానం చేశాయి. ఇది మరింత ఆశ్చర్యం కలిగించే విషయం. ఫార్మా కంపెనీలు మందుల ధరలను సాధారణ మనిషికి అందుబాటులో ఉంచి, సామాజిక న్యాయం చేయాల్సి ఉండగా, అలా ప్రభుత్వాలు ఆయా కంపెనీలకు సూచనలు ఇవ్వాల్సి ఉండగా ఇంతేసి డబ్బు దానధర్మాలు చేసే ఫార్మా కంపెనీలు ఆయా మందుల ధరలను తగ్గించాల్సింది విడిచి ధరలు ఆకాశానికి అంటేలా చేస్తాయి కదా. ఇవే కాకుండా, మైనింగ్, ఇంజినీరింగ్ కంపెనీలు ఈ దారిలోనే రేసుగుర్రంలా పయనించాయి. ఇదిలా ఉంటే, పశ్చిమ బెంగాల్లోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కూడా బాగానే ప్రయోజనం పొందింది. లాటరీ రారాజు ఇక్కడ విన్యాసాలు చేశాడు. బీర్ భూమ్‌లోని తృణమూల్ పార్టీ నాయకుడు, ఆయన కుటుంబం మూడు సార్లు లాటరీ గెలిచారంటే మాటలా ? కార్పొరేట్లు అందించే ఈ డబ్బు ఎవరిది? కంపెనీలు తమ దగ్గర పనిచేస్తున్న కార్మికులకు గత

పది సంవత్సరాల్లో జీతాలను ఏరకంగా పెంచాయి? పెంచాలని కనీసం అనుకున్నాయా లేదా? ఇంత విపరీతంగా కార్పొరేట్ కంపెనీలు కోట్ల కొలది రూపాయలు పార్టీలకు ఫండింగ్ చేయడం అనేది ఒక రకంగా కార్మికులకు అన్యాయం చేయడమే కదా. శ్రామికుల అదనపు విలువలను కొట్టేసి, వాటిని విచ్చల విడిగా స్వేచ్ఛగా అనుభవించే ప్రజాస్వామ్యంలో న్యాయం ఎవరికి ఉంటుంది? ఇటీవలి ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ రిపోర్ట్ ప్రకారం భారతదేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగింది. వందల కొలది పోస్టులకు లక్షలమంది అభ్యర్థులు దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. ఆ ప్రక్రియ పూర్తయ్యేటప్పటికి ఏళ్లు పట్టేస్తున్నాయి. ఎన్నెన్నో సంస్థల్లో పదవీ విరమణ తర్వాత ఆయా స్థానాల్లో కొత్తవారు చేరడం లేదు. చేరినా చాలా తక్కువ సంఖ్యలో చేరుతున్నారు. సామాజిక పరిస్థితులు ఇలా ఉంటే, ఇటు రాజకీయ పార్టీలు, అటు కార్పొరేట్లు ఎన్నికల వ్యవస్థని కార్పొరేట్ల పండుగగా మార్చేసుకుని కార్మిక చట్టాలను కుదించి కార్పొరేట్లకు అనుకూలంగా మార్చేసుకుని ప్రజాస్వామ్యాన్ని పండుగ చేసుకుంటున్నారు. విపరీతమైన దానాలను స్వీకరించిన పార్టీలతో, పెద్ద చేపలతో వామపక్ష పార్టీలు, మిగిలిన చిన్న చిన్న పార్టీలు ఎలా పోటీ చెయ్యగలవు? దారి తప్పిన ప్రజాస్వామ్యాన్ని ప్రజానుకూలంగా మార్చాల్సిన అవసరం ఉంది. ❑

# సీపీఐ ఎన్నికల ప్రణాళిక

**(8వ పేజీ తరువాయి)** సదుపాయాల పెంపుదల, ప్రజలకు వాటిని అందుబాటులోకి తీసుకురావడం.

- అవకాశాలతో ప్రభుత్వ రంగ వ్యవస్థకు ప్రోత్సాహం, ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లకు ప్రోత్సాహం.
- రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితి తొలగించేందుకు రాజకీయ, న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగిస్తుంది.
- పునర్వ్యవస్థీకరణ నిబంధనలు తొలగించి వెంటనే మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు పోరాటం.
- జనగణన కోసం పోరాటం, కులగణన చేపట్టడం, పౌరసత్వ సవరణ చట్టం రద్దుకు పోరాటం.
- గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు రోజువారీ వేతనం రూ.700కు పెంపు. ఏడాదికి 200 రోజుల పని లభించేలా చర్యలు.
- ఉద్యోగ హామీ చట్టం, గిగ్ వర్కర్లకు సాంఘిక భద్రతకు పోరాటం.
- అగ్నిపథ్ పథకం రద్దుకు డిమాండ్.
- పెన్షన్ విధానం పునరుద్ధరణకు కృషి.
- దర్యాప్తు సంస్థలు పక్షపాతం లేకుండా పని చేసేలా, వాటిని దుర్వినియోగం కాకుండా పార్లమెంటు పరిధిలోకి తీసుకురావడం.
- గవర్నర్ల వ్యవస్థ రద్దు కోసం పోరాటాన్ని కొనసాగించడం
- ప్రవేశపరీక్షల్లో పాఠ్యాంశాలు వంటి విధానపరమైన పెద్ద నిర్ణయాలు రాష్ట్రాల జాబితాలోకి వచ్చేలా కృషి.
- ఈసీల నియామకంలో కార్యనిర్వహణా వ్యవస్థ జోక్యం నిర్మూలన, ఎన్నికల సంఘం సర్వ స్వతంత్రతకు కృషి.
- నీతి ఆయోగ్ రద్దు, ప్రణాళికా సంఘం పునరుద్ధరణ.
- ఎన్నికల బాండ్ల వంటి వివరాలు ప్రజలకు చెప్పడం, ఇలాంటి నిధులను ఉద్యోగావకాశాలు పెంచేందుకు ఉపయోగించడం.
- విద్యా విధానం రద్దు, ప్రజానుకూల ఆధునిక విద్యకు రూపకల్పన, బీజేపీ తీసుకున్న వినాశకర విధానాలు రూపుమాపడం వంటివన్నీ పార్టీ లక్ష్యాలుగా ఎన్నికల ప్రణాళికలో పేర్కొంది. ప్రజానుకూల ఎజెండాతో సీపీఐ ఈ ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళుతోందని పార్టీ ప్రకటించింది. 18వ లోక్‌సభలో వామపక్షాల బలాన్ని పటిష్టం చేసేందుకు వీలుగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకే ఓటు వేయాలని సీపీఐ ప్రజలకు పిలుపునిచ్చింది. దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాసామ్యాన్ని, ప్రజల జీవనాన్ని రక్షించేందుకు ఈ ఎన్నికల్లో ఆర్ఎస్ఎస్ పాలనను ఓడించేందుకు మనందరం ఐక్యం కావాలని ఎన్నికల ప్రణాళికలో సీపీఐ పిలుపునిచ్చింది. ❑

# ఇండియా కూటమిని ఎందుకు గెలిపించాలి?

**(9వ పేజీ తరువాయి)** నిరుద్యోగులతో సహా ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగై పారిశ్రామిక-వ్యవసాయ రంగాల అభివృద్ధితో ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో గౌరవ ప్రదమైన స్థానాన్ని అందుకోవాలంటే రాష్ట్రంలో INDIA కూటమి నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో యు.పి.ఏ. ప్రభుత్వంలో వామపక్షాల భాగస్వాములుగా ఉన్నందున, (1).ఆహార భద్రతా చట్టం, (2).సమాచార హక్కు చట్టం, (3).వినియోగదారుల రక్షణ చట్టం, (4).లోక్‌పాల్, (5).2013 భూసేకరణ చట్టం, (6).మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (7).ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 మున్నగు అభ్యుదయ ప్రజో పయోగ చట్టాలు చేయబడ్డాయన్న వాస్తవాన్ని గుర్తుకు తెచ్చుకోవడం సముచితంగా వుంటుంది. మన నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం – ద్రోహం చేసినా కిమ్మనకుండా, సాగిలపడి, రాష్ట్ర ప్రయోజనాలను మోడి – బీజేపీలకు నిస్సిగ్గుగా తాకట్టు పెట్టిన “పొత్తు – తొత్తు” పార్టీలను చిత్తు చిత్తుగా ఓడించాలి, INDIA కూటమి మిత్ర సంస్థలను గెలిపించాలి. ❑

# బీజేపీ గూటికి చేరితే పునీతులే..
# 25 మంది ప్రతిపక్ష నేతలపై 'నో యాక్షన్

**అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతిపక్ష నేతలు బీజేపీ గూటికి చేరితే పునీతులైనట్లేనని మరోసారి నిర్ధారణైంది. తాజాగా అవినీతి కేసులను ఎదుర్కొన్న 25 మంది నేతలు బీజేపీ గూటికి చేరడంతో కేసుల నుండి ఉపశమనం పొందినట్లు మీడియా విచారణలో తేలింది. బీజేపీ కండువా కప్పుకుంటే చట్టం కూడా తన తీరుని మార్చుకుంటుందని స్పష్టమైంది. కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐలను మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందంటూ ప్రతిపక్షాలు వ్యాఖ్యానిస్తున్న సంగతి తెలిసిందే. బీజేపీని 'వాషింగ్ మెషీన్'గా ప్రతిపక్షాలు ఎద్దేవా చేశాయి.**

2014 నుండి, అవినీతి కేసులపై కేంద్ర ఏజెన్సీల నుండి దాడులను ఎదుర్కొంటున్న 25 మంది ప్రముఖ రాజకీయ నేతలు బీజేపీలో చేరారు. వీరిలో పది మంది కాంగ్రెస్ నేతలు, ఎన్సీపీ, శివసేన (విభజనకు ముందు) పార్టీల నుండి నలుగురేసి చొప్పున, టీఎంసీ నుండి ముగ్గురు, టీడీపీ నుండి ఇద్దరు, ఎస్పీ, వైసీపీ నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. వీటిలో 23 కేసుల్లో, వారి రాజకీయ ఎత్తుగడలతో ఈడీ, సీబీఐ నుండి ఉపశమనం పొందినట్లు విచారణలో తేలింది. వీటిలో మూడు కేసులను మూసివేయబడ్డాయి. మరో 20 మందిపై కేసు విచారణను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ జాబితాలో వున్న ఆరుగురు రాజకీయ నేతలు సార్వత్రిక ఎన్నికలకు కొన్ని వారాల ముందు బీజేపీలో చేరడం గమనార్హం. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 95 శాతం మంది ప్రముఖ ప్రతిపక్ష నేతలు ఈడీ, సీబీఐ దాడులను ఎదుర్కొన్నారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 2022లో వెల్లడించింది. వరుసగా 2022, 2023 సంవత్సరాలలో మోడీ ప్రభుత్వం మహారాష్ట్ర రాజకీయాలను టార్గెట్ చేసింది. 2022లో ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేనపై తిరుగుబాటు ప్రకటించి, మహావికాస్ అఘాడీ (కాంగ్రెస్, శివసేన, ఎన్సీపీ)లో ప్రభుత్వాన్ని కూల్చివేసింది. తర్వాత బీజేపీతో చేతులు కలపడంతో షిండే, ఫడ్నవీస్ సీఎం, డిప్యూటీ సీఎంలుగా కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. మరుసటి ఏడాది ఎన్సీపీలో చీలికలు తీసుకువచ్చిన అజిత్ పవార్‌వర్గం.. ఎన్‌డీఏ కూటమిలో చేరింది. దీంతో ఎన్సీపీ నేతలు అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్‌లపై కేసులను మూసివేసినట్లు నివేదికలు వెల్లడించాయి. 25



మందిలో మహారాష్ట్రకు చెందిన 12 మంది ప్రముఖ నేతలు ఉన్నారు. వీరిలో 11 మంది 2022, ఆ తర్వాత ఏడాదిలో శివసేన, కాంగ్రెస్, ఎన్సీపీకి చెందిన నలుగురితో సహా బీజేపీ తీర్థం పుచ్చుకోవడం గమనార్హం.

### ఏపీలో 'అవినీతి మార్కు' ని ఎదుర్కొన్న నేతలు

ఈ 25 మందిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు నేతలు బీజేపీలో చేరి అవినీతి మార్కుని వదిలించుకున్నారు. వీరిలో టీడీపీ నుంచి ఇద్దరు, వైసీపీ నుంచి ఒకరు ఉన్నారు. ప్రస్తుతం ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగనున్నాయి. టీడీపీ, వైసీపీల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొని బీజేపీలో చేరిన సుజనా చౌదరి, సీఎం రమేష్, కె.గీతలను ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థులుగా బీజేపీ ప్రకటించింది. రూ.100 కోట్ల నగదు అవతవకలు జరిగాయంటూ టీడీపీ ఎంపీగా వున్న సీఎం రమేష్‌కు చెందిన కంపెనీలపై 2018 అక్టోబర్‌లో ఐటీ శాఖ దాడులు జరిపింది. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు పార్లమెంట్ ఎథిక్స్ కమిటీకి లేఖ రాశారు. భారీ ఆర్థిక కుంభకోణాలతో 'ఆంధ్రా మాల్యాలు'గా పేరు గడించినందుకు ఆయనను ఎంపీగా తొలగించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే 2019 జూన్‌లో సీఎం రమేష్ బీజేపీ తీర్థం పుచ్చుకోవడంతో ఆయనపై ఐటీ దాడులు నిలిచిపోయాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. మాజీ కేంద్ర మంత్రి, మాజీ ఎంపీ సుజనాచౌదరిపై మూడు ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. బెస్ట్ అండ్ క్రాంప్టన్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ (బీసీఈపీఎల్) సుజనా చౌదరికి చెందినవని, బ్యాంకుల కన్సార్టియం నుండి మోస పూరితంగా రూ.360 కోట్లకు పైగా రుణాలు పొంది, డిఫాల్ట్ చేసిందని ఎఫ్ఐఆర్‌లు పేర్కొన్నాయి. **(మిగతా 19వ పేజీలో)**

# బొంకుల దిబ్బ రాజకీయం

- సవ్యసాచి

**గురజాడ కన్యాశుల్కం నాటకం బొంకుల దిబ్బ మీద గిరీశం రంగప్రవేశం తో మెదలౌతుంది. నాటకం చివరి ఘట్టం వరకూ గిరీశం చేసే వంచన మీద వంచనలు ,అలవోకగా వాగే బొంకుల దిబ్బలతో సాగిపోతుంది. మనకిప్పుడు ఆ నాటకంతో పనిలేదు. మన చుట్టూ ఎన్నో వంచనలు, ఎన్నో బొంకుల దిబ్బలు. రాజకీయంలో, బుల్లితెర వార్తలలో, సోషల్ మీడియాలో బొంకుల దిబ్బలకు కొదువలేదు. మోదీ అనునిత్యం చేసే నీతి ప్రవచనాల్లో, ఇరగదీశానని చెప్పుకునే ఘనకార్యాలలో ఎక్కువగా బొంకుల దిబ్బలే అగుపిస్తాయి. గిరీశాన్ని తలపించే ఆత్మవంచన పరవంచనా కనిపిస్తుంది.**

2014 నుంచి మోదీ చంద్రబాబు ఆప్తమిత్రులు. ఎన్‌డీఏ కూటమిలో చెట్టపట్టాలు వేసుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు విడిపోయారు. ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకు న్నారు. ఇలా పాలూ నీరులా కలిసిపోయిన మిత్రులు ప్రత్యర్థులు గా మారినప్పుడు “నిజం” మాట్లాడతారు. ఒకరి లోగుట్టు మరొకరు విప్పేస్తారు. 2019లో రాజమండ్రి సభలో మోదీ ఏమన్నారంటే.. పోలవరం కోసం మేం ఏడు వేల కోట్లు ఇచ్చాం.. చంద్రబాబు రోజుకో కొత్త అంచనాలతో ప్రాజెక్టు వ్యయాన్ని పెంచుకుంటూ పోలవరం ప్రాజెక్టు సొమ్మును ఆయన ఏటీఎంలా వాడుకుంటున్నారు. ప్రధాని ఇలా అంటే చంద్రబాబు ఊరుకుంటారా ! మోదీ మాట్లాడితే అబద్ధం. అబద్ధం తప్ప పొట్ట కొట్టినా నిజం మాట్లాడరు. ఇలా ఇంకా.. ఇంకా మాట్లాడారు. ఇప్పుడు ఈ రెండు వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఎన్నికల్లో మళ్లీ ఇద్దరూ ఒక్కటయ్యారు. ఒకనాటివి ‘నిజం దిబ్బలు’.. ప్రస్తుతానివి బొంకుల దిబ్బలు.

మోదీ పూటకో డ్రస్సు మారుస్తారు. రోజుకో వేషం వేస్తారు. కొత్త టోపీలు పెడతారు. హేట్ మార్చినప్పుడల్లా ఎన్నికలలో ‘హ్యాట్‌ట్రిక్’ను ఊహించుకుంటారు. ప్రతి ఎన్నికకు ఒక కొత్త నినాదాన్ని వినిపిస్తారు. పాతపడగానే చెత్త బుట్టలో వేస్తారు. మొదట ‘అచ్ఛేదిన్’ అన్నారు. తర్వాత ఆత్మనిర్భర్ భారత్ అన్నా రు. ఇప్పుడు విశ్వగురు అంటున్నారు. వికసిత్ భారత్ అంటు న్నారు. విశ్వాన్ని అంటే ప్రపంచ దేశాలని చుట్టి రావడానికి ప్రధానికి ప్రత్యేక అవకాశాలు ఉంటాయి. ఎన్నో ఆహ్వానాలుం టాయి. ప్రత్యేక విమానాలుంటాయి. దేశంలో ఎన్నికలు లేనప్పుడు ఆయన విదేశాలలోనే వుంటారు. ఆయన విశ్వ పర్యటన చేసి చేసి భారత్ విశ్వగురువైందని భావిస్తారు.

విశ్వ గురువును నిర్ధారించే వివిధ గణాంకాలను, రిపోర్టులను ఆయన పట్టించుకోరు. యుఎన్‌డీపీ దేశాల మానవాభివృద్ధి ర్యాం కులను ప్రకటిస్తుంది. 193 దేశాలలో మోదీ విశ్వగురువు 134వ స్థానంలో వుంది. మరోపక్క పేదరికం పోయింది అంటా రు మోదీ. 125 దేశాల ఆకలి సూచికలో భారత్ 111వ స్థానం లో వుంది. ప్రజాస్వామ్యానికి ఇంగ్లాండ్ కాదు భారతదేశమే పుట్టిల్లు అంటారు మోదీ. ఎలక్టోరల్ ప్రజాస్వామ్య దేశాలలో మోదీ “ప్రజాస్వామ్య పుట్టిల్లు” 108వ స్థానంలో వుంది. ఒకపక్క “పుట్టిల్లు” అంటూనే ప్రతిపక్షాలను నట్టేట ముంచే దాడి సాగిస్తారు. ఎన్నికల ముందు ఇద్దరు ముఖ్యమంత్రులను జైళ్లపాలు చేశారు. ప్రధాన ప్రత్యర్థిగా వున్న కాంగ్రెస్ బ్యాంకు అకౌంట్‌లను స్తంభింపజేశారు. ఇలా ప్రతిపక్షాల కాళ్లూ చేతులూ కట్టేసి “ప్రజాస్వామ్య ఎన్నికల మల్లయుద్ధానికి” రా రమ్మంటు న్నారు. ఈ విశ్వగురు ప్రజాస్వామ్యం మీద ప్రపంచ దేశాలు ఫైర్ అవుతున్నాయి.రాజకీయ ప్రత్యర్థుల పట్ల మోదీ ప్రభుత్వం తీరును అమెరికా తప్పు పట్టింది. జర్మనీ తగదంది. ఆఖరికి ఐక్య రాజ్య సమితి కూడా ఇది న్యాయం కాదంది. ప్రపంచంలో భారత్ అతి పెద్ద ప్రజాస్వామ్యం. ఇప్పుడు మోదీ ధృతరాష్ట్ర కౌగిలిలో చిక్కుకుంది. ఇక్కడ జరిగే ఎన్నికల మీద అనుమాన మేఘాలు కమ్ముకున్నాయి. భారత్ ఎన్నికల పర్యవేక్షణకు స్వతంత్ర ప్యానెల్ – 2024 పేరుతో ఒక అంతర్జాతీయ కమిటీ ఏర్పాటైంది. స్వతంత్ర భారత ఎన్నికల చరిత్రలో ఇలాంటి కళంకం ఎప్పుడూ రాలేదు. ఇదీ మోదీ సాధించిన విశ్వగురు కీర్తి కిరీటం.

మోదీరికి వర్తమానం పట్టదు అనడం కంటే గిట్టదు అనాలి. ఎందుకంటే వర్తమానం తన పాలన బండారాన్ని అద్దంలో చూపిస్తుంది. అది చూడసొంపుగా, వినడానికి ఇంపుగా ఉండదు. దానికి ముసుగేసి ఊరించే భవిష్యత్‌తో ప్రజల్ని అలరించాలి. ఒంటెద్దు బండివాడు మేత పెట్టకుండానే ఎద్దును నడిపించడానికి దాని ముందు ఒక కర్రకు గడ్డి కట్టి పెడతాడు. ఆ గడ్డిని అందుకోవడానికి ఆశపడి ఎద్దు ముందుకు అడుగులు వేస్తుంది. గడ్డి అందదు. **(మిగతా 21వ పేజీలో)**

# పేదరికపు గణాంకాలు మరోసారి..



- ప్రభాత్ పట్నాయక్

**ఈ మధ్య నీతి ఆయోగ్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి ఒక 'అద్భుతమైన' ప్రకటన చేశారు.2022-23 వినిమయ ఖర్చు సర్వే వెల్లడించిన వివరాల ప్రకారం మన దేశంలో పేదరికం ఐదు శాతం కన్నా దిగువకు పడిపోయిందట! దీనికి ప్రాతి పదిక ఏమిటి? సురేశ్ టెండూల్కర్ కమిటీ నిర్దేశించిన దారిద్ర్య రేఖ (2011-12 సంవత్సరం ప్రమాణంగా)ను వినిమయ ధరల సూచీలో వచ్చిన పెరుగుదల ప్రకారం తాజా పరిస్థితికి అనుగు ణంగా సవరించి దానితో పోల్చితే 2022-23లో దేశ జనాభాలో ఆ రేఖ కన్నా దిగువన 5 శాతం కన్నా తక్కువే ఉన్నారట!**

టెండూల్కర్ కమిటీ 2011-12 సంవత్సరానికిగాను దారిద్ర్య రేఖను నిర్ణయించిన దానికి ప్రమాణాలు లేదా ప్రాతిపదిక ఏమిటి? కనీసం ఒక కుటుంబానికి ఏయే సరుకులు, సేవలు ఏయే మేరకు అవసరమవుతాయి, ఒక వ్యక్తి కనీసం ఎన్ని క్యాలరీల శక్తినిచ్చే ఆహారాన్ని రోజూ తీసుకోవాలి వంటి ప్రమాణాలు ఏవీ పరిగణించలేదు. ఏకపక్షంగా ఆ దారిద్ర్య రేఖను నిర్ణయించారు. దానిని ఈ ప్రభుత్వం ఇప్పుడు వినిమయ ధరల సూచీకి అనుగుణంగా సవరించారు. ఈ వినిమయ ధరల సూచీ విద్య, వైద్యం వంటి సేవలు ప్రైవేటీకరిం చబడిన వాస్తవాన్ని పరిగణన లోకి తీసుకోవు. అందుచేత వాస్తవ పెరుగుదలను అవి పూర్తిగా ప్రతిబింబించవు. ఇక 2022-23లో చేపట్టిన వినిమయ సర్వే అంతకు పూర్వపు సర్వేల విధానాన్నే అనుసరించి వుంటే పోల్చ డానికి వీలుండేది. కానీ అంతకు ముందరి సర్వేలకు భిన్నంగా ఈ సర్వే జరిగింది. అందుచేత ఈ సర్వేలో వచ్చిన వివరాలను అంతకు పూర్వపు సర్వేలతో సరిపోల్చడానికి సాధ్యం కాదు. పైగా ఈ తాజా సర్వే వివరాలు పూర్తిగా ఇంకా వెల్లడి కాలేదు. అందుచేత నీతి ఆయోగ్ ప్రకటించినట్టు పేదరికం జనాభాలో ఐదు శాతం కన్నా తక్కువ అని నిర్ధారించడానికి తగిన ఆధారాలు లేవు. పైగా దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి మనకు లభిస్తున్న తక్కిన సమాచారంతో పోల్చి చూసినప్పుడు పేదరికం తగ్గిపోయిందన్న ప్రచారం ఎన్నికల సమయంలో ప్రభుత్వం చేసుకోడానికి వీలుగా ఈ ప్రకటన వెలువడిందన్న నిర్ధారణకు రాక తప్పదు. ఆ ఇతర సమాచారం ఏమిటో చూద్దాం.

2017-18లో చేపట్టిన వినిమయ సర్వే వెల్లడించిన వివరాలు ఎంత దయనీయ పరిస్థితిని వెల్లడించాయంటే ఆ సర్వే వివరాలను ప్రభుత్వం బహిరంగ పరచడానికి సిద్ధపడలేదు. వాటిని వెనక్కి తీసేసుకున్నారు. ఈ లోపు మనకు పొక్కిన సమాచారాన్ని బట్టి కనీస పౌష్టికాహారం (ప్లానింగ్ కమిషన్ అప్పుడు నిర్ధారించిన ప్రకారం రోజుకు 2100 క్యాలరీలు పట్టణాలలో. అదే గ్రామాల్లోనైతే రోజుకు 2200 క్యాలరీలు) పొందలేకపోతున్న వారు 1993-94లో 57 శాతం ఉంటే అది 2017-18 నాటికి 60 శాతానికి పెరిగింది. ఇది పట్టణాలలోని పరిస్థితి. ఇక గ్రామీణ ప్రాంతాలకు వస్తే 1993-94లో 57 శాతం, 2011-12లో 65 శాతం ఉన్నది కాస్తా 2017-18కి 80 శాతానికి అమాంతం పెరిగింది. అంటే పేదరికం 2011-12 నుంచి 2017-18 మధ్య కాలంలో బాగా పెరిగిపోయింది. ఆ తర్వాత మనం కరోనా మహమ్మారి బారిన పడ్డాం. దానికి లాక్‌డౌన్ తోడైంది. దీంతో ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. కరోనాకు మునుపు ఉన్న నిరుద్యోగంకన్నా ఎక్కువగా నేడు నిరుద్యోగం తాండవమాడుతోంది. 2017-18 నాటి పరిస్థితినైనా అధిగమించగలిగామా లేదా అన్నదే సందేహాస్పదంగా ఉంది. అటువంటప్పుడు 2011-12 నాటి పరిస్థితిని కూడా అధిగమించి పేదరికాన్ని ఏకంగా 5 శాతం కన్నా తక్కువకి తగ్గించేశామని చెప్పుకోవడం ఏ మాత్రమూ విశ్వసనీయంగా లేదు.

ఎన్ని క్యాలరీల శక్తినిచ్చే ఆహారం తీసుకుంటున్నారు అన్నదే పేదరికానికి కొలబద్ద కాజాలదు అని వాదించేవారున్నారు. వారి వాదన ఒక పొరపాటు అవగాహన మీద ఆధారపడి వుంది. కేవలం క్యాలరీల ప్రాతిపదికను ఒక్కదానిని మాత్రమే పేదరికాన్ని అంచనా వేయడానికి కొలబద్దగా తీసుకోవాలన్నది కాదు ఇక్కడ మనం చెప్పేది. నికర ఆదాయాల్లో పెరుగుదల వచ్చినప్పుడు తీసుకునే ఆహారపు క్యాలరీల విలువ పెరగాలన్నదే ఇక్కడ మన వాదన. ఒకవైపు ఆదాయం పెరిగినా తీసు కునే ఆహారపు క్యాలరీల విలువ తగ్గవచ్చు అన్న వాదన పూర్తిగా తప్పు. కేవలం నిజ వేతనాలు తగ్గిపోయినప్పుడు మాత్రమే తీసుకునే ఆహారపు కేలరీల విలువ తగ్గిపోతుంది. ప్రపంచ దేశాల గణాంకాలను పరిశీలించినప్పుడు తలసరి ఆదాయం పెరుగుదలకు, తలసరి ఆహార ధాన్యాల వినియోగం పెరుగుదలకు ప్రత్యక్ష సంబంధం ఉంది అని స్పష్టంగా నిర్ధారణ అయింది.

మన దేశంలో ఆదాయాలు ఎంతెంత వస్తున్నాయి అన్నదానికి

సంబంధించిన గణాంకాలేవీ లేవు. కేవలం వినిమయానికి చేస్తున్న ఖర్చుల గణాంకాలు మాత్రం లభ్యమౌతున్నాయి. ఈ ఖర్చులను ఒక దీర్ఘకాలంలో పోల్చి చూడాలంటే ధరల సూచీ ఆధారంగా వాటిని సవరించడం ఒక్కటే మార్గం. కాని ఆ ధరల సూచికలకున్న లోపాల దృష్ట్యా అవి ఆదాయాల పెరుగుదలను సక్రమంగా అంచనా వేయడానికి తోడ్పడవు. ఇక తీసుకునే ఆహారపు క్యాలరీల విలువను బట్టి పోల్చి చూడడం ఒక్కటే మన ముందున్న నమ్మదగిన విధానం. దానిని బట్టి చూస్తే 2017-18 వరకూ మన దేశంలో పేదరికం పెరుగుతూనే వచ్చింది. ఇక ఆ తర్వాత వివరాలే లేవు. తాజాగా 2022-23కు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన వినిమయ సర్వే వివరాలను ప్రభుత్వం వెల్లడి చేస్తే దేశంలో పేదరికం పరిస్థితిని మనం తాజాగా అంచనా వేయగలుగుతాము. అంతవరకూ మనం ఇతరత్రా లభిస్తున్న వివరాల మీద ఆధారపడక తప్పదు.

అటువంటి పరోక్ష ఆధారాలలో మొదటిది జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే. 2019-21 వరకూ ఉన్న కాలానికి సంబంధించిన 5వ సర్వే ప్రకారం 2015-16తో పోల్చితే 2019-21 నాటికి రక్తహీనతతో బాధపడే మహిళలు (15 నుంచి 49 సం. మధ్య వయస్కులు) 53 శాతం నుండి 57 శాతానికి పెరిగారు. 2015-16లో 50 శాతం కన్నా ఎక్కువ జనాభా రక్తహీనతతో బాధపడే మహిళలు ఉన్న రాష్ట్రాలు 21 ఉంటే 2019-21 నాటికి వాటి సంఖ్య 25కి పెరిగింది. సంపన్న దేశాల మహిళలకు ఉపయోగించే ప్రమాణాలనే ఇక్కడ కూడా ఉపయోగించడం సరైనది కాదని వాదిస్తున్న వారున్నారు. కాని ఇక్కడ ప్రమాణాలేమిటి అన్నది కాదు ప్రధానం. అవే ప్రమాణాలను గతంలోను, ఇప్పుడు ఉపయోగిస్తున్నాం. అయినా గతంలో పోల్చితే ఇప్పుడు రక్తహీనత పెరిగింది. అదీ ప్రధానం.

రెండవ పరోక్ష ఆధారం ప్రపంచ ఆకలి సూచిక. ప్రపంచ ఆకలి సూచిక అట్టడుగున్న ఉన్న 125 దేశాలను పరిశీలిస్తుం ది. అందులో మన దేశం 2023లో 111వ స్థానంలో ఉంది. ఆకలి సూచికను లెక్కిస్తున్న విధానం సక్రమంగా లేదని మన ప్రభుత్వం అభ్యంతరం పెడుతోంది. ఆ విధానంలోని లోపాల మాట ఎలా ఉన్నా, వారు ఒకటే విధానాన్ని కొనసాగిస్తున్నారు. అటువంట ప్పుడు తలసరి ఆదాయాలు గణనీయంగా పెరిగిపోతున్నా యంటూ చెప్పుకుంటున్న మన దేశం ఆకలి సూచికలో దిగజారవలసిన పరిస్థితి ఎందుకొచ్చింది? దారిద్ర్య రేఖకు దిగువన ఉండేవారి సంఖ్య బాగా తగ్గిపోయిందని చెప్పుకుం టున్న ప్రభుత్వం ఆకలి సూచికలో మన దేశం స్థానం దిగజారిపోడానికి కారణం ఏమిటో చెప్పగలదా?

కేవలం ఆకలి సూచిక ఒక్కటే కాదు. తగినంత శక్తి లేని పిల్లలు, వివిధ లోపాలతో జన్మించే పిల్లలు, పెరుగుదల లేకుండా నిలిచిపోయిన పిల్లలు, చిన్న పిల్లల మరణాలు-ఇవన్నీ కూడా కొన్ని ప్రమాణాలే. వాటిని బట్టి చూసినా 2008తో పోల్చినప్పుడు 2023 నాటికి మన పరిస్థితి ఘోరంగా దిగజారిపోయింది. అందుచేత అల్పాదాయ వర్గాల ఆదాయాలు పెరిగాయి అని చెప్పుకుంటున్న దానిలో ఏమాత్రమూ వాస్తవం లేదు. ఇక తల్లిపాలు తప్ప వేరే ఇతర ఆహారం ఏదీ పొందలేని చిన్న పిల్లలు (6 నెలల నుండి 23 నెలల వయస్సు ఉండే చిన్న పిల్లలు) 67 లక్షలమంది 2023లో ఉన్నారు. ఈ వయస్సు పిల్లలకు తల్లిపాల తోబాటు ఇతరత్రా అదనపు ఆహారం కూడా అందాలి. కాని అలా పొందలేనివారు ఆ వయస్సుగల మొత్తం పిల్లల్లో 19.3 శాతం ఉన్నారంటే అది మన పేదరికానికి అద్దం పడుతుంది. ఈ విషయంలో మనకన్నా కేవలం రెండే రెండు దేశాలు వెనకబడివున్నాయి. అవి గినీ (21.8 శాతం), మాలి (20.5 శాతం). మన ప్రభుత్వం చెప్పుకుంటున్న గొప్పలు ఎంత బూటకమో దీనిని బట్టే చెప్పవచ్చు. మన ప్రభుత్వం ఎన్ని గొప్పలు చెప్పుకుంటున్నా, యావత్ ప్రపంచానికీ మన దేశం పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న సంగతి బాగా తెలుసు. ఐరాస నివేదిక ప్రకారం ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎవో) దక్షిణాసియా దేశాలకు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పౌష్టికాహారం పొందలేకపోతున్నవారు భారత దేశంలో 74 శాతం ఉన్నారు. ఇది చేదు నిజం. ❑

# బీజేపీ గూటికి చేరితే పునీతులే..

**(16వ పేజీ తరువాయి)**

2016లో ఈడీ కేసు నమోదు చేయగా, 2018 అక్టోబర్‌లో ఆయన కంపెనీలపై ఈడీ దాడులు చేసింది. 2019 ఏప్రిల్‌లో రూ.315 కోట్లకు పైగా ఆస్తులను జప్తు చేసుకుంది. చార్జిషీటు నమోదైన అనంతరం 2019 జూన్‌లో బీజేపీ కండువా కప్పుకోవడంతో ఈ కేసు తిరిగి విచారణకు వెళ్లింది. ప్రస్తుతం సుజనాచౌదరి విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికల బరిలోకి దిగారు. వైసీపీకి చెందిన కె.గీతను మార్చి 28న బీజేపీ అరకు అభ్యర్థిగా ప్రకటించింది. 2015 వైసీపీ ఎంపీగా వున్న సమయంలో వాస్తవాలను తప్పుగా చూపి, రూ.42 కోట్ల రుణాలు తీసుకుని పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేశారంటూ ఆమె సంస్థ విశ్వేశ్వర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌పై కేసు నమోదైంది. గీత, ఆమె భర్త పి.రామకోటేశ్వర రావులపై 2015లో సీబీఐ చార్జిషీటు దాఖలు చేసింది. 2019 జూలైలో బీజేపీలో చేరారు. దీంతో 2022 సెప్టెంబర్‌లో ప్రత్యేక కోర్టు ఇరువురికి ఐదేళ్ల జైలుశిక్ష విధించింది. ఆ వెంటనే తెలంగాణ హైకోర్టు జైలు శిక్షపై స్టే విధించడంతోపాటు బెయిల్‌పై విడుదల చేసింది. ఈ ఏడాది మార్చిలో తెలంగాణ హైకోర్టు జైలు శిక్షపై మరోసారి స్టే విధించింది. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు స్టేను సీబీఐ సవాలు చేసింది. ❑

# ఎన్నికల రూల్ బుక్‌ను మార్చి రాయాలా ?



- అశోక్ లావాసా,
మాజీ ఎన్నికల కమిషనర్

**ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు కనివిని ఎరుగని విధంగా చేపడుతున్న చట్టపరమైన చర్యల పరంపరపై రచ్చ నడుస్తోంది. ఈ చర్యలు ఏమైనా 'ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య పద్ధతి' ఉల్లంఘనకు దారి తీస్తున్నాయా అనే విషయాన్ని ఎన్నికల సంఘం నిర్ధారించాల్సి వుంది. ప్రజాస్వామ్య ప్రక్రియల సమగ్రతను, నైతికతను కాపాడుకోవటానికి 'అందరికీ సమానావకాశాలు' (ఎల్.పి.ఎఫ్.) అనే భావన కీలకం అవుతోంది. అలాంటి ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల తరుణంలో ఎల్.పి.ఎఫ్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్-ఎం.సి.సి.) అమలుపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించి వివిధ అంశాలను విశ్లేషించడం అవసరమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.**

2024 సార్వత్రిక ఎన్నికలను ప్రకటించిన రోజున భారత ఎన్నికల సంఘం, మీడియాకు వివరాలు అందిస్తూ తెలిపిన మంచి అంశాలలో ఒకటి ఏమిటంటే, లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్.. ఆటలో అందరికీ సమానావకాశాలు (ఎల్పీఎఫ్)కి ఈసీ ఇస్తున్న ప్రాధాన్యం. అన్ని రాజకీయ పార్టీలకూ ప్రవర్తనా నియమావళిని ఈసీ పంపిందనీ, దానిని ఆయా పార్టీలు తమ స్టార్ క్యాంపెయినర్ల దృష్టికి తీసుకెళ్లాలని అభ్యర్థించినట్లు కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈసీ) రాజీవ్‌కుమార్ తెలిపారు. ఎల్పీ ఎఫ్‌కు భంగం కలిగించే చర్యలకు సంబంధించిన ఫిర్యాదులపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తామన్నారు. ఎల్పీఎఫ్ అనేది క్రీడలు లేదా యుద్ధాల విషయంలో వర్తించని వ్యక్తీకరణ. సమవుజ్జీలైన రెండు జట్లు మాత్రమే ఒక దానితో ఒకటి ఆడాలనేది ఉండదు. క్రికెట్‌లో, స్వదేశీ జట్లు పిచ్‌ను తమకు అనుకూలంగా మార్చు కుంటాయి. అయితే ఈ 'అన్యాయమైన అభ్యాసం' మన్నించ బడింది. ఎందుకంటే పాల్గొనే జట్లు తమ వంతు కోసం ఎదురు చూస్తుంటాయి. అదేవిధంగా, ఒక శక్తిమంతమైన సైన్యం పోరాటంలో ఒక చిన్న ప్రతిపక్షాన్ని దెబ్బతీస్తే దాన్ని అన్యాయంగా పరిగణించరు. ప్రేమలో, యుద్ధంలో అంతా న్యాయమైనదే అంటారు. ఎల్పీఎఫ్ అనేది స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలకు ఒక పవిత్రమైన సూత్రం. ప్రజాస్వామ్యంలో ఎన్నికలనేవి యుద్ధం లేదా ప్రేమ పోటీ కానే కాదు. వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఒకరితో ఒకరు పోటీపడి ప్రతినిధుల సభలో ప్రాతినిధ్యం వహించడానికి ఓటర్ల ఆదేశాన్ని పొందడం ప్రజాస్వామ్యంలో కీలకమైన సంఘటన. ఓటు అనేది విశ్వాసంపై, వాస్తవాలపై ఆధారపడిన సామాజిక ఒప్పందం. ఈ పోటీ నిష్పక్షపాతంగా ఉండాలంటే, పోటీదారులు సమానంగా ఉండకపోవచ్చని అంగీకరించినప్పటికీ, ఎన్నికల సమయంలో ఎల్పీఎఫ్ లభ్యత ఒక తప్పనిసరి షరతుగా పరిగణించబడుతుంది. స్వాభావిక అసమానతను ఆటలో భాగంగా గుర్తిస్తే, ఎన్నికల సమయంలో వారు ఓటర్లను తమకు అనుకూలంగా ప్రభావితం చేయడానికి ప్రయత్నించినప్పుడు ఎల్పీఎఫ్ ఉండేలా చూసుకోవడమనేది ప్రక్రియ నియంత్రణాధి కారి బాధ్యత. ఎల్పీఎఫ్‌కి చెందిన ఈ సూత్రాన్ని నిశితంగా పరిశీలిస్తే, ప్రతిపక్ష అభ్యర్థులతో పోలిస్తే అధికార పక్షం పొందే ప్రయోజనానికి 'సమం చేయడం' నిర్దిష్టమైనదని చూపిస్తుంది. క్రీడలలో బలహీనమైన జట్టు బలమైన వారితో పోటీపడవచ్చు. వాస్తవానికి, టెన్నిస్ వంటి ఆటలలో పోటీ ప్రారంభ రౌండ్లలో, బలహీనమైన అన్ సీడెడ్ ఆటగాళ్లు ర్యాంకింగ్ పట్టికలను శాసించే ఆటగాళ్లతో తలపడతారు. అత్యున్నతమైన నైపుణ్యాలు, పరాక్రమాలు కలిగిన వారి చేతుల్లో ఓడిపోయినప్పుడు కన్నీళ్లు కూడా రావు. ఎందుకంటే క్రీడలు తాము ప్రజాస్వామికమని చెప్పుకోలేవు. అయితే నిజమైన ప్రజాస్వామ్యంలో ఎన్నికలు మాత్రం అందుకు భిన్నమైన ఆట అనే చెప్పాలి. సాధారణ సమయాల్లో సాధారణ పౌర ప్రవర్తనను నియంత్రించడానికి సాధారణ చట్టాలు ఉన్నప్పటికీ, రాజకీయ పార్టీల వారు, అభ్యర్థులు ఎన్నికల సమయంలో ఒక నిర్దిష్ట వైఖరిని పాటించాలని భావిస్తున్నారు. దీనిని వారు ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలోనే స్వచ్ఛందంగా అంగీకరించారు. అయితే సూచించిన నిబంధనలన్నీ నిర్దిష్టంగా చట్టంలో లేవు. కొన్నిసార్లు ఇది మంచి ప్రజా ప్రవర్తన పట్ల వారి నిబద్ధతకు గుర్తు. ఈసీ పాటించే సమతూకం విధానానికి చెందిన ప్రదర్శన. ఎన్నికల సమయంలో ఈసీ అమలు చేయాలని భావిస్తున్న ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)కి ఆవిర్భావం ఇది. ఎంసీసీని పరిశీలిస్తే కోడ్ పరిధిలో నలుగురు ప్రధాన ఆటగాళ్లు ఉన్నారని అర్థమవుతుంది. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, అధికార పార్టీ, బ్యూరోక్రసీ. చివరి రెండూ పాలక వ్యవస్థలో భాగమే కానీ వాటికి కూడా విడిగా కోడ్ వర్తిస్తుంది. కోడ్‌లో ఎక్కువ భాగం

ఇప్పటికే ఉన్న విభేదాలను తీవ్రతరం చేయడం, లేదా పరస్పర ద్వేషాన్ని పాదుకొల్పటం, లేదా వివిధ కులాలు, వర్గాల మధ్య ఉద్రిక్తతలను సృష్టించటం, లేదా ధ్రువీకరించలేని ఆరోపణలు చేయడం, చట్టంలో పొందుపరచబడిన ఉల్లంఘనల చుట్టూ ఉంటుంది. ఓట్లను పొందడం కోసం కులం లేదా మతపరమైన భావాలను ప్రేరేపించరాదనీ, పార్టీలు, అభ్యర్థులు అవినీతి విధానాలను ఆశ్రయించరాదనీ, పార్టీలు, వారి కార్యకర్తలు ప్రత్యర్థి పార్టీల కార్యకలాపాలకు అంతరాయం కలిగించరాదని కోడ్ నిర్దేశిస్తుంది. ప్రచారసభలు, ఊరేగింపులు, పోలింగ్ బూత్‌లు, మేనిఫెస్టోలపైన ఇలాంటి సెక్షన్లు ఉన్నాయి. అయితే, గమనించదగ్గ విషయం ఏమిటంటే, 'కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ' కోసం ఎంసీసీ ఒక ప్రత్యేక విభాగాన్ని కేటాయించింది. 'అధికారిక పదవిని ఉపయోగించినట్లు ఎటువంటి ఫిర్యాదు రాకుండా, ఎటువంటి ఫిర్యాదుకూ కారణం చూపే అవకాశం లేకుండా చూసుకోవా'లని కోడ్ ఆజ్ఞాపించింది. కోడ్ పరిధిలోకి వచ్చిన దుర్వినియోగమంటే.. అతిథి గృహాలు, రవాణా వంటి ప్రభుత్వ సౌకర్యాల వినియోగానికి సంబంధించినవి. అలాగే ప్రకటనల్ని జారీ చేయడానికి లేదా కొత్త ఆంక్షలను మంజూరు చేయడానికి ప్రభుత్వ నిధులను వినియోగించడం, అందుకు అధికారాన్ని ఉపయోగించడం కూడా! ఎంసీసీ వీటిని దాటి వెళ్లదు.

రాష్ట్ర యంత్రాంగం, న్యాయ వ్యవస్థ సాధారణ పనితీరు ప్రస్తుత ఎంసీసీ ద్వారా ఏ విధంగానూ పరిమితమైపోదు. న్యాయస్థాన విచారణల వంటి న్యాయప్రక్రియలో ఈసీ జోక్యం చేసుకోవడం, లేదా చట్టాన్ని అమలు చేసే సంస్థల సాధారణ విచారణ ఈసీ ఆదేశాలకు లోబడి ఉండాలా వద్దా అనేది చర్చనీయాంశం. బహుశా, ప్రారంభంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముసాయిదాను రూపొందించినప్పుడు ప్రభుత్వ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల అధికార దుర్వినియోగం అనేది ఊహకైనా రాలేదు. అయితే, ఎంసీసీ అనేది మానవ ప్రవర్తన లాగా కాలగతిలో మారుతూ వచ్చే పురోగమన పత్రం. 2009లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో, ఈసీ 2009 మార్చి 19 నాటి తన లేఖను పరిశీలించి, ఎంసీసీ వర్తింపు చట్టబద్ధమైన స్వయం ప్రతిపత్తి గల ఎలక్ట్రిసిటీ రెగ్యు లేటరీ కమిషన్‌ల వంటి కమిషన్‌లకు విస్తరించిందని స్పష్టం చేసింది. బడ్జెట్ సమర్పణపై ఎంసీసీ వర్తింపు గురించి ఆ నాటి ఈసీ లేఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం నెలకొన్న వాతావరణం, ప్రభుత్వ సంస్థల జోరు ఫలితంగా అన్నిపక్షాలకూ సమాన అవకాశాలు లేని స్థితి చూశాక ఎన్నికల సంఘం రంగంలోకి దిగాల్సిందేనేమో! తాజా ఫిర్యాదులకు దారితీసిన పరిస్థితులను పరిశీలించాలేమో!! గతంలో ఇలాంటి పరిస్థితుల్లోనే 2019లో ఎన్నికల సంఘం రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు ఒక సలహాను జారీ చేసింది. ఇప్పుడు మళ్ళీ ఆ విధంగానే ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల అపూర్వమైన చర్యల పరంపర ఏదైనా 'ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య అభ్యాసాన్ని' ఉల్లంఘిస్తున్నదేమో ఈసీ నిర్ధారించాలి. ఇప్పుడు ఎన్నికల సంఘానికి ఉన్న ప్రధానమైన సందిగ్ధత ఏమిటంటే...

> **'స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు' నిర్వహించే తన ఏకైక బాధ్యతకు కట్టుబడి రూల్ బుక్‌ను అనుసరించాలా, లేక 'స్క్రిప్టు'ను తిరిగి రాయాలా అనేది! 'స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్ని కలు' అనే పదం రాజ్యాంగంలో పేర్కొన లేదు కానీ ఈసీ 'పర్యవేక్షణ, దిశానిర్దేశం' అనే మాటలోనే ఆ స్ఫూర్తి నిండి ఉంటుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనేది కూడా మనం సాధారణంగా అర్థం చేసుకునే దానికంటే చాలా పెద్దది. సంపూర్ణంగా గ్రహించి, అమలు చేయాల్సిన న్యాయమైన స్ఫూర్తి అందులో ఉంటుంది. ❑**

# బొంకుల దిబ్బ రాజకీయం

**(17వ పేజీ తరువాయి)**

ఆశ చావదు. ఇది నోరులేని పశువుకు చేసే వంచన. మోదీ చూపించే ఉజ్వల భవిష్యత్ దర్శనం కూడా ఇలాంటిదే !

మోదీ వికసిత భారతాన్ని ప్రజల ముందుఆడిస్తున్నారు. కమలం వికసిస్తేనే భారత్ వికసిస్తుదని అంటున్నారు. ఇప్పుడు వికసిత భారతానిది నడక. ఎన్నికల తర్వాత పరుగులు పెడుతుందట. మోదీ వికసిత భారతం వేరు .ఆయనిది అదానీ, అంబానీలు వికసిత భారతం. ఎన్నికల బాండ్ల వర్షంతో కమలం వికసిస్తే

సమర్పించుకున్న వాళ్ళు ప్రాజెక్టులు ,ప్రయోజనాలు పొందిన వికసిస్తారు. తప్పుడు జీఎస్టీతో పన్నుల రాబడి వికసిస్తుంది. ధరాఘాతం ప్రజలు బతుకుల్ని వికటిస్తుంది. మోదీ భారతంలో ఏటా బిలియనీర్లు వికసిస్తున్నారు. అంతరాలు వికసిస్తున్నాయి. సామాన్యులు జీవనస్థితి విషమిస్తున్నది. మోదీ దీనినే అమృతకాలం అంటారు. అమృతం అస్మదీయులకీ ,హాలాహలం ప్రజలకీ పంచుతున్నారు. ప్రజల పాలిట ఇది వంచన రాజకీయం.బొంకుల దిబ్బ రాజకీయం . కన్యాశుల్కం కథ బొంకుల దిబ్బ మీద ప్రారంభమై చివరకు “డామిట్ కథ అడ్డంగా తిరిగింది” అంటూ ముగుస్తుంది. ఈ ఎన్నికలలో ప్రజలు తల్చుకుంటే బొంకుల దిబ్బ రాజకీయాల కథ కూడా అడ్డంగా తిరుగుతుంది. ❑

# పాత పౌరసత్వ చట్టం.. కొత్త సమస్య



- మాడభూషి శ్రీధర్

**కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం 2019లో వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని తెచ్చింది. పౌరసత్వ చట్టం, దాని సవరణ చట్టం 2019తోపాటు జాతీయ పౌర పట్టిక, జాతీయ ప్రజా పట్టిక వంటి శాసనాలు, నియమాలు కూడా బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. తన ఎన్నికల ప్రణాళిక ప్రకారం పౌరసత్వ చట్టాల్లో ఈ మార్పులు తెచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.**

2014 ఎన్నికల మ్యానిఫెస్టోలోనే, ప్రపంచంలో ఎక్కడైనా వివక్షను ఎదుర్కొంటున్న హిందువులందరికీ భారతదేశం సహజమైన ఆశ్రయం అవుతుందని, వారు శరణార్థులుగా భారతదేశం రావడానికి సదా ఆహ్వానం ఉంటుందని బీజేపీ పేర్కొన్నది. ఫారినర్స్ ఆర్డర్-1948లో 2015 సెప్టెంబర్ 7న చేర్చిన కొత్త నియమాల్లో బంగ్లాదేశ్, పాకిస్థాన్‌ల నుంచి వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పారసీ, క్రైస్తవ మతస్థులకు ప్రత్యేక మినహాయింపులు ప్రకటించారు. 'పాస్‌పోర్టు రూల్స్-1950'లో 2015, సెప్టెంబర్ 7న చేర్చిన కొత్త ఉప నియమం ప్రకారం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పారసీ, క్రైస్తవ మతస్థులకు ప్రత్యేక మినహాయింపులను చేర్చారు. ఈ రెండు కొత్త మినహాయింపులకూ 2016, జూలై 18న మరొక సవరణ చేస్తూ అఫ్ఘానిస్థాన్ పేరు కూడా చేర్చారు. ఈ మూడు అంశాలకు చట్టబద్ధత కల్పిస్తూ పౌరసత్వ చట్టంలో ప్రవేశపెట్టడానికి పౌరసత్వ సవరణ చట్టం-2019 రూపొందించారు.

పౌరసత్వ చట్టం(1955)లో సవరణలను చేస్తూ కేంద్రం శరవేగంగా రూపొందించిన పౌరసత్వ సవరణ బిల్లు (సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ బిల్), 2019 డిసెంబర్ 9న లోకసభ ఆమోదం పొందింది. అనుకూలంగా 311 ఓట్లు వస్తే 80 మంది వ్యతిరేకించారు. డిసెంబర్ 11న రాజ్యసభలో కూడా ఈ బిల్లు పాస్ అయింది. 125 ఎంపీలు అనుకూలంగానూ 105 మంది వ్యతిరేకంగానూ ఓట్లు వేశారు. తర్వాత అంతే వేగంగా రాష్ట్రపతి సంతకం చేయడంతో పౌరసత్వ సవరణ చట్టం (సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ ఆక్ట్) 2019గా మారి పోయింది. దీనికింద నియమాలు జారీ చేయవలసి ఉండింది. న్యాయ, హోం శాఖలు సంయుక్తంగా రూపొందించే నియమాలు, పౌరసత్వ సవరణ చట్టం అమలును నిర్ధారిస్తాయి.

**చిన్న చట్టం పెద్ద సమస్య :**

ఈ పౌరసత్వ సవరణ చట్టం (2019) చాలా చిన్నది. ఐదారు సెక్షన్లలో మార్పు చేర్పులు చేసే సవరణ ఇది. సెక్షన్ 2లో పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్ నుంచి వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతస్థులు 'చట్ట వ్యతిరేక చొరబాటుదారుల' గుర్తింపు నుంచి మినహాయింపు పొందుతారు అనే మార్పును కేంద్రం చేర్చింది. అక్రమ చొరబాటుదారులు అనే నిర్వచనం నుంచి మినహాయింపు ఇవ్వడం వల్ల ఈ మూడు ఇస్లామిక్ దేశాల నుంచి వచ్చే ఆరు మతస్థులకు త్వరగా భారతీయ పౌరసత్వం ఇచ్చే వీలు కలుగుతుంది. ఆరు మతాలను పేర్కొన్నప్పటికీ ఇస్లాం మతం ఈ జాబితాలో లేకపోవడం వల్ల ఈ మూడు దేశాల నుంచి వచ్చే మహ్మదీయులకు త్వరితగతిన పౌరసత్వం పొందే అవకాశం ఉండదు. ఆ మూడు దేశాల నుంచి వచ్చే శరణార్థులకు, వలసదారులందరికీ వర్తించే విధంగా నియమాలు లేకపోవడం వల్ల, ఈ చట్టం సర్వ సమానతా సూత్రానికి, ఆర్టికల్ 14కు విరుద్ధమని విమర్శలు చెలరేగాయి. మన దేశానికి వలసదారులుగా వచ్చే విదేశీయుల్లో ఎవరికి పౌరసత్వం ఇవ్వాలో, ఎవరికి ఇవ్వకూడదో తేల్చుకునే అధికారం తనకు లేదా? అని ప్రభుత్వం వాదిస్తున్నది. ఈ దేశ పౌరులను మత ప్రాతిపదికపై విభజించడం లేదనీ, కనుక ఇది ఆర్టికల్-14కు భంగకరం కాదని అంటున్నది.

1955 పౌరసత్వ చట్టంలో సెక్షన్ 6బీ ని కొత్తగా చేర్చారు. ఈ సెక్షన్ 6బీ ప్రకారం.. పైవిధంగా మినహాయింపు పొందిన మతస్థులు పౌరసత్వం కోసం నమోదు చేసుకున్నప్పుడు పొందే రాయితీలను వివరించింది. సెక్షన్ 7డీలో సవరణ, సెక్షన్ 18లో సవరణ ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా కార్డు కలిగి ఉన్నవారికి ఇచ్చే మినహాయింపు గురించి చెప్తాయి. మూడో షెడ్యూల్లో కొత్తగా చేర్చిన నిబంధన ప్రకారం అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతస్థుల విషయంలో గతంలోని '11 ఏండ్లకు తక్కువ కాకుండా' అని ఉన్న నిబంధనను 'ఐదేండ్లకు తక్కువ కాకుండా' అని మార్చి, దరఖాస్తు చేసుకోవడానికి ముందు ఐదేండ్లు నివసిస్తే చాలు, పౌరసత్వం పొందే అవకాశం

కల్పించారు. మామూలుగా అయితే అసలు చట్టం ప్రకారం.. 11 ఏండ్లు నివసించిన వలసదారులకు మాత్రమే పౌరసత్వం పొందే వీలుంది. వాస్తవంలో ఇది మూడు ఇస్లామిక్ పొరుగు దేశాల నుంచి మన దేశానికి వచ్చే ముస్లింలకు భారత పౌరసత్వం ఇవ్వబోమని నిషేధం విధించడమే అవుతుందని తీవ్ర విమర్శలు వచ్చాయి. పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టే దశలో ఉద్దేశాలు, లక్ష్యాల నివేదికను ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆ విధమైన ప్రకటన చేసింది. ఒకప్పుడు భారతదేశంలో భాగాలై తర్వాత విడిపోయిన పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్థాన్‌లు ఇస్లామిక్ మత రాజ్యాలుగా తమ రాజ్యాంగాల్లో ప్రకటించుకున్నాయి. అక్కడ హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతానికి చెందిన అల్పసంఖ్యాక వర్గాలవారు మెజారిటీ మతస్థుల చేతిలో వివక్షకు, హింసకు గురవుతున్నారని, ఆ మతహింస భరించలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భారతదేశానికి తరలివస్తున్నారని, శరణార్థులై చాలామంది మన దేశంలో తలదాచుకుంటున్నారని, వారిని పూర్తిస్థాయి పౌరులుగా మార్చేందుకు సత్వర మార్గాలను ప్రవేశపెట్టి వారిని ఆదుకోవడమే ఈ చట్టం లక్ష్యమని ప్రభుత్వం వివరిస్తున్నది.

సరైన అనుమతులు లేకుండా ఈ విధంగా వచ్చేవారు 'అక్రమ చొరబాటుదారులు' అనే నిర్వచనం కిందకు వస్తారు. ఈ చట్టసవరణ ద్వారా ఆ నిర్వచనం నుంచి 6 మతాల వలస దారులకు మినహాయింపు ఇచ్చారు. వీరిపైన చట్టపరమైన చర్యలు తీసుకోకుండా ఉండటానికి, వీరికి దీర్ఘకాలిక వీసాలు ఇవ్వడానికి ఇప్పటికే పాస్‌పోర్టు (ఎంట్రీ ఇన్ టు ఇండియా) చట్టం (1920)లోనూ, ఫారినర్స్ చట్టం(1946)లోనూ 2015, 2016లో సవరణలు చేశారు. కానీ, వారికి పౌరసత్వం ఇవ్వడం ఆ సవరణల ద్వారా సాధ్యం కాదు. కనుక ఈ సవరణ చట్టం తేవడం అవసరమని కేంద్ర ప్రభుత్వం వివరించింది. ఈ అన్ని సవరణల ఫలితంగా 2014 డిసెంబర్ 31కి ముందు ఆ మూడు దేశాల నుంచి వచ్చిన ఆ ఆరు మతాల వలసదారులకు త్వరగా సులభంగా భారత పౌరసత్వం ఇవ్వడానికే ఈ సవరణ తెస్తున్నామన్నారు.

ఇస్లామిక్ మత దేశాలుగా ప్రకటించుకున్న అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో హిందువులు, ఇతర అల్పసంఖ్యాక వర్గాలవారి జనాభా నానాటికి తగ్గిపోతున్న మాట వాస్తవం. దానికి కారణం వారిపై సాగుతున్న తీవ్ర మత వివక్ష అనడంలో కూడా సందేహం లేదు. అధికారికంగా మత రాజ్యమని ప్రకటించుకున్న ఈ దేశ రాజ్యాంగాలు సెక్యులర్ విలువలను పాటించే అవకాశం ఉంటుందనుకోలేం. హత్యలకు అత్యాచారా లకు, మత మార్పిడులకు గురయ్యే ఈ అల్పసంఖ్యాక వర్గాలకు, ముఖ్యంగా హిందువులకు భారతదేశం తప్ప మరో గత్యంతరం లేదు. అలాంటి శరణార్థులకు ఆశ్రయం కల్పించడం, కావాలంటే పౌరసత్వం ఇవ్వడం నిజంగా మానవతా దృష్టితో కూడుకున్న మంచి పని. ముస్లింలు ఆ మూడు దేశాల్లో మైనారిటీలు కాదనీ, వారి పట్ల మత వివక్ష ఉండే అవకాశమే లేదని ప్రభుత్వం వాదన. అదే నిజమైతే ముస్లింలు శరణార్థులై వచ్చే అవకాశమే లేకపోతే, వారిని ప్రత్యేకంగా మినహాయించి, మిగిలిన ఆరు మతాలవారికే సత్వర పౌరసత్వ సదుపాయం కల్పించడం దేనికి? అది ఇరుగుపొరుగు దేశాల్లో కేవలం మూడు దేశాలకే ఈ సదుపాయాన్ని పరిమితం చేయడం దేనికి? ప్రపంచంలో ఏ దేశం నుంచైనా మత వివక్షకు గురైన మైనారిటీలకు ఆశ్రయం కల్పించాలన్న గొప్ప మానవతావాదం దీని వెనుక లేదనేది సుస్పష్టం.

కనీసం మన అఖండ భారతదేశం నుంచి వేరైన దేశాల నుంచి వచ్చేవారినైనా పూర్తిగా ఆదరిస్తున్నామా? అంటే అదీ లేదు. ఆఫ్ఘానిస్థాన్‌కు మన దేశంతో సరిహద్దు లేదు. అయినా అక్కడినుంచి వచ్చేవారికి పౌరసత్వ సదుపాయం కల్పిస్తున్నారు. మన దేశపు హద్దులను ఆనుకొని ఉన్న మయన్మార్ నుంచి రోహింగ్యాలు మన దేశంలోకి వలస వస్తూనే ఉన్నారు. సముద్రం విడదీసిన శ్రీలంక నుంచి మతవివక్ష, అంతర్యుద్ధం కారణంగా వేలాది మంది తమిళులు మన దేశంలోకి వస్తూనే ఉన్నారు. వారూ హిందువులే కదా. శ్రీలంక పేరును చేర్చకపోవడం ద్వారా వారికి అవకాశాన్ని తొలగించారు. పాకిస్థాన్ పేరు చేర్చినా, అక్కడ మతహింసకు, వివక్షకు గురైనవారందరికీ ఆశ్రయం కల్పించే మానవత్వం ఉందా అంటే అదీ లేదు. ఎందుకంటే అక్కడ అహ్మదియాలు, షియాలు, సూఫీలు, బలూచీలు ఇంకా అనేక మైనారిటీ తెగలవారున్నారు. అదే విధంగా బంగ్లాదేశ్‌లో ఈ ఆరు మతాల వారే కాకుండా కనీసం 12 గిరిజన తెగల వారు మతవివక్షకు గురవుతున్నారు. వారికి ఆశ్రయం పౌరసత్వం ఇవ్వరన్న మాట.

పౌరసత్వ చట్టం (1955) ప్రకారం శరణార్థులై ఏ దేశాల నుంచి వచ్చినవారైనా సరే, ఏ మతం వారైనా, ముస్లింలైనా సరే, 11 ఏళ్లు ఈ దేశంలో నివసించి ఉంటే పౌరసత్వం పొందడానికి దరఖాస్తు పెట్టుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం కొన్ని షరతులకు లోబడి వారికి పౌరసత్వం ఇవ్వవచ్చు కూడా. ముస్లింలకు పౌరసత్వం ఇవ్వడానికి ఈ సవరణ చట్టం ఒక నిషేధం వంటిదనే విమర్శలకు ప్రభుత్వం ఇస్తున్న సమాధానం ఏమంటే, పౌరసత్వ చట్టం (1955)లో సవరణ పూర్వ నియమాల కింద 'ముస్లిం వలసదారుల'కు కూడా పౌరసత్వం ఇవ్వచ్చునని. 2014 డిసెంబర్ 31లోగా మన దేశానికి ఆఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి మత వివక్షకు గురై వచ్చిన హిందువులు, క్రైస్తవులు, జైనులు, పార్సీలు, సిక్కులు, బౌద్ధులకు ఐదేళ్లపాటే నివసించి ఉంటే వారికి పౌరసత్వం ఇస్తామని 2019 సవరణ చట్టం ప్రకటిస్తున్నది. ఈ చట్టాల పదాల్లో, వాక్యాల్లో,

మినహాయింపుల్లో కనిపించని పథకాలు ఏవైనా ఉన్నాయా?

మనం కేవలం రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వాన్ని నడపాలి. రాజ్యాంగాన్ని మార్చుకోవచ్చు. కానీ మౌలిక లక్షణాలను సవరించడానికి వీల్లేదు. కేశవానంద భారతి కేసులో 13 మంది న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పుతో 50 ఏళ్లుగా ఈ రాజ్యాంగ బేసిక్ స్ట్రక్చర్‌ను (మౌలిక లక్షణాలు) కాపాడుకుంటూ వస్తున్నాం. బేసిక్ స్ట్రక్చర్ అంటే అపార్టుమెంట్‌లో కీలకమైన స్తంభాలు మార్చడానికి వీల్లేదు. ఆ విధంగా మార్చితే భవనం కూలిపోతుంది. అంటే స్తంభాన్ని మార్చకుండా తలుపులు, కిటికీలు, గోడలు మార్చుకోవడానికి వీలుంది. ఇదే బేసిక్ స్ట్రక్చర్! మాకు అధికారం ఉన్నదని ప్రతి పార్టీ రాజ్యాంగాన్ని మార్చుకుందామనుకుంటే అది సరైన పరిపాలన కాదు. రాజ్యాంగం మౌలిక లక్షణాలను దెబ్బ తీసేలా కొత్త చట్టాలను తీసుకురావడానికి వీలు లేదు. ఈ నేపథ్యంలో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) గురించి ఆలోచించాలి. పౌరసత్వాన్ని సవరిస్తూ 2019లో పలు మార్పులు తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఐదేళ్ల వరకు ఈ చట్టాన్ని అమలు చేయలేదు, చేయలేకపోయారు. ఈ సవరణ దేశానికి మంచిదని చాలామంది నమ్మడం లేదు. ఇన్నాళ్లు అంటే ఐదేళ్లుగా సీఏఏను అమలు చేయకుండా కేవలం ఎన్నికలకు ముందు ఈ నిబంధనలు తెచ్చారు. అయితే చట్టం ఏం చెప్పినప్పటికీ ఆ నియమాల అమలు మాత్రం న్యాయంగా ఉంటుందా, ఉండదా? అనే అనుమానాలు పెరిగిపోయాయి. అందువల్లే నిరసనలు, విమర్శలు, పిల్స్ వేయడం, దిష్టిబొమ్మలు తగలబెట్టడం వంటి ఆందోళనలు! మాకు 400 ఎంపీల సీట్ల కన్నా ఎక్కువగా వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బీజేపీ నేతలు భయపెడుతున్నారు.

పౌరసత్వ సవరణ చట్టం ఈ దేశంలోని ముస్లింల సమస్య కాదు. అది దేశ రాజ్యాంగానికీ, లౌకికవాదానికి, ప్రజాస్వామ్యానికీ ముంచుకొస్తున్న ప్రమాదానికి సంబంధించిన సమస్య. పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైనది. 2019 పౌరసత్వ సవరణ చట్టం దేశంలోని ప్రజలను విడగొట్టే ప్రమాదం ఉన్నది. కుల, మత, ప్రాంతీయ, భాషా భేదాలకు అతీతంగా దేశ పౌరులందరూ చట్టం ముందు సమానమేనని చెప్తున్న భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఈ చట్టం దేశంలోని కొందరి పట్ల వివక్షను ప్రదర్శిస్తుంది. దీనితోపాటు అసోంలో జారీ చేసిన జాతీయ పౌరసత్వ రిజిష్టర్ (ఎన్ఆర్‌సీ)ను దేశ మంతటికీ విస్తరించడానికి చేస్తున్న ప్రయత్నాలు భారతదేశ లౌకిక స్వభావాన్ని మారుస్తాయి. భారతీయులమైన మనం భారతీయులమేనని నిరూపించుకోడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యూలైన్లలో నిలుచొని పత్రాలు సమర్పించాల్సి వస్తుంది. పత్రాలు లేకపోతే మనమంతా స్వదేశంలో అక్రమ వలసదారుల మవుతాం. దీనివల్ల దేశంలోని ముస్లిం ప్రజలే కాకుండా హిందువులు దాదాపు 140 కోట్ల జనాభా తాము భారత పౌరులమేనని నిరూపించుకోవల్సిందేనా? సరైన పత్రాలు లేనివారంతా విదేశీయులుగా ముద్రపడి శరణార్థుల శిబిరాల్లో బతకాల్సి ఉంటుందా?

2019 డిసెంబర్ 11న పార్లమెంటులో ప్రతిపక్షాలన్నీ బహిష్కరించిన తర్వాత ప్రజాస్వామ్యం ఎన్నడూ చూడని రీతిలో ఈ బిల్లును ఆమోదింపజేసుకొని, సాధించుకున్నారు. ముస్లింల ను ప్రత్యేకంగా మినహాయించడం వివాదమైంది. ఆ వివాదం వల్లనే దేశవ్యాప్తంగా ఆందోళనలు, సమస్యలు తలెత్తుతున్నాయి. ఢిల్లీలో నిరసనలు, దిష్టిబొమ్మల దహనం జరిగాయి. అంతేకాదు, ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అనేక పిల్స్ దాఖలయ్యాయి. ఢిల్లీలో, పశ్చిమబెంగాల్‌లో భద్రతా సమస్యలు తలెత్తాయి. పోలీసులు మిలిటరీ బలగాలు తనిఖీలు జరపాల్సి వస్తున్నది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్ఆర్సీ)తో అనుసంధానించడం, కొత్తచట్టంపైనా వ్యతిరేకతకు మరో కారణం.

ఈ దేశంలో ఉండేవారు భారతీయ పౌరులా? కాదా? అనేది ఏ విధంగా నిర్ణయిస్తారు? మీరు, మీ తండ్రులు, తాతలు అంతా భారత పౌరులని ఏ విధంగా రుజువు చేయాలి? అనే ప్రశ్నలకు సరైన జవాబులు దొరకడం లేదు. ఇది ప్రధాన సమస్య. దీనివల్ల ఈ దేశంలో ఉన్నవారికి, వేరే దేశం నుంచి వచ్చినవారికి భారత్‌లో పౌరసత్వం పొందాలంటే కావాల్సిన అర్హతలు, ధృవీకరణలు ఎక్కడ దొరుకుతాయి? ఉన్నట్టుండి మా తాత భారత పౌరసత్వం కలిగి ఉండేవాడని రుజువు చేసుకోవడానికి అర్హతలు ఎక్కడ దొరుకుతాయి? ధ్రువీకరణ పత్రాలు ఎక్కడ లభిస్తాయి? ఒకవేళ దొరకకపోతే ఇక్కడ పుట్టినవాడు, తరతరాలుగా ఉన్నవాడు, ఓటింగ్ ఉన్నవాళ్లు కూడా, ఆధార్ ఉన్నా.. పౌరుడు కాదనే అనుమానం వస్తే ఏం చేయాలి?

ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఏ పౌరుడికైనా పౌరసత్వాన్ని నిరాకరిస్తే, ఇవ్వబోమని నిర్ణయిస్తే.. ఎక్కడికి వెళ్లాలి, ఏ దేశానికి వెళ్లాలి? ఒకవేళ వీడు విదేశీయుడని నిర్ణయిస్తే.. ఆ మాజీ పౌరులు ఏమైపోవాలి? అరెస్టు చేస్తారు. జైల్లో పెడతారు. వారు జైల్లో ఎన్నాళ్లు ఉంటారు? ఎవరికైనా పౌరసత్వాన్ని భారత ప్రభుత్వం నిరాకరిస్తే.. భారత రాజ్యాంగంలో ఉన్న ఏ హక్కులూ దక్కవు. అప్పుడు వాళ్ల గతి ఏమిటి? అసోం తరహాలో లక్షల మంది జైలు పాలు కావాల్సిందేనా? కనుక కొన్ని కొత్త జైళ్లు నిర్మిస్తారు. ఇదా దేశాభివృద్ధి కార్యక్రమం? 50 ఏళ్లనాటి కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశం ఇప్పటికీ ప్రామాణికంగానే ఉంది. కనుక భవిష్యత్తు లోనూ కులాలు, మతాల ఆధారంగా పరిపాలన చేయడానికి వీల్లేదు. ముఖ్యంగా పౌరసత్వ అర్హతలను మార్చే అధికారం ప్రభు త్వానికి లేదు. రాజ్యాంగ పీఠికలో **(మిగతా 27వ పేజీలో)**

# హిందూత్వ,సామాజిక న్యాయం ఒకే ఒరలో ఇమడవు!



- బి.వి.రాఘవులు

**ప్రధాని నరేంద్ర మోడీ, 'సనాతన ధర్మానికి' తన మద్దతును బహిరంగంగా ప్రకటించినప్పుడే అసలు రహస్యం బయట పడింది. 'సనాతన ధర్మం', సామాజిక న్యాయాన్ని, సమానత్వ భావనను వ్యతిరేకిస్తుందని తెలుపుతూ గతేడాది సెప్టెంబర్‌లో ఉదయనిధి స్టాలిన్ చాలా పదునైన, విమర్శనాత్మక వ్యాఖ్యలు చేసినప్పుడు, మోడీ దానిని గట్టిగా సమర్థించుకున్నాడు. 'సనాతన ధర్మ' వినాశనమే లక్ష్యంగా ఓ రహస్య ఎజెండాను కాపాడుతున్నారని ఆరోపిస్తూ, ఆ ధర్మాన్ని వ్యతిరేకించే వారినుద్దేశించి తీవ్రస్థాయిలో మాట్లాడాడు.**

'సనాతన ధర్మ' విరోధులకు వ్యతిరేకంగా ఎదురుదాడి చేయడానికి హిందూత్వ ప్రచారదళంలో చేరాలని మంత్రుల్ని, తన పార్టీ సభ్యుల్ని రెచ్చగొట్టాడు కూడా. సామాజిక న్యాయం, దళితుల గౌరవం గురించి పదే పదే మోడీ చేస్తున్న వాదనల వెనకున్న కపటత్వంతోపాటు అంబేద్కర్‌పై ఆయన కురిపిస్తున్న ప్రశంసలు, సంత్ రవిదాస్ విగ్రహం పట్ల ఆయన చూపిస్తున్న గౌరవంలోని డొల్లతనాన్ని ఈ సంఘటన బట్టబయలు చేసింది. 'భారతదేశాన్ని వేల ఏళ్లపాటు ఐక్యంగా ఉంచిన ఆలోచనలు, విలువలు, సాంప్రదాయాలను 'సనాతన ధర్మం' కలిగి ఉందని' మోడీ ప్రకటించాడు. అయితే 'పురాతన', 'శాశ్వత', 'సార్వత్రిక సత్యాలు లేదా చట్టాలు' లాంటి అస్పష్టమైన పదాలను తప్ప, 'సనాతన ధర్మానికి' సంబంధించిన ఆలోచనలు, విలువలు, సాంప్రదా యాలను కలిపే విషయం గురించి మోడీ గానీ, తన నేరమయ, హింసాత్మక దళం గానీ వివరించలేదు. ఈ వివరణ లేకపోవడ మనేది 'సనాతన ధర్మం' ప్రాథమిక, విశిష్ట 'వర్ణ లేదా జాతి వ్యవస్థ' లక్షణాన్ని మరుగున పడేస్తుంది. తనకు వనరుగా ఉండే దండు 'సనాతన ధర్మాన్ని' రక్షించడానికి ముందుకు వెళ్ళింది. వారు ఉత్కృష్టమైన వాక్చాతుర్యంతో దాని సారాన్ని దాచిపెట్టి, లోకజ్ఞానం, మానవ విలువలు, వ్యక్తిగత విధులు, బాధ్యతలు, ప్రవర్తనా ప్రమాణాలు, నైతిక విలువలు లాంటి మాటలతో దానిని నిర్వచిస్తున్నారు. 'సనాతన ధర్మం' నిజ స్వభావాన్ని దాచి పెట్టడానికి దాని చుట్టూ వారు అల్లుతున్న అస్పష్టమైన అధ్యాత్మిక వాదాన్ని సద్గురు వాసుదేవ్ వంటి ప్రముఖులిచ్చిన వివరణల్లో మనం చూడవచ్చు.

'మీరు సహజంగా వీటన్నింటికీ మూలాన్ని కనుగొనే విధంగా 'సనాతన ధర్మం' మొత్తం ప్రక్రియ నీలో ప్రశ్నల్ని లేవనెత్తు తుందని' ఆయన పేర్కొన్నాడు. ఇలాంటి మరొక వ్యక్తి, 'సనాతన ధర్మం' అందర్నీ ప్రేమించి, అందర్నీ కలుపుకొని పోతుందని' వ్యాఖ్యానించాడు. ఒకవేళ మనం ఈ వాదనలను 'సనాతన ధర్మం' సారంగా అంగీకరించినా, ఇలాంటి శాశ్వతమైన సత్యాలే మనకు అన్ని మతాల్లో కనిపిస్తాయి. కానీ ఈ అభిప్రాయం అమానవీయ కుల, లింగ వివక్షతను ఎదుర్కొంటున్న దళితులు, ఇతర బలహీన కులాల వారి దినచర్యలో భాగంగా ఎదుర్కొం టున్న అనుభవాలకు వ్యతిరేకంగా ఉన్నాయి. కాబట్టి వాస్తవానికి సనాతన ధర్మాన్ని వేరుగా ఉంచేదేమిటి? నిరాధారమైన వాటిని సమర్థించుకోలేని స్థితి నుండి హిందూత్వ తత్వవేత్తలు తప్పించు కోవడానికి సంక్లిష్టమైన వివరణలు, న్యాయ సమ్మతమైన ఆగ్రహంతో నిమిత్తం లేకుండా వారు సనాతన ధర్మంలో ఉన్న శాశ్వతమైన సత్యం అంటే కఠినమైన, అమానవీయ, శ్రేణీగత, వారసత్వ, పుట్టుక ఆధారిత కులవ్యవస్థను దాచి ఉంచలేరు.

అత్యంత అణచివేత, హానికరమైన 'వర్ణాశ్రమ ధర్మం' లేక 'కుల ధర్మం' కొన్ని వేల సంవత్సరాలుగా భారత దేశాన్ని కలుపు తున్న ఏకైక ముఖ్యమైన ఆలోచన, విలువ, సాంప్రదాయం అనే వాస్తవాన్ని వారెలా విస్మరిస్తారు ? కాబట్టి మోడీ, సంఘ్ పరివార్ ప్రత్యేకమైన బుద్ధి మాంద్యంతో బాధపడుతున్నట్లు కనిపిస్తున్నారు. వేదాలు, ఉపనిషత్తులు, ధర్మ సూత్రాలు, గృహ్య సూత్రాలు, పురాణాలు, భగవద్గీతలు అన్నీ వర్ణ లేదా జాతి ధర్మ వ్యవస్థను సమర్థిస్తాయని వారు నిరాకరించగలరా? వర్ణ ధర్మం నుండి పక్కకు మళ్లుతున్నందుకు కఠినమైన శిక్షను విధించడమే కాక, వర్ణధర్మ పరిరక్షణ పాలకుల ప్రాథమికమైన బాధ్యత అని చెప్పే మనుస్మృతిని మనం పట్టించుకో కూడదని వారు కోరుకుంటున్నారా? ఒకవేళ మోడీ వర్ణ లేదా జాతి ధర్మాన్ని, సనాతన ధర్మం నుండి వేరు చెయ్యాలనుకుంటే, విమర్శకుల్ని అప్రతిష్టపాలు చేయడానికి ముందే ఆయన ప్రజలకొక విషయాన్ని స్పష్టం చేయాల్సి ఉంటుంది. అది అతనికి ఖచ్చితంగా తెలియకుంటే శ్రేణీగత, వివక్షాపూరితమైన 'వర్ణ లేదా జాతి ధర్మం' వారి పవిత్రమైన గ్రంథాల్లో భాగంగా ఉన్నాయా లేవా అనే విషయంపై అవగాహన కోసం వారు సాధువుల్ని, సంతుల్ని, శంకరాచార్యుల్ని వేడుకోవచ్చు. అయితే, మోడీ ఈ పని చెయ్యడమనేది, వాస్తవాల మీద కాక ఆశల మీద

ఆధారపడిన నమ్మకం కావచ్చు ఎందుకంటే అది అతని కపటత్వాన్ని బయటపెడుతుంది.

ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల ఫలితంగా ఏర్పడిన వివాదం హిందుత్వ దళం అసలు రంగును బయట పెడుతుంది. మోడీ, ఆయన అనుచరగణం ప్రజల ముందు 19వ శతాబ్దానికి చెందిన సనాతన వాదులకు (మార్పును వ్యతిరేకించే) నిజమైన వారసులుగా చెప్పుకుంటున్నారు. ఈ కాలంలో బ్రాహ్మణ సమాజం, ఆర్య సమాజ్, ప్రార్థనా సమాజ్, రామకృష్ణ మిషన్, తమను తాము సనాతనవాదులుగా పిలుచుకునే వారి నాయకులు ప్రతిపాదించిన సంస్కరణవాద ఆలోచనలను ఎదుర్కొనేందుకు అనేక సంప్రదాయ సనాతన హిందూ సంస్థలు ఆవిర్భవించాయి. ఈ నాయకులే, ఆ 'సనాతన ధర్మానికి' ప్రాచుర్యం కల్పించారు. 'హిందూ' అనే పదం పర్షియన్ మూలాలు కలిగి ఉన్నందు వల్ల ఈ 'సనాతన వాద' సేవా తత్పరులు 'హిందూ' పదాన్ని ఇష్టపడక, దానికి బదులుగా 'సనాతన ధర్మం' అనే పదానికి ప్రాధాన్యత ఇవ్వడం ఆసక్తికరమైన విషయం.

దళితులు ఆరాధించే అంబేద్కర్ గౌరవం, సమానత్వ దార్శనికతను నెరవేర్చడానికి తాను కృషి చేస్తున్నట్టు చేసే నటనను గత దశాబ్ద కాలపు మోడీ పాలనా కాలం బహిర్గతం చేస్తుంది. దానికి బదులుగా మన దేశంలో పీడితులు, దోపిడీకి గురైన ప్రజలు పోరాటాల ద్వారా సాధించుకున్న కొన్ని అధికారిక హక్కులు, కొద్దిపాటి గౌరవాన్ని అతని పాలన ఒక క్రమపద్ధతిలో ధ్వంసం చేసింది. పెరిగిపోతున్న నేరాల రేటు, కుంచించుకుపోతున్న ఉద్యోగావకాశాలు, పెరిగిపోతున్న ఆర్థిక వివక్షత, దిగజారుతున్న దళితులు, గిరిజనుల జీవన స్థితిగతులపై నిర్ధారణను ధ్రువీకరిస్తాయి.

మోడీ హిందుత్వ, కార్పోరేట్ పాలనలో దళిత వ్యతిరేక, గిరిజన వ్యతిరేక నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇది, సమాజంలో మొత్తంగా మనువాద భావజాల ప్రాబల్యాన్ని సూచిస్తుంది. 2018 నుండి నాలుగేండ్ల కాలంలో దళితులకు వ్యతిరేకంగా 1.9 లక్షలకుపైగా నేరారోపణ కేసులు నమోద య్యాయి. ఉత్తరప్రదేశ్ ఈ ఆగడాలకు, దాడులకు (మొత్తం 49,613 కేసులతో) ప్రధాన కేంద్రంగా నిలిచింది. 2022వ సంవత్సరాన్ని 2021తో పోల్చితే షెడ్యూల్డ్ కులాల వారికి వ్యతిరేకంగా 13 శాతం కేసులు పెరగ్గా, షెడ్యూల్డ్ తెగల వారికి వ్యతిరేకంగా 14.3 శాతం కేసులు పెరిగాయి. ఎస్సీలకు వ్యతి రేకంగా జరుగుతున్న నేరాల్లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. అంటే మొత్తం కేసుల్లో 26 శాతం, రాజస్థాన్ 15 శాతం, మధ్యప్రదేశ్ 14 శాతంగా ఉంది. ఎస్టీలకు వ్యతిరేకంగా నమోదైన కేసుల విషయంలో మొత్తం కేసుల్లో 30 శాతంతో మధ్యప్రదేశ్ అగ్రస్థానంలో ఉండగా, 24 శాతంతో రాజస్థాన్, 7.6 శాతంతో ఒడిశాలున్నాయి. నేరాల సంఖ్య పెరగ డంతోపాటు, ఈ నేరాల్లోని క్రూరత్వం దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. ఏడుగురు దళిత యువకులను గుజరాత్ రాష్ట్రంలో ఉనాలో బహిరంగంగా కొట్టడం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హత్రాస్‌లో ఒక దళిత మహిళపై అత్యంత క్రూరంగా సామూహిక అత్యాచా రానికి పాల్పడితే, అది ఆమె మరణానికి దారి తీయడం, మధ్యప్రదేశ్ రాష్ట్రంలో సోధీ ఘటనలో ఓ బీజేపీ నాయకుడు ఓ గిరిజన వ్యక్తిపై మూత్ర విసర్జన చేయడం లాంటి సంఘటనలు దేశం యొక్క అంతరాత్మను కదిలించాయి.

సంఘ్ పరివార్, హిందుత్వ శక్తుల అండతో బీజేపీ ప్రభుత్వాలు సృష్టించిన మనువాద వాతావరణంలో దళితులు, గిరిజనులకు వ్యతిరేకంగా ఇలాంటి హేయమైన నేరాలు పాల్పడడానికి కులతత్వ శక్తులెలా ప్రోత్సాహం ఇస్తున్నాయో ఈ భయంకరమైన చర్యలు తెలియజేస్తున్నాయి. ఇవే శక్తులు, సమాజంలోని సామాజిక పీడిత వర్గాలకు సహాయ పడేందుకు ప్రభుత్వ నిశ్చయీకరణ చర్యల పట్ల ఒక శత్రుపూరిత వాతావరణాన్ని ఒక క్రమపద్ధతిలో పెంచి పోషిస్తున్నాయి. బీజేపీ పాలనలో బలహీన వర్గాలకు లభించే కొద్దిపాటి ప్రయోజనాలను కాలరాసేందుకు ప్రభుత్వమే ఈ శక్తులతో లాలూచీ పడుతుంది. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వ పనితీరు ఆమోదయోగ్యంగా లేదు. మార్చి 24,2022న పార్లమెంట్‌లో సమర్పించిన సమాచారం ప్రకారం తొమ్మిది మంత్రిత్వ శాఖలు, రైల్వేలు, ఆర్థిక, ఆటమిక్ ఎనర్జీ, రక్షణ, గృహ, హోం శాఖలతో సహా కేంద్ర ప్రభుత్వ శాఖలన్నింటిలో మొత్తం 82,022 ఖాళీలు ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ లకు రిజర్వ్ చేయబడిన పోస్టులున్నాయి. కానీ వాటిలో కేవలం 43శాతం ఖాళీ పోస్టులు మాత్రమే భర్తీ చేశారు.

యూనివర్సిటీలు, ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో పరిస్థితి కూడా చాలా ఘోరంగా ఉంది. ఎస్సీలకు రిజర్వ్ చేయబడిన 42 శాతం ఖాళీ పోస్టులు, ఎస్టీలకు రిజర్వ్ చేయబడిన 39 శాతం, ఓబీసీ లకు రిజర్వ్ చేయబడిన 54 శాతం ఖాళీ పోస్టుల్ని భర్తీ చేయడంలో 45 సెంట్రల్ యూనివర్సిటీలు వైఫల్యం చెందాయి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఎస్సీలకు రిజర్వ్ చేయబడిన 80 శాతం ఖాళీ పోస్టులను ఇంత వరకు భర్తీ చేయకపోవడంతో అది అధ్వాన్నమైన యదార్థ స్థితిగా నిలిచింది. మోడీ నాయకత్వంలో ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ సేవలు, ఉన్నత విద్యలో ప్రయివేటీకరణ వేగవంతం కావడానికి తోడు ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవడంతోపాటు రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కేటాయింపుల గణనీయమైన తగ్గింపు, ఖర్చులలో కోతలు విధించడం ద్వారా వివక్షత కొనసాగింపులో మోడీ ప్రభుత్వమే స్వయంగా తోడుగా నిలిచింది. 2014-15, 2019-20 మధ్య ఆర్థిక సంవత్సరాల్లో

జనాభా దామాషా ఆధారంగా జరిగిన మొత్తం కేటాయింపుల్లో కేవలం 20.8 శాతం మాత్రమే వారి సంక్షేమానికి ఖర్చు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పత్రాలు తెలియజేస్తున్నాయి. ఇది, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయంగా చెల్లించాల్సిన 7.51 లక్షల కోట్ల రూపాయలను నిలిపి వేయడంతో సమానం. దీనితో పాటు 2017-18లో ఎస్సీ సబ్‌ప్లాన్, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను రద్దు చేయడం ద్వారా మోడీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఉద్దేశించబడిన యంత్రాంగాన్ని ధ్వంసం చేసింది.

ఈ మార్పుల ఫలితంగా మోడీ రెండోసారి ప్రధాని పదవి చేపట్టిన 2019-20, 2023-24 మధ్య కాలంలో కేంద్ర, కేంద్ర రంగ ప్రాయోజిత పథకాల కేటాయింపుల మొత్తం నిధుల్లో ఎస్సీలకు కేవలం 10.6 శాతం మాత్రమే కేటాయించారు. కేటాయింపుల్లో కూడా కేవలం 3.3 శాతం మాత్రమే ఎస్సీల పథకాలకు మళ్లించారు. మిగిలినవి సాధారణ పథకాలకు కేటాయించారు. ఎస్టీల కుద్దేశించబడిన కేటాయింపుల్లో కూడా ఇదే వైఖరిని ప్రదర్శించింది. ఎస్టీలకు కేటాయించిన మొత్తం నిధుల్లో కేవలం 2.5 శాతం మాత్రమే లక్ష్య పథకాలకు కేటాయించారు. కేటాయించిన నిధుల్ని కూడా పూర్తి స్థాయిలో వినియోగించలేదు. స్వాతంత్ర్యం సిద్ధించిన ఏడున్నర దశాబ్దాల తర్వాత కూడా దళితుల సాధారణ పరిస్థితి చాలా ఘోరంగా ఉంది. 58 శాతం దళితులకు భూమి లేదు.మోడీ పరిపాలనలో ఆదివాసీలను, దళితులను పెద్దసంఖ్యలో అభివృద్ధి పేరుతో వారి భూముల నుండి బలవంతంగా వెళ్ళగొడుతున్నారు. స్వంత భూములున్న 50 శాతం దళితులకు సాగునీటి సౌకర్యాలు లేవు. సాధారణ జనాభాలో 33.3శాతం జనాభాతో పోల్చినప్పుడు 65.8శాతం దళితులు, 81.4శాతం గిరిజనులు బహు మితీయ (మల్టీ డైమెన్షనల్) పేదరికంలో జీవిస్తున్నారు, ఇది చాలా తీవ్రమైన పరిస్థితి. ఎస్సీలలో అక్షరాస్యతా రేటు కేవలం 66 శాతంగానే ఉండగా, ఎస్టీల్లో అది 59 శాతంకన్నా తక్కువగా ఉంది, అంటే జాతీయ సగటు రేటు 73శాతం కంటే కూడా తక్కువగా ఉంది.అంతే కాకుండా 2022 నాటికి ఎస్సీలలో నిరుద్యోగ రేటు 8.4 శాతంగా చాలా ఎక్కువగా ఉంది.ఎస్సీలలో అసంఘటిత రంగ కార్మికులు చాలా ఎక్కువగా 84శాతంగా ఉన్నారు. ఈ గణాంకాలు మోడీ నాయకత్వంలోని మతతత్వ, కార్పోరేట్ ప్రభుత్వం దళిత వ్యతిరేక, పేద ప్రజల వ్యతిరేక స్వభావాన్ని తెలియజేస్తుంది. మోడీ హిందూత్వ లేక 'సనాతన ధర్మ' భావజాలంలో సామాజిక న్యాయాన్ని వెతకడం అంటే ఎండమావిలో నీటిని వెతకడం లాంటిదే. ❑

# పాత చట్టం.. కొత్త సమస్య

**(24వ పేజీ తరువాయి)**

లౌకిక అనే పదాన్ని తొలగించేస్తామంటున్నారు. పదం ఉన్నా, లేకపోయినా లౌకిక లక్షణాన్ని తీసివేసే అధికారం మాత్రం ఎవరికీ లేదు. సీఏఏ చట్టాన్ని మార్చి 11న అమల్లోకి తీసుకొచ్చారు. వెంటనే ఎన్నోచోట్ల అల్లర్లు జరిగాయి. అనేక చోట్ల సాయుధ బలగాలను రంగంలోకి దింపారు. ఢిల్లీలో పోలీసులతో ఫ్లాగ్‌మార్చ్ జరిపించాల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అసోంతో సహా ఈశాన్య రాష్ట్రాల్లోని మూలవాసులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఎన్నికల ముందు ఇంత కీలకమైన మార్పు చేయడం న్యాయమా? అవసరమా? రాజకీయ ప్రయోజనాల కోసమేనా ఇదంతా? 1950లో జనవరి 26న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగంలో పౌరసత్వ మౌలిక లక్షణాలను పేర్కొన్నారు. వీటి ఆధారంగా 1955లో చట్టాన్ని తీసుకువచ్చారు. దీని ప్రకారం పొరుగు దేశాల నుంచి వలస వచ్చిన వారికి భారత పౌరసత్వం ఇవ్వడానికి వీలు లేదు. మొట్టమొదటి పౌరసత్వ చట్టం (1955) ప్రకారం భారతీయ పౌరసత్వాన్ని అక్రమంగా వచ్చినవారికి ఇవ్వరు. ఒకవేళ పత్రాలు ఉంటే రావచ్చు. వీసా గడువు దాటి పోతే రావడానికి వీలులేదు. వీసా గడువు ఉంటే, ధృవీకరణాలు దొరికితే ముస్లిమేతర శరణార్థులను దేశంలో నివసించడానికి అవకాశం ఇస్తూ మార్పులు చేశారు. ప్రస్తుతం ఏమిటంటే ఎట్టి పరిస్థితుల్లో సీఏఏని వెనక్కి తీసుకోబోమని, కచ్చితంగా అమలు చేస్తామని కేంద్ర హోం మంత్రి పదే పదే స్పష్టంగా చెప్పారు. అయితే మైనారిటీలు, ఇతర వర్గాలు భయప దవలసిన అవసరం లేదని ఒక హామీ మాత్రం ఇచ్చారు. పౌరసత్వాన్ని తీసివేయబో మన్నారు. ఇది నిజమైతే భయపడాల్సిన అవసరం లేదు. భారత పౌరసత్వం అనేది ప్రభుత్వ సార్వభౌమ నిర్ణయం అని కేంద్ర ప్రభుత్వం అంటున్నది. సీఏఏ అమలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుంది. అందులో రాష్ట్రాలకు ఎలాంటి పాత్రా లేదు. నిజాని కి సీఏఏను పోస్టల్ విభాగం ద్వారా అమలుచేస్తారు. కావాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడి పోలీసులు కేంద్రానికి భద్రతపరంగా సహాయం చేయవలసి ఉంటుంది. ఇదొక ప్రమాదకరమైన అధి కారం. ఒకరకంగా అన్ని రాష్ట్రాల అధికారాలను కేంద్రీకరించడా నికి ఈ చట్టం ఉపయోగపడుతుందని అనుమానిస్తున్నారు. అను మానాలను తీర్చకుండా చట్టాలు అమలుచేయడం సాధ్యం కాదు. పౌరసత్వం సక్రమంగా లభిస్తే ప్రమాదం లేదు. గొప్ప విషయమే కూడా. కానీ, దేశం నుంచి బయటికి పంపడానికి ప్రభుత్వాలు పౌరులను పౌరులు కాదనే పరిస్థితి తీసుకువస్తే ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారు? సీఏఏను ఎన్ఆర్సీతో అనుసంధానించి ముస్లింలను మాత్రమే అక్రమ వలసదారులుగా మార్చి వేధిస్తారా? పౌరులు కాదంటూ వారి ఆస్తులను కూడా జప్తు చేస్తారా? ఇవీ కొత్త చట్ట సవరణలపై తలెత్తే అనుమానాలు. ❑

# కులం కూడా ఒక సామాజిక పెట్టుబడే!



- ప్రొఫెసర్.కె.యస్.చలం

**భారతదేశంలోని కులం యూరప్‌లోని వర్గం ఒకటి కాదు. రెండింటి మధ్య వున్న తేడాని గమనించాలంటే కులం శ్రామికుల విభజనగా వుంటూ ఆర్థిక అంశాల ఆధారంగా ఎలా మనగలుగుతుందో తెలుసుకోవాలి (వివరాలు నా కుల ఆధారిత ఉత్పత్తి విధానం చూడగలరు). కులాన్ని అర్థం చేసుకోవటంలో దాని ఆర్థిక అంశాలు యిమిడి వున్నాయి. కులం సామాజిక పెట్టుబడిగా ఎలా మారిందో ఇప్పుడు తెలుసుకుందాం.**

అమెరికాలో జాతికి సంబంధించి అక్కడ ప్రభుత్వం ఆ దేశ చరిత్ర ఆధారంగా రూపొందించిన రిజర్వేషన్ అనే ఎఫర్మేటివ్ యాక్షన్‌పై 2003 జూన్ 23న అమెరికా సుప్రీంకోర్టు ఒక సంచలన తీర్పు ఇచ్చింది. దాని సారాంశం : మిచిగాన్ విశ్వ విద్యాలయ ప్రవేశానికి జాతి అంశాన్ని ఒక అదనపు అర్హతగా పరిగణిస్తూ అమెరికాలో గత కొన్ని దశాబ్దాలుగా అమలులో ఉన్న రిజర్వేషన్ విధానాన్ని సమర్థించింది. ఈ కేసుపై తీర్పు నిచ్చిన జస్టిస్ సాండ్రా ఓ కొనార్, 1978లో విద్యాసంస్థల్లో ప్రవేశానికి నల్లవారికి అనుకూలంగా ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ, ఈ విధానం అమెరికా దేశ నేటి అవసరాల దృష్ట్యా చాలా ముఖ్యమైనది, అవసరమైనదని పేర్కొన్నారు. అక్కడ ప్రజల వైవిధ్యాన్ని (అంటే జాతులు వేరు వేరు అని) అమెరికా అప్పుడు ఎదుర్కొంటున్న సమస్యలకు ఈ 'వైవిధ్యం' ద్వారా పరిష్కారం కనుగొన్నట్టయింది. అయితే అమెరికాలో గత శతాబ్దంగా అమలులో ఉన్న మితవాద ప్రభుత్వ విధానాలు ఒక్కసారిగా వైవిధ్యం పేరిట అందరికీ అవకాశాలు కల్పించేందుకు ఒక కారణం ఉంది. ప్రపంచీకరణ మూలాలు అమెరికా స్థావరంగా నిర్మితమైన ఈ సంస్థల్లో అనేక దేశాలకు చెందిన పెట్టుబడులు తద్వారా ఆ దేశ జాతీయులు వాటా దారులుగా చేరారు. అటు వంటి సంస్థల్లో అందరికీ అవకాశాలు రాకుంటే సమస్యలు ఉత్పన్నమవుతాయి. వీటిని అధిగమించడా నికి గల పరిష్కార మార్గంగా 'వైవిధ్యం' అన్న విధానాన్ని ప్రవేశపెట్టారు. అంటే విధాన నిర్ణయాల్లో అన్ని జాతుల, దేశాల ప్రతినిదులకు అవకాశాలు కల్పించడం ద్వారా అప్పుడున్న విపత్తు నుండి బయటపడ్డారు. అది చూసి ఇదేదో సమానత్వా నికి, సామ్యవాదానికి దగ్గర దారనుకొని కొంతమంది సంబరపడిపోతున్నారు. నిజానికి వైవిధ్యం అన్న తంతు తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని తమకు చరిత్రలో జరిగిన అన్యాయానికి పరిష్కారం కాదని అమెరికాలోని నల్లజాతి మేధావులు వ్యతిరేకిస్తున్నారు. అందుకు ప్రధానంగా రెండు కారణాలు చెబుతున్నారు. వైవిధ్యం అన్న దొడ్డి దారి ద్వారా - గతంలో తెల్లవారి ఎత్తుగడగా అంగీకరించిన 'సమానమే గాని ఎవరికి వారు ప్రత్యేకం అన్న అహంకార పూరిత ఆలోచనను పెంచి పోషించినట్లవుతోంది.

రెండు గతంలోను, వర్తమాన సమాజంలోను నల్లవారికి జరుగుతున్న వివక్ష, అన్యాయాలకు రావలసిన నష్టపరిహారాన్ని, అందుకు ఏర్పరచని రిజర్వేషన్ విధానాన్ని ఈ 'వైవిధ్యం' నీరుగారుస్తుంది. ఈ జాతులకు అమెరికా అందించవలసిన సహాయాన్ని కొనసాగించవలసిన affirmative actionను ఇది కాలరాస్తుంది. అందుకే వైవిధ్యం తాత్కాలిక అవసరమే గాని దీర్ఘకాలిక పరిష్కారం కాదని చెబుతున్నారు. ఇదే విషయాన్ని నేను భోపాల్ డిక్లరేషన్ సందర్భంగా చెబుతూ వస్తున్నాను. అయితే మధ్యప్రదేశ్ ప్రభుత్వం లేక ఇంకే ప్రభుత్వమైనా వైవిధ్యాన్ని ఒక విధానంగా ప్రవేశపెడితే దాన్ని ఉపయోగించుకొని కొంతదూరమైనా దళితులు, వెనుకబడిన వర్గాలు ముందుకు వెళ్లాలి కాని అక్కడే ఆగిపోకూడదు. అమెరికా వంటి దేశంలోనే అన్ని వర్గాలనూ కలుపుకోవాలనే ఆలోచన వస్తున్న సందర్భంలో భారతదేశ ఉన్న (త) కులాల్లోని పేదవారికి రిజర్వేషన్లు కల్పించారు. ఇది ఒక విధంగా రిజర్వేషన్ వర్గాలకు నైతిక విజయమే గాని సమస్యలు వున్నాయి. ఇప్పుడు దళితులు ప్రతిభ ఆధారితంగానే తమ వాటా తమకు కావాలంటున్నారు. ఇది దేశంలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలికే అవకాశం ఉన్నది. అయితే ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పుల్ని, ముఖ్యంగా ఉదార వాదాంతర పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యంలో వస్తున్న తేడాలను గమనించాలి. ప్రజాస్వామ్యానికి పెట్టుబడిదారీ వ్యవస్థకు మధ్య సంబంధాలను అంతరాలను జాగ్రత్తగా అంచనా వేయాలి. అలా చేయకపోతే ఈ దేశంలో కులాధారిత అంతరాలు శాశ్వతంగా నిలదొక్కుకునే ప్రమాదం ఏర్పడనున్నది. ఆర్థికంగా వెనుకబడిన అంటూ ద్విజ, శూద్ర అగ్ర కులాలకు మాత్రమే పరిమితం చేసిన ఆర్థికంగా వెనుకబడిన అన్న కొత్త కథనాన్ని ప్రభుత్వం సృష్టించి 8 లక్షల ఆదాయం వున్నా పేదలనే కొత్త నిర్వచనం ఇచ్చారు. కోర్టు వారివే కాబట్టి సమర్థించింది.

## అంబేద్కర్ వ్యతిరేకం కాదు

ఇప్పుడు దేశంలో చర్చిస్తున్న ఉన్నత వర్గాల రిజర్వేషన్ విషయంలో అంబేద్కర్ ఏం చెప్పారో పరిశీలిస్తే ఆయన ప్రజాస్వామ్య సిద్ధాంతం అందుకు వ్యతిరేకం కాదని తెలుస్తోంది. భారత రాజ్యాంగాన్ని ప్రవేశపెడుతూ అంబేద్కర్ మూడు అంశాలు పేర్కొన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఒక మనిషికి ఒక ఓటు అనే విలువను అందరూ గౌరవించాలి. రెండు – దేశంలో రాజకీయ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలి. మూడు – ఆదర్శప్రాయమైన ఆర్థిక ప్రజాస్వామ్య వ్యవస్థాపనకు అందరికీ అవకాశాలు ఇవ్వాలి. కాబట్టి రిజర్వేషన్ వర్గాలేవీ సూత్రప్రాయంగా అయినా అన్ని కులాలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకించకపోవచ్చు. ఇటీవల కేంద్రమంత్రి అతవాలే ద్వారా ఈ వాదన కేంద్ర ప్రభుత్వం వినిపిస్తోంది. అయితే ఇప్పుడు ఉన్నత కులాల ప్రభుత్వం కాని, ఉన్నత కులాల రాజకీయ పార్టీలు కానీ చెబుతున్న 'ఆర్థికంగా వెనుకబడిన ఉన్న(త) కులాలకు రిజర్వేషన్లు అన్న విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. ఇంత వరకు విశదీకరించలేదు. అక్కడే చిక్కంతా ఉంది. అందుకే దీన్ని వ్యతిరేకించేందుకు ఆస్కారం కూడా ఉంది. 1920 ప్రాంతంలో మద్రాస్ రాష్ట్రంలో జస్టిస్ పార్టీ కుల ఆధారితంగా రిజర్వేషన్ల కోటాలు పెట్టినప్పుడు అనేక అంశాలు చర్చకు వచ్చాయి. అంతకుముందు కొన్ని శతాబ్దాలుగా దిగువ నున్న, సామాజిక స్థాయి లేని కులాల పోరాటాలు, బ్రాహ్మణ, బ్రాహ్మణేతర కులాల మధ్య వివక్ష వంటి సమస్యలకు ఒక పరిష్కారంగా ఈ కోటా విధానాన్ని ప్రవేశపెట్టారు. దీన్ని రాజ్యాంగంలో కొనసాగించడానికి పెరియార్ మళ్లీ ప్రజా ఉద్యమం చేయడం రాజకీయ రిజర్వేషన్లను అంబేద్కర్ రాజ్యాంగంలో పెట్టడానికి మొట్ట మొదటి రాజ్యాంగ సవరణకు పార్లమెంటులో పోరాడారు. అయితే రాజ్యాంగంలో ఆర్థిక వర్గాల గురించి చర్చించలేదు. అందుకే రాజ్యాంగం 103వ సవరణ చేసి వెంట వెంటనే ఆర్థిక వర్గం అమలులోకి తెచ్చారు. ఇందులో అన్ని రాజకీయ పార్టీలకు మన ఆర్థిక విధానాల విషయంలో ఉన్నట్లే ఒక అదృశ్య అంగీకారం ఉన్నది. అందుచేత ఈ చర్చలో మేధావులు అన్ని కులాల వారు పాల్గొనాలి. గాని అలా జరగలేదు. మేధావి కులాలు మాట్లాడలేదు.

## రిజర్వేషన్లు ఎందులో..?

ఆర్థికంగా వెనకబడిన ఉన్న(త) లేక అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు ఇప్పుడు ఎందులో ఇస్తారు ? దళితులు, వెనుకబడిన వర్గాలు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అడుగుతున్నారు. కాబట్టి అగ్రవర్ణాలు రిజర్వేషన్ల కోసం ఉద్యమం చేస్తే – మండల్ 'సమస్యలకు ప్రపంచీకరణ – ప్రైవేటీకరణతో సమాధానం వచ్చినట్లు కుత్సితంగా ఆలోచిస్తే సరిపోదు. అలా ఆలోచించడం ద్వారా, అప్పట్లో ఒక పద్ధతిలో పోతున్న దేశాన్ని, రాజకీయ, ఆర్థిక వ్యవస్థను గందరగోళపరిచారు. మళ్ళీ ఇప్పుడు ఇదో తంతు. అయితే గందరగోళాల మధ్య తమ ఇల్లు చక్కబరుచు కొనే సామర్థ్యం ఉన్నత వర్గాలకు ఉన్నదేమో గాని, నిమ్న వర్గాలు చాలా నష్టపోయే పరిస్థితి ఉన్నది. అందుకే ఈ 'ఆర్థికపదం' వెనుక అర్థాన్ని వెదకాలి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఉన్నాయి. వాటిని జాగ్రత్తగా పరిశీలిస్తే, అవి ఆదాయం ఆధారంగా నిర్ణ యించినవిగా అర్థమవుతుంది. నేడు దేశంలోని పాలన, రాజకీ య వ్యవస్థలో ఆదాయ సర్టిఫికెట్ తేవడం గొప్ప విషయం కాదు. దళితులను వర్గీకరించిన తర్వాత కూడా కొంత కాలం కొన్ని జిల్లాల్లో ఒకే కులం వారు మూడు సర్టిఫికెట్లు తెచ్చుకొన్నారు. కాబట్టి ఆదాయం ఆధారంగా ఉన్న కులాల వారి నుండి ఆర్థికం గా వెనుకబడిన వర్గాలను విడదీయడం కొంత కష్టమవుతోంది.

## ఆదాయం ఒక్కటే ప్రమాణం కాదు

వాటిని ఉపయోగించి ఆర్థికంగా ఒక కులంలోపల వర్గాలను విభజించినప్పుడు, ఒక్క ఆదాయన్నే పరిగణించకూడదు. మన దేశంలో కులం ఒక పెట్టుబడిగా రూపాంతరం చెందిన తర్వాత మొత్తం కులం యొక్క ఆర్థిక ఉనికిని అంచనా వేయవలసి ఉంటుంది. అందులో ఈ రిజర్వేషన్లను కులంతో ముడిపెట్టి ఇవ్వడానికి సన్నాహాలు జరుపుతున్నారు. కాబట్టి కులం – ఆర్థిక పరిస్థితులను అంచనా వేయలేదు. నేటి ఉదారవాద ఆర్థిక విధా నంలో పెట్టుబడికి ప్రధాన అవకాశం ఉన్నది. ఈ రిజర్వేషన్ కూడా మానవ పెట్టుబడి విలువను పెంచడానికే ఇస్తున్నారు కదా ! ఒక్కొక్క కులానికి ఒక విధమైన సామాజిక పెట్టుబడి ఉన్నది. ఆయా కులాల్లో వుండే అంతర్ముఖ విధానాలు, ఆచారా లు, నెట్‌వర్క్ వంటి ఆధారంగా కుల కట్టుబాట్లు అవకాశాలు సంపాదించటం వంటివి సామాజిక పెట్టుబడి కిందే వస్తాయి. ఇటీవల వచ్చిన వైశ్యుల చర్చలో ఈ ఆర్థిక నెట్‌వర్క్, దాని శక్తి గూర్చి చర్చ రాలేదు. దాని ఆర్థిక విలువను వివరించలేదు. సామాజిక సాంస్కృతిక అంశంగా మిగిలిపోయింది చర్చ. ఉదా హరణకు 1991 తర్వాత కొన్ని కులాల వారే దేశంలో వచ్చిన అవకాశాలను ఎక్కువగా ఉపయోగించుకున్నారు.

రాజకీయాలను, సిద్ధాంతాలను బహిరంగంగా ఏం చెప్పినా, దృశ్యా దృశ్యంగా ప్రతి కులం జాతీయస్థాయిలో ఒక యజమానిగా మారి అవకాశాలను ఉయోగించుకొని కొన్నాళ్ళలో కోటీశ్వరులుగా మారిపోయారు. కాని సుమారు 120 మంది ఎంపీలు ఉన్న దళితులు ఏమీ సాధించుకోలేకపోయారు. 50 మంది ఎంపీలు ఉన్న వారు ప్రధానమంత్రులు, ప్రాధాన్యత గల మంత్రులు అయ్యారు. మెజారిటీ లేకపోయినా నిశ్చింతంగా సుస్థిర ప్రభుత్వాలను అందించగలుగుతున్నారు. ఇదెలా

జరుగుతోంది కులాన్ని వనరుగా మార్చుకోబట్టే ! దిగువనున్న కులాల్లో ఇటువంటి వ్యవహారాలు ఉండవు. ఈర్ష్య, అహంకారం, అజ్ఞానంతో అవకాశాలు వస్తే ముక్కచెక్కలవుతారు. అంతర్గతంగా ఏ విధమైన వ్యవస్థాపరమైన నిర్మాణం వారికి ఉండదు. ఎందుకంటే, ఒక సామాజిక పెట్టుబడిగా కులాన్ని కూడా ఎలా పరిగణించాలో అంచనా వేయడానికి. ఇప్పుడు సమాజ శాస్త్రాల్లో సామాజిక పెట్టుబడిని అంచనా వేయడనికి చాలా మదింపు పద్ధతులు వచ్చాయి. వాటిని ఉపయోగించవచ్చు. అలాగే పెట్టుబడి అంటే డబ్బు, ఆస్తుల రూపంలో ఉన్నదే కాదు. మానవ విలువను పెట్టుబడిగా ఆర్థికశాస్త్రంలో పరిగణిస్తున్నారు. దాన్నే మానవ పెట్టుబడి (హ్యూమన్ క్యాపిటల్) అంటున్నారు. దీని ఆధారంగానే మానవాభివృద్ధి నివేదికలు వస్తున్నాయి. అంటే ? మానవ పెట్టుబడి విలువను అంచనా వేయాలంటే ఒక కులంలోని వ్యక్తికి గల విద్య అనుభవం, ఆరోగ్యం, ఆదాయం ఆధారంగా మదింపు చేయవచ్చు. అంటే ఒక్క తలసరి ఆదాయం వల్లే కాక సామాజిక పెట్టుబడి, మానవ పెట్టుబడి, సాధారణ ఆర్థిక పెట్టుబడుల మొత్తాన్ని అంచనా వేయాలి. కులాల వారీగా జాతి సంపదను వివిధ రంగాల్లో వారి అవకాశాలను అంచనా వేయాలి. విద్యాభివృద్ధి సూచికలనాధారంగా వ్యక్తి ఆర్థిక వెసులు బాటుతనాన్ని నిర్ణయించాలి. అప్పుడు వ్యక్తి తాలూకా నిజమైన విలువను ఈ కుల సమాజంలో అంచనా వేయగలం. ఆంధ్రలో దళిత ఆర్థిక పరిస్థితిపై కె.యస్.చలం ఇంగ్లిష్ వ్యాసం తెలుగు అనువాదం కె.జి.సత్యమూర్తి గారి 'అంబేద్కర్ సూర్యుడు' పుస్తకంలో ప్రచురించారు.

## ఉన్న అవకాశాలను నీరుగార్చే ప్రయత్నాలు

మాదిగ కులం ఆధారంగా ఏర్పడిన రిజర్వేషన్లకు ఇది వర్తించదు. ఎందుకంటే అక్కడ సామాజికాంశమే ప్రధాన భూమిక వహిస్తోంది. వివక్షతే ఆధారమవుతోంది. అందుచేత వివక్షకు గురైన కులాలకు రిజర్వేషన్లు ఊతకర్రలు అని అన్నారు. కాని నేటి ఆర్థిక వ్యవస్థలో అందరికీ అన్ని అవకాశాలూ లభిస్తున్నాయి కదా ! మార్కెట్‌కు వివక్షత లేదు కదా – అనే వాదనలున్నాయి. అందుకే కులం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వకూడదు. ప్రతిభ అన్నది అన్నింటికీ అతీతమైనది. దాని ఆధారంగా అవకాశాలు ఇవ్వాలి అని మండల్ వ్యతిరేక ఉద్యమం వచ్చింది. అయితే మనదేశంలో కుల వివక్షత అన్ని రంగాల్లో ఎంత దారుణంగా కొనసాగుతున్నదో అందరికీ తెలుసు. ఆంధ్రప్రదేశ్‌లో చాలా సంస్థలు వాటిపై సర్వేలు జరిపాయి. అంతెందుకు భోజన హోటల్ అని ఎవరైనా ఎక్కడైనా హోటల్ నడపగలరా ? మరి బ్రాహ్మణ, క్షత్రియ, మార్వాడి, ఆంధ్ర భోజన హోటళ్లు చక్కగా నడుస్తున్నాయి. ఇప్పుడు దేశం మొత్తం గుజరాత్, మార్వాడిల హవా నడుస్తోంది గదా! ఈ వివక్షత కొనసాగడమే కాదు, రిజర్వేషన్లు కావాలంటున్న ఉన్నత కులాలు కూడా మేము 'కూటికి పేదలం కాని, కులాలకు కాదు' అనే ఆలోచనను ఆచరణలో కొనసాగిస్తున్నారు. అందుకే దీనికి పరిష్కారం ఆలోచించాలి. ప్రపంచంలో ఇప్పుడు ఉదారవాదాంతర ప్రజాస్వామ్యాలు కొనసాగుతున్నాయి. భారతదేశంలో ఉన్న ప్రజాస్వామ్యం ఎలాంటిదో అనేక విశ్లేషణలున్నాయి. కానీ 1991 తర్వాత ఇది పెట్టుబడి మార్కెట్ ఆధారిత ప్రజాస్వామ్యం అని ఇప్పటికి అందరికీ తేటతెల్లమైంది. మరి ఇటువంటి సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు అవకాశాలు ప్రోత్సాహకాలు ఇవ్వాలంటే ఎటువంటి పద్ధతులు అవలంభించాలి ? అసలు 'రాజ్యం ప్రమేయం చాలా తక్కువగా ఉండాలి అంటూనే అదే రాజ్యం ప్రజలకు రక్షణ కల్పించాలి. అందుకే ఉన్న(త) కులాలకు రిజర్వేషన్లు ఇస్తున్నాం' అంటే దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి ? ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు ఉండకపోయినా శాస్త్రీయమైన, ఆమోద యోగ్యమైన మార్గాలను చూపించవలసిన బాధ్యాత మేధావులు , ప్రజాప్రతినిధులు తదితరులపై ఉన్నది. ఈ సందర్భంగా అమెరికా ఆదర్శం కాకపోయినా – రెండు దేశాల్లో ఉన్న సామాజిక నిర్మాణం. ఇప్పుడు రెండు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల్లో సామీప్యత ఉన్నది కాబట్టి కొన్ని విషయాలు పరిశీలించవచ్చు. అమెరికా దేశంలోని ప్రజాస్వామ్యంలో వ్యక్తికి అంత ప్రాధాన్యత వుందో లేదో తెలియదు కానీ. ఒక వినియోగదారుడిగా మార్కెట్లో అతనికి స్వేచ్ఛ వుందనే నమ్మకాన్ని ఆ వ్యవస్థ కల్పించింది. ఆ దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడడనికి ఆ నమ్మకం చాలా అవసరం. అది మార్కెట్ ఆధారిత ప్రజాస్వామ్య లక్షణం.

## ప్రజాస్వామ్యం వ్యక్తి హక్కుల కోసం

ఆ దేశంలోని ప్రజాస్వామ్యంలో ఇప్పుడు, వ్యక్తిగత ఆస్తి హక్కుల కోసం జరిగే పోరాటం నుంచి ప్రజాస్వామ్య వ్యక్తి హక్కుల కోసం పయనిస్తున్నదని శామ్ బౌల్స్ వంటి ఆర్థిక శాస్త్రవేత్తలు అంటున్నారు. అలా జరగడానికి అక్కడ మార్కెట్ అదృశ్యహస్తంగా పనిచేసి ఆర్థికరంగంలో తన పని తాను చేసుకుపోతున్నది. ఆ మార్కెట్‌కు వచ్చే వస్తువును ఎవరు, ఏ కులం వారు, ఏ జాతివారు ఎక్కడ తయారు చేశారన్న దానితో సంబంధం ఉండదు. అవి ఎంత సమర్థంగా తక్కువ ధరలో తయారు చేశారో – అదే దాని ఉనికిని మార్కెట్‌ను నిర్ణయిస్తుంది. మరి అదే విధానాన్ని ఆదర్శంగా ఈ దేశంలో ప్రవేశపెట్టిన మన పాలకులు అటువంటి గ్యారంటీ ఇవ్వగలరా? ఇది అనుమానమే! ఎందుకంటే ఇక్కడ తయారయ్యే చాలా వస్తువుల్లో వాటి వెనుక కులం ముద్ర ఉన్నది. గతంలో చెప్పినట్లు మాదిగ భోజన హోటల్ పేరు పెట్టినా పెట్టకపోయినా ఎవరూ దాన్ని ఆదరించరు. అమెరికాలోలా ఈ దేశంలో వ్యక్తి ప్రాధాన్యంగా సాగే వ్యవస్థ గురించి ఆలోచించలేదు. మన దేశంలో చెప్పులు, డైనింగ్ టేబుల్, చేపలు, మాంసం వంటి సరుకుల వెనుక కులం

ఉంది. సేవా రంగంలో పౌరోహిత్యం, మరుగుదొడ్లు కడగటం వంటివి ఉన్నాయి. వాటి వెనుక గల కులం అందరికీ తెలుసు. దాని ఆధారంగా వివక్షా ఉంది. దాన్ని తొలగించే ప్రయత్నం చేయలేదు.

**మన దేశంలో కులం విడిగా లేదు :**

ఈ దేశంలో వ్యక్తి కులం విడదీసి లేవు. వ్యక్తి తాలూకు శక్తి కులం మీదే ఆధారపడి వుంటుంది. అది ఓటు హక్కయినా, ఈ సమస్యను ఆర్థిక రంగంలోనూ తయారు చేసే కొన్ని వస్తువులైనా, యంత్ర పరికరాల ఆధారంగా వచ్చిన ఉత్పత్తిలో ఈ వివక్షత లేకపోయినా ప్రాంతాల్లో ఇప్పటికీ వస్తుమార్పిడి వెనుక అదృశ్యహస్తంగా కులం కొనసాగుతూ ఉన్నది. అందుకే ప్రజాస్వామ్యంలో ఉత్పత్తి పంపిణీ, కొనసాగాలంటే ఆర్థిక సామర్థ్యం లోపించకుండా రెండూ ఒకేలా కొనసాగాలంటే ఏం చేయాలి అమెరికా కూడా ఎదుర్కొంది. అందుకే అది ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని రాజకీయ రంగంలోనే కాదు ప్రవేశపెట్టింది. అందుకు అనుగుణంగానే కార్పొరేట్ విధానాన్ని ప్రవేశపెట్టింది. కార్పొరేటీకరణ జరిగిన పెట్టుబడిదారీ విధానంలో వ్యక్తిగత ఆస్తికి అంత ప్రాధాన్యత ఉండదు. అందులో షేర్ హోల్డర్లు ఉంటారు. అందరూ కలిసి నిర్ణయాలు చేస్తారు. ఈ నిర్ణయాలు చేయడానికి ప్రతినిధులుగా షేర్ హోల్డర్లు, డైరెక్టర్లను ఎన్నుకొంటారు. వారే అందరికీ ప్రతినిధులుగా నిర్ణయాలు చేస్తారు. ఇక్కడే వారికి ఇబ్బందులు ఎదురయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో షేర్ హోల్డర్లు ప్రపంచ దేశాలన్నింటి నుంచి రావడం, వారికి కూడా ప్రాతినిధ్యం ఇవ్వవలసి రావడంతో వైవిధ్యం ఒక మార్గంగా ఆలోచించారు. అక్కడ కార్పొరేషన్లే రాజకీయాలను, ఆర్థిక రంగాన్ని నిర్వహిస్తాయన్నది జగమెరిగిన సత్యం. అదే పద్ధతిని భారతదేశం ఆచరించగలదా ! మండల్ రిజర్వేషన్ సందర్భంగా దేశ ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని రిజర్వేషన్ల ద్వారా తగ్గించకూడ దనే వాదన బలంగా అన్ని వర్గాల మేధావులూ ప్రచారం చేశారు. ప్రైవేటైజేషన్ వచ్చాక మొత్తం అవకాశాలను, ఆర్థిక రంగ శిఖరాలను, తమ గుప్పెట్లో కొన్ని కుటుంబాలు, కొన్ని కులాల వారు పెట్టుకున్నాక ప్రతిభ గురించి మాట్లాడక పోగా ఉన్న అవకాశాలను తమకే రిజర్వేషన్ల ద్వారా ఇచ్చేయాలని ఆందోళన చేస్తున్నారు. అందుకు అనువుగా ఏర్పాట్లు జరిగి పోయాయి. ప్రపంచ బ్యాంక్ విధానాలు పేదల మేలుకోసమే అన్నట్టు రాజ్యాంగ 85వ సవరణ కూడా దళితులు కోసమే జరిపి తద్వారా సామర్థ్యం అన్న 335 ఆర్టికల్‌ను నీరుగార్చేందుకు ఆస్కారం ఏర్పడింది. సిద్ధాంతపరంగా ప్రజాస్వామ్య పద్ధతిలో పాల్గొనే నిబంధనలు మాత్రం వుంటాయి. గాని మన మేడి పండు ప్రజాస్వామ్యం లాగానే అందులో కొందరే శాసిస్తారు (ఉదా॥ ఆదాని, అంబాని, టాటా, నారాయణమూర్తి). గత కొన్నేళ్లుగా జరుగుతున్న ఆర్థిక విధానాలు పరిశీలిస్తే కొన్ని కులాలకు అందులో కుటుంబాలకు అనుగుణంగా నిర్ణయాలు జరుగుతున్నాయి. ఇక్కడ మెరిట్‌కు స్థానం లేదు. మేనిపులేషన్. అయితే వారి తరపు మేధావులు ఈ విషయాన్ని చర్చించరు. వారికి మీడియా అండగా వుంటుంది. కుల ఆధారిత క్రోనీ కేపటలిజం లేక ఆశ్రిత పెట్టుబడి దారి విధానంలో పెద్ద కులాలకు మాత్రమే అవకాశాలు పరిమితమైపోయాయి. వీటిపై చర్చ లేదు. రాజ్యాధికారం అంటే అగ్ర వర్ణ ఆధారిత అధికారమే యీ దేశంలో వ్యవస్థలను శాశిస్తుంది.

**గాంధీ, అంబేద్కర్‌ల పూణే ఒడంబడికకు కాలం చెల్లింది**

గతంలో రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న వారు ఇప్పుడు అగ్రకులాలకు రిజర్వేషన్లు కావాలంటున్నారు. తద్వారా 50 శాతానికి మించినా పరవాలేదు. ఉన్న(త) కులాల వారికి రిజర్వేషన్లు ఇవ్వాలంటున్నారు. బహుశా ఇటీవల తీర్పులను బట్టి ఈ అంశాన్ని కోర్టులు సమర్థించాయి. అంటే ఇప్పుడు దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందింది. కాబట్టి ఇటువంటి రిజర్వేషన్ల మూలంగా నష్టం ఉండదు. సమర్థత దెబ్బ తినదు. కులాలను బట్టి వృత్తిని బట్టి ఇచ్చే రిజర్వేషన్ల మూలంగా సామర్థ్యం తగ్గిపోవడమంటూ జరగదు. దేశంలో అక్షరాస్యత పెరిగింది. విద్యా విస్తరణ జరిగింది. అందుకే ప్రతి కులానికీ అవకాశాలు రావాలి. అటువంటప్పుడు ఇప్పుడున్న రిజర్వేషన్లకు కుల ఆధారిత రిజర్వేషన్లని వాటికో లేబిల్ తగిలించడం అవసరమా? అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థలో వచ్చిన ప్రాతినిధ్య ప్రజాస్వామ్య పద్ధతిని రిజర్వేషన్ల విషయంలో అనుసరించడం అవసరం.

**అది సరిపోదు**

"భారతదేశంలో రిప్రజెంటేటివ్ పద్ధతిలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే ప్రతినిధులను వ్యక్తులుగా పంపించితే సరిపోదు. వ్యక్తి చాలా అరుదుగా మనకు ఇక్కడ దర్శనమిస్తాడు. అందుకే ప్రజాస్వామ్యం అంటే ఏ ప్రజలు అన్న సమస్య వస్తుంది. ఇక్కడి ప్రజాస్వామ్యం ప్రముఖ ఆర్థికవేత్త ఘుంపేటర్ చెప్పినట్లు "రాజకీయ నిర్ణయాలు తీసుకోవడానికి ఏర్పడిన సంస్థాగత ఏర్పాటు, ప్రజల లక్ష్యాలను తెలుసుకొని ఆ లక్ష్యాల నెరవేర్చేందుకు ఎన్నికల ద్వారా ప్రజా ప్రతినిధులను సమావేశాలకు పంపి నిర్ణయాలు తీసుకోవడమే ప్రజాస్వామ్యం". ఈ ఆశయం భారతదేశంలో నెరవేరాలంటే ప్రస్తుతం కులం ఆధారంగా ఉన్న సమాజంలోని అందరూ దేశ నిర్మాణంలో పాల్గొనాలి. ఆ పని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రాజకీయంగా నిర్వహిస్తున్న, దాన్ని ఆర్థికరంగంలో ప్రవేశపెట్టినప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. రిజర్వేషన్లు అన్ని కులాలకూ వర్తించినప్పుడు ఇంకా ఆ అంశాన్ని రిజర్వేషన్ అని పిలిచే బదులు ప్రజాస్వామ్య విలువల ఆధారితమైన 'రిప్రజెంటేషన్' ప్రాతినిధ్యం అనడం బావుం

టుంది. అప్పుడు మిగిలిపోయిన ఒకటి రెండు కులాలను ఇందులో చేర్చి అందరికీ సమానావకాశాలు కల్పించే పద్ధతులను ఏర్పాటుచేయాలి. ముఖ్యంగా ఇప్పుడున్న రాజకీయ వ్యవస్థలో అఖిల భారతస్థాయిలోనైనా, ప్రాంతీయంగానైనా కొన్ని మోతుబరి కులాల ఆధీనంలోనే పార్టీలున్నాయి. అందులో కులాలవారీ నాయకత్వంలో ప్రాతినిధ్యం ఇవ్వాలి. గతంలో లోహియా ఈ పనిచేశాడు. ఉత్తర భారతంలో లాలూ ప్రసాద్, ములాయం, శారదాదావ్, దక్షిణలో లంకేశ్, నందనారెడ్డి వంటి వారు తయారయ్యారు.

## సామాజిక న్యాయం అంటే

అలా ప్రాతినిధ్యం యిచ్చే సందర్భంలో ఇప్పుడు కులాల ఆధారంగా ఉన్న సంపదను అవకాశాలను, పెట్టుబడులను, ఉద్యోగాలను, అధికారాలను మొత్తం అంచనా వేయాలి. జాన్రాల్స్ అన్నట్లు సామాజిక న్యాయమనేది సామాజిక వ్యవస్థలో ప్రాథమిక విలువ. ఈ విలువ పెంపొందడానికి ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, అవకాశాలు, సంపద, ఆత్మ గౌరవం అందివ్వాలి. ఇదే సందర్భంలో అమర్త్యసేన్ ఇంకొంచెం ముందుకు వెళ్లి, వ్యక్తుల యోగ్యతలు మాత్రమే వ్యక్తుల సామర్థ్యాల ద్వారా న్యాయాన్ని చేకూర్చలేవని, వివిధ లోపాలతో సతమతమయ్యే వ్యక్తులు కూడా న్యాయం పొందాలంటే వారికి ప్రత్యేక వనరులు అందివ్వడం ద్వారా సామర్థ్యాన్ని పెంచవచ్చునన్నారు. సామాజిక న్యాయం అంటే అదే. దానికి ముందు సమాజమంటే అందరికీ మేలు చేసే కామన్ గుడ్ కోసం ప్రయత్నించే వ్యవస్థ అందులో మనిషే తప్ప కులం వుండదు గదా?

## అది రిప్రజెంటేషన్ అవుతుంది

మన దేశానికి సంబంధించి అవకాశాల గురించి చర్చించినప్పుడు ఇక్కడ కుల ఆధారితంగా ఉన్న సమయంలో అన్ని "కులాలకూ ప్రధానంగా ఎవరికైతే ఇంతకాలం అవకాశాలు నిరాకరించారో వారికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి మిగతా వారికి కూడా వారి వారి జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు కల్పించాలి. అది అప్పుడు రిప్రంజెటేషన్ అవుతుంది. రిజర్వేషన్ అన్న మాటకు మన సమాజంలో న్యూనతా భావం ఉంది. దాని నుంచి బయటపడాలంటే రిప్రజెంటేషన్ "ప్రాతినిధ్యం" కల్పిస్తున్నట్టు పేర్కొనాలి. అమెరికాలో ఇటువంటి అవకాశాలు అందరికీ కల్పిస్తున్నారో లేదో పరిశీలించడనికి 'ఈక్వాలిటీ ఆఫ్ ఆపర్చ్యునిటీ కమిషన్' ఉంది. దాని పని ప్రతి రంగంలోనూ వివిధ జాతుల ప్రజలకు ప్రాతినిధ్యం ఉందా ? లేదా? చూడడం, అందుకు కావలసిన అవకాశాలు కల్పించే విధంగా ఆయా రంగ అధిపతులను అజమాయిషీ చేయడం. అమెరికాలో ప్రభుత్వ రంగంకంటే ప్రైవేట్ రంగమే ఎక్కువగా ఉందన్నది అందరికీ తెలిసిన విషయమే.

**మన దేశంలో కూడా ప్రైవేట్ రంగమే అధికంగా ఆర్థిక లావాదేవీలను కొనసాగిస్తున్నది. అందువల్ల ప్రభుత్వ రంగం కుచించుకుపోతున్నది. ప్రభుత్వ రంగమా ప్రైవేటు రంగమా అన్న వ్యత్యాసం లేకుండా దేశంలో జరిగే ప్రతి ఉత్పత్తి సేవ, పంపిణీ వంటి రంగాలలో జనాభా దామాషా ప్రకారం ప్రతి కులానికీ ప్రాతినిధ్యం ఉండేటట్లు చట్టం చేయాలి. ఆ చట్టాన్ని అతిక్రమించిన వారికి కఠిన శిక్షలు ఉండేలా చూడాలి. అప్పుడు ఉద్యోగ నియామకాలలో మాత్రమే వుండే రిజర్వేషన్ల అవసరం ఉండదు. లేకుంటే ఎగువన ఉన్న అగ్రకులాల వారు, దిగువనున్న దళితులు చేసే రిజర్వేషన్ పోరాటాలకు చరమగీతం పాడేందుకు మళ్లీ ఇంకో ఒడంబడిక జరగాలి.**

పూనా ఒడంబడికలో గాంధీ, అంబేద్కర్ పాల్గొన్నారు. ఈ ఒడంబడిక జరిగి ఎనభై ఏళ్లయింది. దాని కాలం చెల్లిపోయింది. అటువంటి ఒడంబడికకు దేశం ఇప్పుడు సిద్ధంగా ఉందా , లేక రిప్రజెంటేషన్ పద్ధతితో పరిష్కారం కనుగొంటారా అన్న విషయమై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. రిజర్వేషన్ వర్గాల్లో కూడా అంటే మాల, మాదిగ, రెల్లి వంటి కులాల్లో కూడా హెచ్చు తగ్గులున్నాయి. వాటిని ఏ విధంగా సరి చేయాలో 2000లో ఒక కర పత్రంగా 2007లో ఇంగ్లీష్‌లో పుస్తక రూపంలో వచ్చిన నా రచనను కీ.శే.పి.యస్.కృష్ణన్ గారు బి.సి. రిజర్వేషన్‌ల సమర్థింపుకు సుప్రీంకోర్టులో వాడారు. దానిని చూడవచ్చు. మిగతా అల్ప 1 శాతం ప్రజల అమెరికాను ఆదర్శంగా చెప్పే కుహనా మేధావులు తమ మీడియాలో ఎప్పుడూ అక్కడ నల్లవారికి సంఖ్యాకులకు కల్పించిన ప్రత్యేక ప్రోత్సాహకాలు, ఏర్పాట్ల గూర్చి ఎందుకు చెప్పరు. ఇప్పుడు అక్కడ కూడా ఆధీనంలో దేశీయ సంపదంతా పోగయిందని తిరుగుబాట్లు జరుగుతున్నాయి. ఈ దేశంలో బ్రాహ్మణ బనియా మరికొన్ని అగ్రకులాల ఆధిపత్యం లోనే సంపద పోగవుతోంది. అగ్రకులాల్లో ఒకడు పేదవాడుంటే అలజడి చేసి కార్పొరేషన్లు కల్పించుకునే వారు నూటికి 90 మంది పేదలు దళిత సేవక బహుజన కులాల గూర్చి మాట్లాడరెందుకు. సంపద అంతా వారి జనాభా నిష్పత్తి ప్రకారం పెంచి పంచే సామ్యవాదం గూర్చి మాట్లాడరెందుకు ? ఇప్పుడు సమస్య ఉద్యోగాలు, సంపద, రాజకీయ శక్తి వంటి వాటిల్లో తక్కువ జనాభా గలిగిన వారు ఎక్కువ ప్రాతినిధ్యం వహించటం. 85 శాతం గల వారికి 50 శాతం రిజర్వేషన్ పరిమితం చేసి 15 శాతం వారు 50 శాతం రిజర్వేషన్ అనుభవించటం అన్యాయం. 21 శతాబ్దంలో ఎన్ని డొంక తిరుగుడు వివరాలు ఇచ్చినా అది నీతి బాహ్యమైనదే. సమానం అంటే అందరికీ అన్నింటిలో ఉద్యోగాలే కాదు పెట్టుబడితో సహా సమాన ప్రాతినిధ్యం కల్పించటమే ప్రజాస్వామ్య లక్షణం. ❑

# ప్రశ్నించడం నేర్చుకోపోతే పతనం ఖాయం



- కె.రామచంద్రమూర్తి

**రాజ్యం బలమైనది అయినప్పుడు ప్రజలు బలహీనులవుతారు. ప్రజల మీద పెత్తనం చెలాయించడం ద్వారానే రాజ్యం తన బలప్రదర్శన చేస్తుంది. ప్రజాస్వామ్యం వర్థిల్లడం అంటే ప్రజలు బాగుండటం. స్వేచ్ఛగా, ధైర్యంగా, మానవీయ విలువలు పాటిస్తూ అందరూ సంతోషంగా జీవించడం. అంతేగాని భయపడుతూ, ఎందుకొచ్చిన గొడవని తప్పుకుంటూ, బిక్కుబిక్కుమంటూ బతుకులీడ్చడం కాదు. ప్రస్తుతం దేశంలో అధికసంఖ్యాకుల మాట నెగ్గుతోంది.**

టిప్పు సుల్తాన్ వారసులను తరిమి కొట్టడం కూడా కాదు ఏకంగా చంపేయాలని కర్ణాటక మంత్రి బాధ్యతారహితంగా వాగితే అతగాడిని ప్రశ్నించేవారే లేరు. అవును. కర్ణాటకలో బీజేపీ పరిస్థితి బాగా లేదు. ఏదైనా చేసి గెలవాలని బీజేపీ నాయకత్వం ప్రయత్నిస్తున్నది. వారికి తెలిసిన విద్య మతపరమైన ఆవేశకావేశాలను రెచ్చగొట్టడం. ముస్లింలను విమర్శించడం, వారిపైన దాడి చేయడం ద్వారా హిందువులను ఆకట్టుకోవాలని ప్రయత్నం. ఈ ప్రయత్నం ఇంతకాలం ఉత్తరాదిలో జయప్రదంగా సాగింది. ఇక సాగకపోవచ్చునని కొన్ని సూచనలు కనిపిస్తున్నాయి. రాజమోహన్ గాంధీ మహాత్మా గాంధీ మనుమడు. అమెరికా విశ్వ విద్యాలయంలో పాఠాలు చెబుతున్నారు. అప్పుడప్పుడు వ్యాసాలు రాస్తూ ఉంటారు. ఎన్డీ టీవీ వెబ్‌సైట్‌కి ఇటీవల రాసిన ఒక వ్యాసంలో ఆయన మోహన్ దీక్షిత్ అనే మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక యువ న్యాయవాది గురించి ప్రస్తావించారు. అందరూ తెలుసుకోదగిన అంశాలు చెప్పారు. ఇటీవల మోహన్ దీక్షిత్ మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో పర్యటించారు. ఇళ్ళు కూల్చుతున్న బుల్డోజర్లను చూశాడు. తమ ఇళ్ళు నేలమట్టం అవుతుంటే పేద ప్రజలు గుండెలు బాదుకుంటూ విలపించడాన్ని చూసి చలించి పోయాడు. ఆరు లేన్ల రోడ్డు వేయడానికి అడ్డంగా ఉన్న ఇళ్ళను పెరికి పారేస్తున్నారు. ఆ ఇళ్ళలో ఇంత వరకూ నివసిస్తున్న వారికి ప్రత్యామ్నాయం చూపడం లేదు. కొంత గడువు ఇచ్చిన తర్వాత చర్య తీసుకునే మర్యాద లేదు.

అధికారం చేతిలో ఉంది కదా అని బుల్డోజర్ పంపి ఇళ్ళను నేలమట్టం చేయిస్తున్నది ప్రభుత్వం. మోహన్ దీక్షిత్ ఆ రాత్రి ఇళ్ళు కోల్పోయిన వారి దగ్గరికి వెళ్ళాడు. వారి సమాచారం సమస్తం సేకరించాడు. మర్నాడు కోర్టులో కేసు వేశాడు. జబల్‌పూర్ హైకోర్టు బెంచ్ మోహన్ పిటిషన్‌పైన విచారణ జరిపింది. బుల్డోజర్ ప్రయోగాన్ని తక్షణం నిలిపి వేయాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. బుల్డోజర్ ప్రయోగం వల్ల నష్టపోయిన వారికి తక్షణం సహాయం అందించాలని కూడా చెప్పింది. మోహన్ సాహసాన్ని, జాగ్రత్తగా వివరాలు సేకరించి కోర్టులో కేసు వేయడాన్ని భోపాల్ పౌరులు ప్రశంసించారు. అదే మోహన్ హిందీలో తన ఫేస్‌బుక్‌లో పెట్టుకున్న అంశాన్ని రాజ మోహన్ గాంధీ ఇంగ్లీషులోకి అనువదించారు. "కొన్ని రోజుల కిందట నేను (మోహన్ దీక్షిత్) మధ్యప్రదేశ్ లోని గంజ్ బసోడా నుంచి గ్వాలియర్‌కు జీటీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేశాను. రిజర్వేషన్లు లేని కంపార్ట్‌మెంట్ ఎక్కాను. అదే కంపార్ట్ మెంట్‌లో ముగ్గురు వ్యక్తులు కనిపించారు. వారి వేషధారణ ప్రకారం వారు ముస్లింలు అని గ్రహించాను. లలిత్‌పూర్ స్టేషన్‌లో రైలు ఆగినప్పుడు ఇద్దరు పోలీసు జవాన్లు కంపార్ట్‌మెంట్‌లో ప్రవేశించారు. తక్కిన ప్రయాణికులను పట్టించుకోకుండా పోలీసు జవాన్లు ముగ్గురు ముస్లిం ప్రయాణికులను మాత్రమే ప్రశ్నించారు. వారి పేర్లు చెప్పమని అడిగారు. వారిలో ఒకరు తన పేరు చెప్పగానే ఆధార్ కార్డు చూపించమంటూ దబాయించారు. వారిని అనుమానిస్తూ ముగ్గురినీ ప్రశ్నించారు. వారి కళ్ళలో నీళ్లు సుళ్ళు తిరిగాయి. "మతం కారణంగా వారిని అడ్డగోలుగా ప్రశ్నించడం చూసి తట్టుకోలేకపోయాను. నేను నిలబడి చేతులు జోడించి తనను క్షమించవలసిందిగా ముగ్గురు ముస్లింలనూ కోరాను. "మిమ్మల్ని వేధించిన వ్యక్తులు ఏ మతానికి చెందినవారో ఆ మతం తరఫున నేను మీకు క్షమాపణలు చెబుతున్నాను. ఎందుకంటే నేను కూడా ఆ మతానికే చెందిన వాడినే. ఎవరినీ భయపెట్టమని కానీ అడ్డుకోమని కానీ హిందూ మతం నాకు ఎన్నడూ చెప్పలేదు. బాధపడుతున్న వారి వెంటా, పేదవారి వెంటా, పీడనకు గురి అవుతున్నవారి వెంటా నిలబడమని రాముడు నాకు చెప్పాడు. నేను నిర్భయంగా జీవించాలని తులసీ దాస్ రామాయణంలోని రాముడు నాకు చెప్పాడు. రాముడి స్నేహితులు రాజులూ, మహారాజులూ కాదు. ఒక శబరి, ఒక జటాయు, ఒక సుగ్రీవుడు, ఒక విభీషణుడు, కొన్ని కోతులూ, కొన్ని భల్లూకాలూ ఆయన మిత్రులు. "నా మాటలు ఆలకించిన పోలీసు జవాన్లు మెల్లగా తప్పుకొని మరో కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్ళిపోయారు. నాతోపాటు ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు నేను చేసిన పనిని మెచ్చుకున్నారు. గ్వాలియర్ స్టేషన్ వచ్చింది.


నేను లగేజి పట్టుకొని దిగడానికి తయారయ్యాను. ఎప్పుడో విడిపోయిన తమ్ముడు ఆర్తితో ఆలింగనం చేసుకున్నట్టు ముగ్గురు ముస్లింలూ  నన్ను కౌగలించుకొని రైలు దిగారు.”

మోహన్ దీక్షిత్ చేసిన పనులు మనలో అందరూ చేయవచ్చు. తోటి పౌరులు సంతోషిస్తారు. మద్దతు ఇస్తారు. అధికారులు కానీ పోలీసులు కానీ అన్యాయంగా వ్యవహరించడాన్ని, మతపరంగా చర్యలు తీసుకోవడాన్ని సామాన్య ప్రజలు సహించరు. కానీ వారిలో అందరికీ మోహన్ దీక్షిత్‌కి ఉన్న తెగువ ఉండదు. తోటి మనుషులపట్ల ఆత్రుత ఉండదు. కానీ ఎవరైనా నిలబడి అన్యాయాన్ని ప్రశ్నిస్తే సామాన్యులు సంతోషిస్తారు. మద్దతునిస్తారు. అటువంటి అమానవీయ దృశ్యాలు చూసి కూడా మౌనంగా ఉండటం అంటే దౌర్జన్యాన్ని సహించడమే, ప్రోత్స హించడమే. ఈ విషయంలో జబల్పూర్ హైకోర్టు బెంచ్‌లో ఉన్న న్యాయమూర్తులను కూడా ప్రశంసించాలి. పేదలకు అన్యాయం జరుగుతోందనీ, వారిళ్ళను పెరికి పారవేస్తున్నారనీ వారి దృష్టికి మోహన్ దీక్షిత్ తీసుకువెళ్ళిన వెంటనే వారు స్పందించి బుల్డోజర్లను నిలిపివేయించారు. పేదల పక్షాన నిలబడ్డారు.

బాల్య వివాహాల విషయంలో అస్సాం ప్రభుత్వం జబర్దస్తీగా వ్యవహరించినప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు గువాహతి హైకోర్టు న్యాయమూర్తి సుమన్‌శ్యామ్ వెనుకాడలేదు. పాత నేరాలను సైతం ప్రస్తావించి అనేకమందిని ప్రాసిక్యూట్ చేయించాలని అస్సాం ప్రభుత్వం హడావుడి చేయడాన్ని న్యాయమూర్తి అంగీకరించలేదు. 2026 కల్లా బాల్య వివాహాలను పూర్తిగా నిలిపివేయాలని అస్సాం ముఖ్యమంత్రి హిమంతా బిశ్వశర్మ ఒక తీర్మానాన్ని అసెంబ్లీలో ఆమోదింపజేశారు. 2021లో అస్సాం అంతటా కలిపి 155 బాల్యవివాహం కేసులే నమోదైనాయి. శర్మ తీర్మానం చేయించిన తర్వాత రెండు వారాలలోనే మూడు వేల మందిని అస్సాం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో అత్యధికులు ముస్లింలు. వారిలో ఎక్కువ మంది కుటుంబాన్ని ఒంటరిగా పోషించేవాళ్ళు. ముస్లింల పట్ల కఠినవైఖరి ప్రదర్శించే గొప్ప హిందూత్వవాదిగా పేరు తెచ్చుకోవాలని హిమంతా బిశ్వ శర్మ కొన్నేళ్ళుగా విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఈశాన్యంలో పెద్ద నాయకుడిగా ఎదగాలని ఆయన అభిలాష.

ఇండియాలో ఏటా పదిన్నర లక్షల మంది 18 సంవత్సరాల లోపు బాలికలకు పెళ్ళిళ్ళు చేస్తున్నారనీ, ప్రపంచంలో జరుగుతున్న బాల్య వివాహాలలో మూడొంతులు ఇండియాలోనే జరుగుతున్నాయనీ యూనీసెఫ్ సంస్థ వెల్లడించింది. అస్సాంలో జరిగే పెళ్ళిళ్ళలో 31 శాతం వరకూ మైనారిటీ బాలికలకే జరుగుతున్నాయి. ఇండియాలో ఇతర రాష్ట్రాలలోనూ ఇదే పరిస్థితి ఉంది. పోలీసులను ప్రయోగించి, లోగడ బాల్య వివాహాలు చేసిన వారిని కూడా దండించడం కంటే ప్రజలలో అవగాహన పెంచే ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలి. ఒక్క అస్సాంలోనే కాదు దేశంలోని అన్ని రాష్ట్రాలలో కూడా ఇటువంటి బోధన జరగాలి. జస్టిస్ శ్యాం అన్నట్టు బాల్య వివాహాలు అభిలషణీయం కాదు. కానీ ఇప్పుడు అందరినీ జైలులో పెట్టడం మాత్రం పరిష్కారం కాదు. మోహన్ దీక్షిత్ వంటి న్యాయవాదులూ, సుమన్ శ్యాం వంటి న్యాయమూర్తులూ చాలా మంది ఇంకా దేశంలో చురుకుగా ఉన్నారు కనుకనే దేశం ఈ మాత్రం ఉంది. ఇటువంటి వారు ప్రజానీకంలో చాలామందే ఉంటారు.  కానీ తెగింపు లేని కారణంగా మౌనంగా ఉంటారు. ఇటువంటి పరిస్థితుల్లో మౌనం ప్రమాదకరం. మౌనాన్ని ఛేదించాలి. ముస్లింలకైనా, క్రైస్తువుల కైనా, హిందువులకైనా అన్యాయం జరుగుతుంటే ప్రశ్నించాలి. మనకు ఎందుకు వచ్చిన గొడవ అంటూ తప్పుకోవడం పిరికి లక్షణం. నిలబడి ప్రశ్నించి నిలదీసినప్పుడు దౌర్జన్యకారులు వెనకడుగు వేస్తారు. తోటి సమాజం హర్షిస్తుంది. ప్రజాస్వామ్య మనగలుగుతుంది. ప్రభువులు దారికొస్తారు. ❑

# లాల్ సలామ్



**కారల్ మార్క్స్ శత జయంతి (1918) ఆరుద్ర రాసిన కవిత**

శతాబ్దాల పెనుచీకటి
చెండాడే ప్రభాకరుడు
జనస్వామ్య దినకరుడు
ప్రష్యాలో ప్రభవించెను
రష్యాలో ప్రసరించెను
స్వదేశాన వెలికాబడి
విదేశాలలో అలజడి
ప్రతిరోజు ప్రవాసిగా
పరదేశపు నివాసిగా
విశ్వనరుడు బతికినాడు
విశ్వమునే జరిపినాడు.

సమరశీల కార్యవాది
సామ్యవాద ఖడ్గదారి
వర్గతత్వ మెరుకపరిచి
వర్గకలహ బోధచేసి
బూర్జువాల దోపిడీని
నిర్జించే దారిచూపి
ప్రణాళికనే రచించెన్
ప్రభంజనమే రేపించే
ఎందరు కావించలేరు
ఇలలో సిద్ధాంత రచన
అందరికీ సాధ్యపడేనా
ఆశయాల ఆచరణ.

కామ్రేడ్ కారల్ మార్క్స్
కమ్యూనిజ పితామహుడు
నిజం నిజం కమ్యూనిజం
నిలపరా మన ఎర్రధ్వజం
నిజం నిజం కమ్యూనిజం
నిధులన్నీ అవిభాజ్యం
నిజం నిజం కమ్యూనిజం
అజమన్నది ఇక పూజ్యం
లాల్ సలాం కారల్‌మార్క్స్

**సేకరణ : నాయిని నర్సింహులు**

# డిగ్రీలు లేని ప్రిన్సిపాలూ, మరో పరిశోధకుడూ



- డాక్టర్ దేవరాజు మహారాజు

**కనీస విద్యార్హత లేకుండానే అధ్యాపకుడూ, ప్రిన్సిపాలూ కావొచ్చా ? మాస్టర్స్ డిగ్రీ లేకుండానే రీసర్చ్ ప్రారంభించొచ్చా ? - అంటే వీలుకాదు. కానీ, కొందరు ఆ పరిధులు దాటుకుని, దీక్షతో నిరంతర కృషితో వాటిని సాధించగలుగుతారు. ఉదాహరణ ఒకరిద్దరి జీవిత విశేషాలు తెలుసుకుందాం! అసాధ్యాన్ని సుసాధ్యం చేసుకోగల వారు కొందరు ఉంటారని తెలుసుకోగలుగుతాం! స్వశక్తితో మేధావులయిన వారు సామాన్యంగా మనకు ఎక్కడా కనబడరు. ఉన్నా చాలా చాలా అరుదు. అలాంటి అరుదైన జీవితం - వ్యక్తిత్వం గలవాడు మన తెలుగు వారిలోనే ఒకరున్నారు. నాలుగో తరగతితో చదువు ఆపేసి, స్వయం కృషితో ఉన్నత విద్యావంతుడయ్యారు రాంభట్ల కృష్ణమూర్తి. మరొకరు ఐదో తరగతి చదివిన చరిత్రకారుడు మణిమేల శివశంకర్.**









జర్నలిజం స్కూలుకు చాలాకాలం ప్రిన్సిపాల్‌గా కొనసాగిన కృష్ణమూర్తి (24.3.1920-7.12.2001) 24 మార్చి 2020కి ఆయన శత జయంతి పూర్తయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రముఖ జర్నలిస్ట్‌లకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా గురువు-లేదా గురుతుల్యులు! ప్రగతిశీల సాహిత్యోద్యమ పునాది నిర్మాణానికి ఆయన ఒక్కొక్క రాయి పేర్చిన అభ్యుదయ కాముకుడు. తూర్పు గోదావరి జిల్లా అమలాపురం తాలూకా అనాతవరం గ్రామంలో జన్మించిన రాంభట్ల స్వయంగా ఇంగ్లీషు, ఉర్దూ, తెలుగు, సంస్కృత భాషలు నేర్చుకున్నారు. ఆయా భాషల్లోని అనేకానేక గ్రంథాలు అధ్యయనం చేశారు. ముఖ్యంగా ఒక వైపు సంప్రదాయ గ్రంథాల మీద, మరోవైపు ఆధునిక సాహిత్య ధోరణుల మీద సమానంగా పట్టు సాధించారు. చిన్న చిన్న పనులు చేస్తూ, స్వంత వ్యాపారాలు ప్రారంభించి ధనవంతులైన వారిని మనం చాలా మందిని చూడగలం. కానీ, స్వయం కృషితో ఇంత పెద్ద ఎత్తున విద్యాధనమార్జించిన పండితుల్ని చూడలేం. వేదాల్ని, ఉపనిషత్తుల్ని, దర్శనాల్ని క్షుణ్ణంగా చదివి, వాటి ప్రభావంలో పడి, ఒక ఛాందసవాదిగా మారిపోకుండా నిలదొక్కుకుని, అభ్యుదయ వాదిగా నిలబడగలగడం చాలా గొప్ప విషయం. 1943లో హైదరాబాదులోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయానికి కార్యదర్శి అయి, అదే సమయంలో ఒక ఐదేళ్ళపాటు 'మీజాన్' పత్రికలో పనిచేశారు రాంభట్ల! 1946లో తొలితరం జర్నలిస్ట్‌ల జీతాల పెంపుకోసం సంఘర్షించారు. 1948లో మద్రాసులోను, విజయవాడలోనూ పలు పత్రికల్లో పనిచేశారు. 1952లో విశాలాంధ్ర పత్రికకు సబ్ ఎడిటర్ అయ్యారు. ఆ రోజుల్లోనే కార్టూన్లు వేయడం, కార్టూన్ కవితలు రాయడం ప్రారంభించారు. తెలుగు జర్నలిజంలో అవే తొలిప్రయత్నాలు.

కవి రాక్షస, అగ్నిమిత్ర, కృష్ణ - పేర్లతో ఆ రోజుల్లో కనిపించిన రచనలన్నీ రాంభట్ల కృష్ణమూర్తివే!! అవన్నీ ఆయన కలం పేర్లు. జర్నలిస్ట్ గనక పత్రికలకు రాయడం మామూలుగా జరిగేదే. కానీ, అంతకు మించి అనేక విషయాల మీద ఆయన ఎన్నో గ్రంథాలు ప్రకటించారు. జనకథ, వేల్పుల కథ, సొంత కథ, శశవిషానం, పాదుటాకులు వంటి గ్రంథాలు చాలా ప్రకటించారు. ఉరుదూ కవి ముగ్దుమ్ మొహియుద్దీన్ కవిత్వానికి ఆకర్షితులై ఆయన కవిత్వాన్ని తెలుగులోకి అనువదించారు. అలాగే కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ సాంగ్‌ను అదే బాణీలో, పాడుకోవడానికి అనువుగా అనువదించారు. ఇవన్నీ చేస్తూనే మరో వైపు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘానికి మార్గదర్శిగా నిలిచారు. 1973 గుంటూరులో 1977 హైదరాబాదులో

జరిగిన అరసం రాష్ట్ర మహాసభల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక య్యారు. నాటి యువతీ యువకుల మెదళ్ళలో అభ్యుదయ బీజాలు నాటి, వారిని రచనా రంగంవైపు నడిపించారు. ఆయన పరిశీలనల్లో, పరిశోధనల్లో ఎప్పుడూ కొత్త చూపు ఉండేది. కొత్త దారులు వేయడంలో ఆయనకు ఆయనే సాటి. చేసే కృషి ఏ రంగంలోదైనా, అన్నింటా మార్క్సిస్టు దృష్టికోణాన్ని నిలుపుకో వడం ఆయన ప్రత్యేకత! ఈ విషయాలన్నిటినీ పొందుపరిచి 'దారిదీపం' మాసపత్రిక సంపాదకులు డి.వి.వి.ఎస్ వర్మ–రాంభట్ల కృష్ణమూర్తి శతజయంతి విశేష సంచికను వెలువరించారు. దానికి అర్వీ రామారావు గౌరవ సంపాదకులుగా వ్యవహరించారు. తొలితరం జర్నలిస్ట్‌గా, తొలి కార్టూనిస్ట్‌గా, మార్క్సిస్టు మేధావిగా గుర్తింపబడ్డ రాంభట్ల ఏం రాశారో నని ఆయన రచనలు జాగ్రత్తగా పరశీలించాను. అప్పుడు తెలిసింది ఆయన నిజంగానే విషయ పరిజ్ఞానం గలవారని!

**వేదాలు సృష్టి మొదలైనప్పుడే ఉన్నాయని, ఆ భగవంతుడే స్వయంగా మానవుడికి అందించాడని 'ఊదరగొట్టే వారికి రాంభట్ల వాక్యాలు కొన్ని చూపించదలిచాను. ఆయన ఇలా రాశారు' – 'మన వేద సమాజంలో జర్మన్ సమాజం ఛాయలు గోచరిస్తున్నాయని, వేదకాలం కన్నా ముందే ఈ దేశంలో వర్ధిల్లిన హరప్పా మొహంజాదారో సమాజాల్లో ప్రాచ్య సమాజ లక్షణాలు పుష్కలంగా కనిపిస్తున్నాయని–' జనకథలో ఒక చోట చెప్పారు. ఇది ఆధునిక పరిశోధనలు ధృవపరిచిన విషయాల్ని రాంభట్ల కృష్ణమూర్తి ఆ రోజుల్లోనే గ్రహించగలిగారు.**

ఇంకా ఇలా రాశారు 'మొహంజోదారో సమాజ సంస్కృతుల ప్రభావం వేదాల మీద పడినట్లు వేదాల్లోనే యెన్నో ఆధారాలు కనిపిస్తాయి. ఇప్పుడు రామాయణం చదువుతూ ఉంటే– మెసపటేమియా మొహంజోదారో సమాజం ప్రభావం రామాయణంలో చాలా కనిపిస్తుంది. జుడిషియల్ బ్లయిండ్‌నెస్ తొలగిపోయిన తర్వాత మన సమాజం కొత్త కాంతులతో కొత్త తేజస్సుతో కనిపిస్తోంది. అందుచేత మార్క్సిజం వెలుగులో మన చరిత్రను తిరిగిచూద్దాం. మన సమాజాన్ని తిరిగి అర్థం చేసుకుందాం. మన కూకటి వేళ్ళను – రూట్స్‌ను–తిరిగి పట్టుకుందాం!" –ఇది రాంభట్ల కృష్ణమూర్తి భావితరాలకు ఇచ్చిన సందేశంగా మనం పరిగణించాల్సి ఉంటుంది.!

**అలాగే, విద్యార్హతలు లేని మరో పరిశోధకుడు ఇప్పుడు మన ఎదుటే ఉన్నాడు. ఆయన పేరు శివశంకర్. వృత్తి రీత్యా ముఠా కూలీ అయిన ఒక వ్యక్తి, ప్రవృత్తి రీత్యా చరిత్ర అన్వేషణకు పూనుకున్నాడు. గుంటూరు జిల్లాలో ఐదు వందల అదృశ్య గ్రామాలను గుర్తించి, వాటి గురించిన సమాచారం గ్రంథస్తం చేశారు. మణిమేల శివశంకర్ అతి సాధారణ ముఠా కార్మికుడు.**

లారీ రాగానే బస్తాలు దించడం, లేదా ఎక్కించడం అతని పని. అదే జీవన భృతి. అయినా, అతని మనసు మరొక విషయం కోసం తపిస్తూ ఉంటుంది. తీరిక దొరికినప్పుడల్లా లేదా తీరిక చేసుకున్నప్పుడల్లా అతను శాసనాలు వెతుకుతుంటాడు. వాటి సారాన్ని క్రోడీకరిస్తూ ఉంటాడు. ఆ విధంగా ఇప్పటికి ఎన్నో అదృశ్య గ్రామాల చరిత్రను వెలికితీశాడు. ఇంకా తీస్తూనే ఉన్నాడు. అతను ఉన్నత చదువులు చదివినవాడు కాదు. ఏ విశ్వ విద్యాలయం నుండి ఏ డిగ్రీ తీసుకున్న వాడు కూడా కాదు. అతి కష్టం మీద అయిదో తరగతి మాత్రం చదివిన వాడు. అయితేనేం? అతను తెలుగు చరిత్ర పరిశోధకుల జాబితాలో చేరిపోయాడు. నిరుపేద కుటుంబంలో పుట్టిన మణిమేల శివశంకర్‌కు చదువుకునే అవకాశం రాలేదు. జీవనోపాధి కోసం తప్పని సరైన పరిస్థితుల్లో ముఠా కార్మికుడిగా మారాల్సి వచ్చింది. అతని స్వగ్రామం పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామం. ఉన్న ఊళ్లో బతుకు దెరువు లేక జిల్లా కేంద్రం గుంటూరుకు వెళ్ళి అక్కడ స్థిరపడాల్సి వచ్చింది. బాల్యంలో శివశంకర్‌ను పెద్దవాళ్లు ఆలయాలకు తీసుకు వెళ్లినపుడు, ఆ బాలుడి దృష్టి దైవ విగ్రహం మీద ఉండేది కాదు. చుట్టు పక్కల వాతావరణం మీద, శిల్పాల మీద ఎక్కువ శ్రద్ధ పెట్టేవాడు. అలాడే అక్కడి స్థానికులను అడిగి స్థల విశేషాలు ఆసక్తిగా తెలు సుకుంటూ ఉండేవాడు. దగ్గరలో ఏవైనా శాసనాలు కనబడితే వాటిని మెల్లమెల్లగా చదవడానికి ప్రయత్నించేవాడు. క్రమంగా అది అతని ప్రవృత్తిగా మారింది. వయసు పెరిగినా కొద్దీ బాధ్యత మీద పడుతుంది గనక ప్రవృత్తి తిండి పెట్టదు గనక, చదువు పెద్దగా లేదు గనక–మరో మార్గం లేక ముఠా కార్మికుడిగా జీవనోపాధి చూసుకున్నాడు. అయితే వృత్తి ధర్మం పూర్తికాగానే ఇంటికి వెళ్ళి విశ్రాంతి తీసుకోకుండా శాసనాల వెంటపడేవాడు.

పరిశోధన మీద ఆసక్తి పెరుగుతూ ఉండడంతో ఆర్కియాలజీ విభాగం అందుబాటులోకి తెచ్చిన శాసనాలు అధ్యయనం చేయడం ప్రారంభించాడు. పురాతన తెలుగు శాసనాలు చదవడంలో క్రమంగా పట్టు సాధించాడు. సంస్కృత శాసనాలు చదవడానికి, అర్థం చేసుకోవడానికి ఇతర పెద్దలపై ఆధారపడేవాడు.

**(మిగతా 42వ పేజీలో)**


# పురాతన సమాజం

## హెన్రీ మోర్గన్ పుస్తక పరిచయం

- శిరంశెట్టి కాంతారావు



'అగాధమౌ జలనిధిలోనా ఆణిముత్యమున్నటులే..' 'శోధించి సాధించుటయే ధీరగుణం' అన్న సూక్తిని ఓ సినీ కవి గేయ రూపంలో చెప్పిన దానికి అనుగుణంగా ఈ "పురాతన సమాజం" గ్రంథ రచయిత 'లూయిస్ హెన్రీ మోర్గన్' ప్రపంచ సామాజిక వికాస పరిణామ క్రమాన్ని కాలం పొరల్ని తొల్చు కుంటూ లోలోతుల్లోకి వెళ్ళి పరిశోధించి ప్రపంచ మానవాళికి అందించాడు. ఈ పుస్తకం ఉబుసుపోక చదువుకునే పుస్తకం కాదు. కష్టపడి అధ్యయనం చేయవలసిన ఓ విజ్ఞానఖని లాంటి ది. ఇప్పుడు మనం నాగరిక సమాజంగా భావిస్తున్న ఈ సమాజ అభివృద్ధి క్రమాన్ని మానవుడు ఏ విధంగా సాధించుకున్నాడో వివరిస్తుంది. అమెరికా దేశస్థుడైన మోర్గన్ ఈ గ్రంథాన్ని 1877లో 'ది ఏన్షెంట్ సొసైటీ' పేరుతో వ్రాశాడు. పుస్తకంలో 'ఈ విశ్వమొక కుటుంబం. మన పూర్వీకులు ఒక్కరే. మాన వులంతా ఒకటే. ప్రపంచమంతటా వారి పురోగతి కూడా ముందు వెనుకగా ఒకే విధంగా సాగింది' అన్న విషయాన్ని ఎంతో సాధికారికంగా నిరూపించాడు మోర్గన్. ఈ పుస్తకం ఇచ్చిన ఆధారంతో మార్క్స్, ఏంగెల్సులు తమ భావి రచనల కోసం 'నోట్స్' తయారు చేసుకున్నారు. ఈ విషయాన్ని బట్టే ఈ పుస్తకం ఎంతటి స్థాయి గల పుస్తకమో అర్థమౌతుంది. డార్విన్, మార్క్స్, ఏంగెల్స్, మోర్గన్ ఈ నలుగురూ సమకాలీనులు కావడం, ఒకరి అభిప్రాయా లను ఒకరు పంచుకోవడం చరిత్రలో ఒక గొప్పసంఘటనగా చెప్పుకోవచ్చు.




**పేజీలు : 384 - వెల : 300/-**

**ప్రాప్తి స్థానం : విశాలాంధ్ర బుక్ హౌస్.**

- **డార్విన్ :** ఇంగ్లాండ్ దేశస్తుడు. 1809–1882. వ్రాసిన పుస్తకం : జీవపరిణామ క్రమ సిద్ధాంతం.
- **మార్క్స్ :** జర్మన్ దేశస్తుడు. 1818 –1883. కమ్యూనిస్ట్ మానిఫెస్టో/అదనపు విలువ.
- **ఫ్రెడరిక్ ఏంగెల్సు:** జర్మన్ దేశస్తుడు. 1820 – 1895. కుటుంబము-స్వంత ఆస్తి – రాజ్యముల ఆవిర్భావం.

మోర్గన్ ఈ 'పురాతన సమాజం' వ్రాయడానికి స్ఫూర్తినిచ్చిన సంఘటన గురించి చెప్పుకోవాలంటే. మోర్గన్ ప్రధానంగా న్యాయవాది. ఒక సందర్భంలో తన (అమెరికా) దేశంలోని రెడ్ ఇండియన్స్ అనే ఆదివాసి తెగలవారు. బహు పేదవారు. వారిది దయనీయస్థితి. ఒక సంధర్భంలో వారి భూములను శ్వేతవర్ణ భూస్వాములు అక్రమంగా ఆక్రమించుకున్నారు. ఆ సమయంలో మోర్గన్ వారి పక్షాన వాదించి వారి భూములను తిరిగి వారికి ఇప్పించాడు. ఆ ఘటనతో రెడ్ ఇండియన్స్ మోర్గన్ని తమపాలిటీ దేవుడిగా భావించి తమలో ఒకడిగా కలుపుకున్నారు. తమ వాడిగా దత్తత చేసుకున్నారు. ఇటువంటి ఘట్టాన్ని ప్రపంచ చరిత్రలో మరెక్కడా చూడలేము. ఆయన 40 ఏళ్లపాటు ఆ రెడ్ ఇండియన్స్‌తోనే కలిసి జీవిస్తూ వారిలో గల అన్నీ జాతుల మీద పరిశోధనలు చేసి, సేకరించిన సమాచారాన్నంతా ఈ గ్రంథంలో పొందుపరిచారు. ఇందులో ప్రధానంగా ప్రపంచంలోని అన్ని ఖండాలలో మానవజాతి ఆటవిక, అనాగరిక, నాగరిక దశల ద్వారా ఎట్లా క్రమ వికాసాన్ని పొందిందో విపులమైన సాక్ష్యా ధారాలతో పనిముట్లు, నిప్పు, వేట, పశుపాలన, వ్యవసాయం, గ్రామ, పట్టణ నివాసాల ఆధారం గా, అలవర్చుకున్న ఆచారాల ద్వారాను వారి సాంఘిక, రాజకీయ వికాసం ఎట్లా జరిగిందో అద్దం పట్టి చూపించారు. ఈ గ్రంథం 1870 లో మొదటిసారి వెలువరించారు.

మోర్గన్ మానవ కోటికి ఎనలేని జ్ఞాన సంపదను ఈ గ్రంథం ద్వారా అందించాడు. మోర్గన్ యొక్క ప్రత్యేక విశిష్టత ఏమిటంటే, రచనాత్మకమైన చరిత్ర లేని కాలంలోని మానవ సమాజ పునాదులను పరిశీలించడం. మానవ జాతి యొక్క ప్రధానములైన నీతి నియమాలు ఆటవిక యుగంలోనే వచ్చేయి. అనాగరిక యుగంలో వర్థిల్లాయి. నాగరిక యుగంలో పక్వ మయ్యాయి. శిలాజాలు నేలలో కప్పబడి వుండి భవిష్యత్తు పరి శోధకునికి దొరుకుతాయి. కానీ, కళలు, భాషలు, నీతి నియమ వ్యవస్థలు అలా వుండిపోవు. అవి మూడు శతాబ్దాలకంటే మించి బ్రతకవు. అందుకే కొద్దిపాటి శ్రమతో సంపాదించగల సమాచా రాన్ని వెంటనే సేకరించి పెట్టుకోవాలి. కొన్నేళ్లుపోతే మరి దొర కదు. అందుకే సామాజిక వేత్తలు ఈ రంగంలో శ్రమించి సమా చారాన్ని సేకరించి పెట్టాల్సివుంది. నాగరిక దశ నుంచి మాన వుడు జీవితం ఆరంభించిన ఆదిమ కాలం వరకూ వరస క్రమం లో ఒక్కొక్క దశలో **(మిగతా 37వ పేజీలో)**

# 'గోరఖ్‌పూర్' విషాదానికి అక్షర సాక్ష్యం!?


## డా॥ కఫీల్‌ఖాన్ పుస్తకానికి పరిచయం

- వి.విజయ్‌కుమార్



**వ్యవస్థలు వ్యక్తుల మీద పగ పడతాయా? ప్రజాస్వామ్యంలో ప్రజలంతా సమానమనే భావనా, ప్రజల చేత, ప్రజల కొరకు పాలించే ఆ వ్యవస్థలో న్యాయం అందరికీ సమానంగానే వర్తిస్తుం దనీ, చట్టం ముందు అందరూ సమానులేననీ తరచూ వింటూ ఉంటాం. చాలా సందర్భాల్లో ఇవి రాసుకున్న ఆదర్శాలు మాత్ర మేనన్న విషయం బోధపడుతూ ఉంటుంది. డాక్టర్ కఫీల్ ఖాన్ స్వయంగా రాసిన 'గోరఖ్పూర్ ఆసుపత్రి విషాదం' పుస్తకం తెలుగులో వచ్చింది. ఇది చదివితే ఈ వ్యవస్థల డొల్లతనం, కుట్ర కోణం మనకు అర్థమవుతాయి.**

2017 ఆగస్టులో ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే బాబా రాఘవదాస్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో అలక్ష్యం కారణంగా ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి 60 మంది శిశువులు మరణించటంలోని వ్యవస్థ నిర్వాకాన్ని ఇది ప్రశ్నిస్తుంది. దోషులంతా బయట తిరుగుతుంటే, పసి బిడ్డల ప్రాణాలను కాపాడటానికి తన వంతు కర్తవ్యంగా చేయగలిగిందంతా చేసిన డాక్టర్ కఫీల్‌ఖాన్ ఎందుకు నిర్దాక్షిణ్యంగా శిక్షకు గురై సర్వం కోల్పోయి, నిస్సహాయంగా న్యాయం కోసం రోడ్డున పడాల్సిన పరిస్థితుల వెనక జరిగిన ఘోరాన్ని కళ్ళకు కడుతుంది. ఏఈఎస్ అనే మెదడు వాపు వ్యాధి 1978 తర్వాత 25 వేల మంది ప్రాణాలు తీసుకోవడం తోపాటు లక్ష మందిని శాశ్వత అంగ వికలురుగా చేసింది. పేదరికం, సురక్షితమైన మంచినీటి సౌకర్యం, పోషణ లోపాలు, అపరిశుభ్రత, టీకా వేసుకోక పోవడం వల్ల వచ్చే ఈ వ్యాధిని కొంచెం చిత్తశుద్ధితో పనిచేస్తూ, టీకా డ్రైవ్‌ను నిర్వర్తిస్తే ఏటా లక్షలాది పసిబిడ్డల ప్రాణాలు కాపాడబడతాయి. కానీ, ప్రతి ఏటా ఆగస్టులో పసిబిడ్డలు చచ్చిపోతుంటారు. వారికి ఆక్సిజన్ అవసరమవు తూ ఉంటుంది. ఆక్సిజన్ సరఫరాదారులతో కుమ్మక్కై ఆక్సిజన్ ప్లాంటేషన్స్‌ను వ్యాపారస్థాయికి దిగజార్చి, ప్రాణాలు పోయడానికి బదులు, పసి బిడ్డల ప్రాణాల్ని ఫణంగా ఎందుకు పెట్టారో తెలియాలంటే ఈ పుస్తకం చదివి తీరాలి. ఒక వ్యక్తి ఒక వ్యవస్థను ఢీకొనడం అనేది సామాన్యమైన విషయం కాదు. వ్యవస్థకు ఎదురు నిలబడితే సహించే పరిస్థితి




ఉండదు. దీనికి మతం రంగు తోడైతే అదెంత ఘోరంగా ఉంటుందో డాక్టర్ కఫీల్ ఖాన్ పుస్తకం చూపిస్తుంది. డాక్టర్ కఫీల్‌ఖాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తారు.

ఆగస్టు 10 అర్ధరాత్రి రోజు ఆయన ఒక ఫోన్ రిసీవ్ చేసుకుం టారు. ఆసుపత్రిలో ఆక్సిజన్ సరఫరా అయిపోయిందని, పిల్లల వార్డులో అప్పటికే ఆక్సిజన్ మీద వైద్యం జరుగుతున్న వారు చాలామంది ఉన్నారు. ఒక్కసారిగా గుండె గుభిల్లుమంటుంది. వెంటనే ఆసుపత్రికి వెళ్లి ఏం చేయాలో తోచక పైఅధికారులకు ఫోన్ చేస్తే, ఎవరూ సరిగ్గా సమాధానం ఇవ్వక జూనియర్ డాక్టర్లతో, ఇతర సిబ్బంది సాయంతో 500 సిలిండర్లను పోగు చేసి బిడ్డల ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేస్తారు. అయినా కూడా ఆ రోజు 60 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోతారు. అసలెందుకీ కొరత ఏర్పడింది ? అలక్ష్యం ఎక్కడ జరిగింది?

**(మిగతా 42వ పేజీలో)**

# ప్రజాతంత్ర భారత ప్రవక్త బాబా సాహెబ్ అంబేద్కర్

- కొండూరి వీరయ్య



**ఈ సంవత్సరం బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఓ ప్రత్యేక పరిస్థితుల్లో జరుపుకుంటున్నాం. స్వాతంత్ర్య పోరాట మలి దశ చరిత్ర, ప్రత్యేకించి రాజ్యాంగ పరిషత్ చర్చల గురించిన తాజా అధ్యయనాలు ఆధునిక భారతీయత నిర్మాణంలో బాబా సాహెబ్ అంబేద్కర్ పాత్రను మళ్లీ మదింపు చేయాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నాయి. అంబేద్కర్ గురించి అనేక వ్యాఖ్యానాలు, పరిచయాలు, ఉటంకింపులూ ఉన్నాయి.**



ప్రధానంగా అణగారిన తరగతులు, ప్రత్యేకించి దళితులు అందునా ఈ మధ్య కాలంలో ఎదిగి వచ్చిన దళిత మధ్యతరగతి అంబేద్కర్‌ను తమ ప్రతినిధిగా చూసుకుని మురిసిపోతోంది. తప్పేమీ కాదు. సమాజంలో పైకెదగాలని ప్రయత్నించే ఏ వర్గమైనా, తరగతి అయినా తమ దారి సులభతరం చేయటానికి కృషి చేసిన ముందు తరాల వారిని ఆత్మాభిమాన చిహ్నాలుగా ప్రదర్శించుకోవటం, 21వ శతాబ్దిలో అస్తిత్వ ఉద్యమాల మౌలిక లక్షణం. కానీ అంబేద్కర్ గురించిన ఈ రకమైన చిత్రీకరణ, చిహ్నీకరణ నిజానికి అంబేద్కర్ సాగించిన విశాలమైన కృషినీ ఆయన వ్యక్తిత్వాన్నీ మసకబారుస్తుందని చెప్పకతప్పదు.

నేటి భారతం ఓ చారిత్రక సంధ్య ముంగిట్లో ఉన్నది. ఈ సంధ్య రేపటి పొద్దుకు వెదజిమ్మాల్సిన వెలుగు రేఖలు పోగేసు కుంటుందా లేక సుదీర్ఘమైన చీకటి రాత్రులను దేశం ముందు పరుస్తుందా అన్న సందేహం అందరి మెదళ్లల్లో మొగ్గెత్తుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో అంబేద్కర్ జయంతి జరుపుకోవటం అంటే ఆయన గురించి, ఆయన కృషి గురించీ ఉన్న సాంప్రదా యక అవగాహన నుండి వైదొలగి, వర్తమాన పరిణామాల నేపథ్యంలో ఆయన కృషిని పున:సమీక్షించుకోవాల్సి వస్తోంది.

ఆధునిక ప్రజాతంత్ర భారత నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర అద్వితీయం. అల్పసంఖ్యాక వర్గాల హక్కుల కోసం రాజ్యాంగ పరిషత్ వేదికగా ఆయన సాగించిన పోరాటం అసామాన్యమై నది. రాజ్యాంగం గురించి మాట్లాడుకునేటప్పుడు పీఠిక గురించి చెప్పుకోకుండా ఉండలేం. 81 పదాల సముదాయమైన రాజ్యాంగ పీఠిక దాన్ని ఆమోదించుకునే నాటికి ప్రపంచంలోని అత్యుత్తమైన మానవ విలువలు, ప్రజాతంత్ర హక్కులు, అవకా శాలను ఉల్లేఖిస్తోంది. రాజ్యాంగ నిర్మాతగా అంబేద్కర్ గురించి కొనియాడటం కొత్తేమీ కాదు. ఆయన ముసాయిదా రాజ్యాంగం రూపొందించిన రాజ్యాంగ పరిషత్ కమిటీకి అధ్యక్షుడుగా ఉన్నాడనీ, రాజ్యాంగాన్ని అక్షరబద్ధం చేసిన బృందానికి ఆయన నాయకుడనీ మనందరికీ తెలుసు. ఈ క్రమంలోనే అంబేద్కర్ కారణంగానే నేడు భారతదేశంలో అమలు జరిగే రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత దక్కిందన్నది కూడా వాస్తవం. కానీ అంబేద్కర్ నిజమైన ప్రతిభను అర్థం చేసుకోవాలంటే కేవలం రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించటం వరకే చూస్తే సరిపోదు. భారత రాజ్యాంగాన్ని ఎవరు ఎందుకు చదువుతున్నారు అన్న దాన్ని బట్టి రాజ్యాంగం ఆయావర్గాలకు, తరగతులకు ఆ విధంగా దర్శనమిస్తోంది. రాజ్యాంగాన్ని పాలకవర్గం తన కళ్లద్దాల నుండి చూస్తే పక్కా బూర్జువా వ్యవస్థ మనుగడకు కావల్సిన వ్యక్తిగత ఆస్థిహక్కుకు పెద్ద పీట వేసినదిగా కనిపిస్తోంది. అదే దళితుల కోణంలో చూస్తే రిజర్వేషన్లకు పెద్ద పీట వేసిన రాజ్యాంగంగా కనిపిస్తోంది. కానీ విశాల ప్రజానీకపు కళ్లతో చూస్తే ప్రాథమిక హక్కులకు రాజ్యాంగం ఇచ్చిన ప్రాధాన్యత కనిపిస్తోంది. రాజ్యాంగానికి ప్రాథమిక హక్కుల భాగం గుండెకాయ వంటిది. అందుకే రాజ్యాంగంలోని ఏ భాగంతోనైనా పాలకపక్షాలూ, వర్గాలూ ఆడుకోవచ్చని మనకు కనిపిస్తోంది. అనిపిస్తోంది.

కానీ నిజానికి అంబేద్కర్‌ను ఏ ఒక్క వర్గానికో పరిమితం చేయబోయే ముందు రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ పోషించిన పాత్రను, దాని చారిత్రక నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలి. ఆ విషయాన్ని అర్థం చేసుకోవాలంటే భారతదేశంలో అల్పసంఖ్యాక వర్గాలకు రాజ్యాంగం ఎటువంటి భరోసా కల్పించాలన్న అంశంపై అంబేద్కర్ అవగాహనను అర్థం చేసుకోవాలి. దీనికి గాను అంబేద్కర్ రాసిన స్టేట్ అండ్ మైనారిటీస్ గ్రంథాన్ని తప్పక చదవాలి. ప్రత్యేకించి నేడు భారతదేశం ప్రయాణిస్తున్న దారిలో నిల్చున్నప్పుడు భారతీయ సమాజానికి అంబేద్కర్ అందించిన సేవలను అర్థం చేసుకోవడానికి ఈ గ్రంథం మరింత దారిదీపంగా నిలుస్తుంది.

స్టేట్ అండ్ మైనారిటీస్ అన్న రచనను వెలువరించటానికి ముందు ఇదే పత్రాన్ని ప్రాథమిక హక్కుల అడ్వయిజరీ కమిటీకి, మైనారిటీలు, ఆదివాసీలు, విస్మృత ప్రాంతాలకు కల్పించాల్సిన రక్షణల గురించి అధ్యయనం, ప్రతిపాదనలు చేసే రాజ్యాంగ ఉపసంఘానికి అంబేద్కర్ సమర్పించారు. ఈ రెండు కమిటీలు అంబేద్కర్ ప్రతిపాదించిన పత్రాన్ని స్వీకరించి రాజ్యాంగంలో పొందుపర్చటానికి సిద్ధపడలేదు. అయినా వెరవని అంబేద్కర్ ఏకంగా ఓ పుస్తక రూపంలో ప్రచురించి దేశవ్యాప్త చర్చకు తెరతీశారు. అఖిల భారత షెడ్యూల్డ్ కాస్ట్ ఫెడరేషన్ తరఫున ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకం శీర్షికలో కనిపించినంత వరకే చూస్తే ఇదేదో దళితులకో మైనారిటీలకో సంబంధించిన అంశంగానే పొరపాటుపడే అవకాశం ఉంది. కానీ ఈ పుస్తకానికి రాసిన పీఠిక 'భారతీయులమైన మేము' అన్న మకుటంతో మొదలువుతుంది. ఈ పీఠికను కొనసాగిస్తూ అంబేద్కర్ 'మా అభివృద్ధికి అవసరమైన సుపరిపాలన, స్వపరిపాలను అందించుకునేందుకూ, స్వేఛ్ఛా స్వాతంత్ర్యాలూ, సంతోషం, వాక్స్వాతంత్ర్యం, మతపరమైన స్వేచ్ఛను ప్రసాదించుకోవటానికీ, అణగారిన వర్గాలకు మెరుగైన అవకాశాలు అందించటం ద్వారా సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతలు తొలగించటానికీ, భయం, ఆకలి, కొరతల నుండి ప్రజలందరికీ స్వేచ్ఛను ప్రసాదించటానికి' నూతన రాజ్యాంగం లక్ష్య నిర్దేశం చేసుకోవాలని ప్రతిపాదించారు. ఈ లోతులు గమనించినప్పుడు అంబేద్కర్ అందరివాడే తప్ప ఇప్పుడు ప్రచారం జరుగుతున్నట్లు కొందరివాడు కానేకాదని స్పష్టమవుతుంది.

అప్పటి వరకూ సమాజంలో సమాన హక్కులు అవకాశాలు పక్కన బెట్టి కనీసం సాటి వ్యక్తులుగా పౌరసమాజం చేత గుర్తింపు పొందని వారికి సాధ్యమైనంత మెరుగ్గా హక్కులు కల్పించటమే కాక, ఆయా హక్కులు ఎవరి దయాదాక్షిణ్యాల మీదనో ఆధారపడకుండా నేరుగా రాజ్యాంగ హక్కులుగా మార్చటానికి అంబేద్కర్ అనుసరించిన ఎత్తుగడల రీత్యా ఆయన్ను తరచూ మిగిలిన సామాజిక తరగతులు అపార్థం చేసుకోవడానికి అవకాశమిచ్చింది. అంబేద్కర్ పట్ల రాజకీయ విశ్లేషకులు, చరిత్రకారులకు ఉన్న వ్యతిరేకత కూడా సాధారణ ప్రజలూ అంబేద్కర్‌ను అపసవ్య దృష్టితో చూడటానికి కారణమైంది.

తొలిసారి 1970 దశకంలో అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం శరద్ పవార్ నాయకత్వంలో అంబేద్కర్ సంకలనాలను వెలువరించే ప్రయత్నం ప్రారంభించటంతో అంబేద్కర్ సారస్వతం గురించి ఆసక్తి, పరిశోధనలూ మళ్లీ మొదలయ్యాయి. 21 వ శతాబ్దంలో అస్తిత్వ ఉద్యమాలు విస్తరించటంతో అంబేద్కర్‌ను హక్కుల ప్రతీకగా చూసే యువతరం పరిశోధకుల కొత్త చూపు మొదలైంది. ఆయన అవగాహన నిరంతరం ఇచ్చిపుచ్చుకునే వైఖరితో ముందుకు సాగింది. మొండిగా తాను చెప్పింది ఒప్పుకుంటేనే ముందడుగు లేదంటే పలాయనం అన్న వైఖరితో ఎన్నడూ అంబేద్కర్ వ్యవహరించలేదు. మెరుగైన సామాజిక లక్ష్యాలు సాధించటానికి నెహ్రూ, పటేల్ సంవాదంలో అనేక సందర్భాల్లో అంబేద్కర్ ఓ మెట్టు దిగి వ్యవహరించారని రాజ్యాంగ పరిషత్ చర్చలు అధ్యయనం చేస్తే అర్థమవుతుంది. తాను ఎవరికైతే ప్రాథమిక రక్షణలు కల్పించాలని, దానికి రాజ్యాంగాన్ని సాధనంగా వాడుకోవాలని తలంచాడో ఆయా వర్గాలు, ప్రజల పట్ల అంబేద్కర్‌కు ఉన్న నిబద్ధత చిత్తశుద్ధి కొన్ని విషయాల్లో ఆయన్ను రాజీపడేలా చేశాయి.

ముసాయిదా రాజ్యాంగానికి దిశా నిర్దేశం చేస్తూ జవహర్ లాల్ నెహ్రూ 1947 జూలై 18 రాజ్యాంగ పరిషత్‌లో మాట్లాడుతూ 'రాజ్యాంగ పరిషత్ వచ్చే సమావేశాల్లో చర్చించటానికి కావల్సిన ముసాయిదా రాజ్యాంగ ప్రతిని రూపొందించేందుకు ఓ డ్రాఫ్టింగ్ కమిటీని నియమించాలని ప్రతిపాదిస్తున్నాను. రాజ్యాంగ లక్ష్య నిర్దేశ పత్రంలోనే పీఠిక గురించి కూడా ప్రస్తావన ఉన్నది. రాజ్యాంగ ముసాయిదా మలి ప్రతిలో పీఠికను కూడా పొందుపర్చాల్సి ఉంది. అయితే లక్ష్య నిర్దేశ పత్రంలో కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం కూడా ఉంది. కానీ ఈ మార్పులు మూల సారాంశానికి భంగం కలగకుండా చేయాలి' అని ప్రతిపాదించారు. ఈ మేరకు 1947 ఆగస్టు 29న డ్రాఫ్టింగ్ కమిటీ ఏర్పాటైంది. అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, ఎన్. గోపాలస్వామి, బి.ఆర్.అంబేద్కర్, మరియు కె.ఎం.మున్షిలు కూడా డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కమిటీ తన తొలి సమావేశంలోనే అంబేద్కర్‌ను డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నది.

రాజ్యాంగ పీఠిక గురించి చర్చించటానికి రాజ్యాంగ ముసాయిదా కమిటీ ముందుకు మూడు సార్లు సమావేశమైంది. అంతిమంగా ఫిబ్రవరి 21, 1948న జరిగిన సమావేశంలో "భారతీయులమైన మేము..." అన్న మకుటంతో ఉన్న పీఠిక రాజ్యాంగ పరిషత్ ఆమోదానికి సిద్ధమైంది. ఈ పీఠికలోనే భారతీయులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం,

విశ్వాసాలు, మతారాధాన విషయంలో స్వేచ్ఛ, హోదాల్లోనూ, అవకాశాల్లోనూ సమానత్వం అందించటం, భారతీయుల మధ్య సోదరభావాన్ని పెంపొందించటం లక్ష్యంగా రాజ్యాంగం పని చేస్తుందని, ఈ రాజ్యాంగాన్ని భారతీయులమైన మేము మాకు మేమే సమర్పించుకుంటున్నామని చెప్పబడింది.

సాధారణంగా పీఠికలోని లక్ష్యాలు, ముందుచూపు, ప్రజాతం త్ర లక్షణం, స్వభావం రీత్యా అప్పటి వరకూ కాంగ్రెస్‌లోనే ఈ ధోరణులకు ప్రతినిధిగా నిలిచిన నెహ్రూయే పీఠికకు కర్త అని భావించబడుతూ ఉండేది. నిజానికి పీఠిక అంబేద్కర్ విరచితమని తెలిసినవారు బహు కొద్ది మాత్రమే. ఈ విషయాన్ని రూఢ పర్చుకోవడానికి అంబేద్కర్ రాసిన స్టేట్ అండ్ మైనారిటీస్ గ్రంధంలోని ముందుమాటను, తర్వాత రాజ్యాంగ ముసాయిదా కమిటీలో ప్రతిపాదించిన పీఠిక పాఠాన్ని పోల్చి చూడవచ్చు. రాజ్యంగ లక్ష్య నిర్దేశ పత్రం ద్వారా నెహ్రూ స్థూలంగా రాజ్యాంగానికి దిశ, దశ నిర్దేశించిన మాట వాస్తవమే అయినా నేటి భారతీయులందరూ అనుభవిస్తున్న హక్కులను పీఠికలోనే పొందుపర్చటంలో మాత్రం అంబేద్కర్ చేసిన పోరాటం కారణం అన్నది చరిత్ర కాదనలేని సత్యం.

తర్వాతి కాలంలో రాజ్యాంగ పీఠిక కూడా రాజ్యాంగపు మౌలిక లక్షణాల్లో ఒకటనీ, పీఠికను సవరించటం అంటే రాజ్యాంగ మౌలిక లక్షణాలనూ, స్వభావాన్నీ సవరించటమేనని సుప్రీం కోర్టు పలు సందర్భాల్లో వ్యాఖ్యానించింది. నేడు ఇదే రాజ్యాంగపు మౌలిక లక్ష్యాలు, లక్షణాలూ ప్రశ్నార్ధకమవుతున్నాయి. వాక్స్వాతంత్ర్యం, మత స్వాతంత్ర్యం, సమాన హక్కులు, అవకాశాలతో కూడిన ఆధునిక భారత నిర్మాణం కలగా మిగిలిపోయే ప్రమాదం ముంచుకొస్తోంది. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన న్యాయ వ్యవస్థ కూడా పాలకవర్గం చేతుల్లో బందీ అవుతున్న సందర్భాలు గత దశాబ్ద కాలంలో కోకొల్లలు. విమర్శ లేనిదే సత్యనిరూపణ జరగదు. విమర్శను స్వీకరించటానికి సిద్ధం కాని నాయకుడూ పాలకుడూ ఎక్కువ కాలం చరిత్రలో ఏలుబడి సాగించిన సందర్భాలు చరిత్రలో లేవు. పరిస్థితులు అనుకూలించో, ప్రగతి శీల శక్తులు తమ బలాన్ని బలగాలన్నీ సమీకరించుకోవటంలో పొరపాటు పడితేనో, ఏమరుపాటుకు గురైతేనో అటవంటి సందర్భాల్లో మాత్రమే దుర్మార్గపు పాలకులు ఏలుబడి సాపేక్షంగా దీర్ఘకాలం మనుగడ సాగిస్తుంది. అంతమాత్రాన వందల ఏళ్లు పరిపాలించిన రాజ కుటుంబాలు సైతం చివరకు అంతర్గత బాహ్య శక్తుల తిరుగుబాట్లకు బలయ్యాయి. చరిత్రలో నాజీ నియంత హిట్లర్ అధికారానికి వచ్చినంత తేలిగ్గా ఏ నియంతా అధికారానికి రాలేదు. నాజీ పాలనకు సోపానంగా మారిన పార్లమెంటరీ వ్యవస్థలను దుంపనాశనం చేయటంలో హిట్లర్ వ్యవహరించినంత తెంపరితనంతో ఏ నియంతా వ్యవహరించలేదు. అయినా ప్రజాస్వామిక వ్యవస్థలు బలం పుంజుకున్న తర్వాత, అదే జర్మనీ దాదాపు నాజీ వ్యవస్థను నామరూపాలు లేకుండా చేయటానికి చేయని ప్రయత్నం లేదు. అయినా అంతర్జాతీయంగా మారిన పరిస్థితులు, మధ్యయుగాల తరహాలో మతం పాలకవర్గం చేతుల్లో సాధనంగా మారుతున్న తీరు, భారతీయులు తమ దేశాన్ని అంబేద్కర్ ఊహించిన ప్రజాస్వామిక ప్రజాతంత్ర దేశంగా నిలుపుకునేందుకు మరో స్వాతంత్ర్య పోరాటానికి తెరతీయాల్సిన పరిస్థితులు కన్పిస్తున్నాయి. అయితే ఈ నవ భారత నిర్మాణ పోరాటంలో అంబేద్కర్ సార్వత్రిక హక్కుల స్ఫూర్తిగా నిలుస్తాడు. కొందరివాడుగా కాక అందరివాడుగా ముందుకొస్తాడు. ఆధునిక ప్రజాతంత్ర భారత నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే నెహ్రూ దార్శనికత, అంబేద్కర్ నిబద్ధత, కమ్యూనిస్టుల కార్యాచరణ మేళవించుకుని ముందుకు సాగే మహోద్యమ నిర్మాణానికి నడుం కట్టాల్సి వస్తుంది.

అంబేద్కర్‌ను ఆకాశానికెత్తేందుకు సిద్ధమవుతున్న పాలకవర్గాలు, అంబేద్కర్ ఆశయాలను పాతాళానికి తొక్కేయకుండా, అంబేద్కర్ ఆశించిన ప్రజాతంత్ర భారత నిర్మాణాన్ని కాలదన్నకుండా చూసుకోవాల్సిన బాధ్యత అంబేద్కర్ వాదులందరిపైన, ప్రజాతంత్ర ప్రగతిశీల శక్తులపై ఉన్న ఉమ్మడి బాధ్యత. తమ మధ్య ఉన్న అంతరాలను అపార్ధాలను తొలగిస్తూ ఈ శక్తులు చేతులు కలపాల్సిన సమయం ఇది. ఈ చారిత్రక బాధ్యతను విస్మరిస్తే అంబేద్కర్ విగ్రహాలు ఆకాశాన్ని చుంబిస్తూనే ఉంటాయి. కానీ ఆయన ఆశయాలు మాత్రం పాతాళపు లోతుల్లో పాతిపెట్టబడుతూ ఉంటాయి. ❑

# పురాతన సమాజం

(39వ పేజీ తరువాయి)

సంపాదించిన నైతిక నియమాలు, కల్పనలు, అన్వేషణలు అతి ప్రధానమైన వాటిని ఒకచోట పొందుపరుస్తూ అభివృద్ధి క్రమాన్ని పట్టుకుని వెనక్కి నడిస్తే ఒక్కొక్క దశలో మానవుడు ఎంతెంత అభివృద్ధిని సాధించాడో తెలుసుకోవచ్చు. 1982లో మన దేశంలో మొట్టమొదటిసారి ఆంగ్ల భాషలో వెలువడగా 1987లో తెలుగు భాషలోకి విజ్ఞాన వికాస సమితి వారి తరపున మహీధర రామ్మోహన్‌రావు గారు అనువదించారు. పుస్తకం ప్రధానంగా నాలుగు ఖండికలుగా వ్రాయబడి వుంటుంది. వాటిలో తిరిగి అనేక ఉప ఖండికలుంటాయి. ఎవరైనా ఒక వ్యక్తి పురాతన సమాజం గురించి తెలుసుకోవాలనుకుంటే ఈ పుస్తకాన్ని ఒక పారాయణ గ్రంథంలా ప్రతిరోజూ పది నుండి ఇరవై పేజీలు మాత్రమే చదువుకుంటూ నోట్స్ రాసిపెట్టుకుంటే మానవ జాతి పరిణామ క్రమానికి సంబంధించిన జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునేది కాదనలేని వాస్తవం. ❑

# డిగ్రీలు లేని ప్రిన్సిపాలూ, మరో పరిశోధకుడు

(36వ పేజీ తరువాయి)

ఇతని లోని ఉత్సుకతను గమనించి వారు ఇతనికి సహకరిస్తూ ఉండే వారు. పైగా, మరింతగా ప్రోత్సహించే వారు. ఆ విధంగా మణి మేల శివశంకర్‌లో తెలియకుండానే ఒక పరిశోధకుడు ఎదుగు తూ వచ్చాడు. ఆ రకంగా చుట్టుపక్కల గ్రామాలకు వెళ్ళి, అక్కడి పెద్దల్ని విద్యావంతుల్ని పలకరించేవాడు. ఊళ్ళ మధ్య గల ఖాళీ ప్రదేశాల్ని, సమీపంలో ఉన్న చిన్న చిన్న అడవుల్ని తరచి తరచి చూసేవాడు. ఆనవాళ్ళు ఆధారాలు ఏవైనా దొరుకుతాయేమోనని శోధించేవాడు. ఆ ప్రయత్నంలో స్థానిక రికార్డులను, కల్నల్ మెకంజీ రాతలను వెతికి పట్టుకుని అధ్యయనం చేశాడు.

- గుంటూరు జిల్లాలో అదృశ్యమైపోయిన సుమారు ఐదు వందల గ్రామాలకు సంబంధించిన ఆధారాలు దొరకబట్టుకుని, వాటి గురించి రాయడం ప్రారంభించాడు. ఫలితంగానే 'గుంటూరు జిల్లా అదృశ్య గ్రామాలు' పేరుతో మణిమేల శివశంకర్ రచన పుస్తకంగా వెలువడింది. మన జాతీయ పతాకానికి రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య
- పూర్వీకులకు – అష్టదిగ్గజాల్లో ఒకడైన పింగళి సూరన్నకు, నేటి సినీకవి పింగళి నాగేంద్రరావులకు – వారి వారి పూర్వీకులకు సంబంధించిన ఈ వృత్తమంతా మణిమేల శివశంకర్ వెలికితీశారు.
- రెంటాల బ్రహ్మీ శాసనంలో ప్రస్తావించిన 'నిడిగల్లు" గ్రామం సాధారణ శకం మూడవ శతాబ్దం నాటి ఇక్ష్వాకుల రాజధానిగా ఉన్న నాగార్జునుని కోట విజయపురిలో ఉన్నదనడానికి ఆధారం ఇచ్చాడు.
- అలాగే, దుర్గి మండలంలో అదృశ్యమైపోయిన 'దద్దనాలపాడు' ఒకప్పుడు రాజకుటుంబాలలోని స్త్రీలు సతీ సహగమనం చేసిన ప్రదేశమని శివశంకర్ ఆధారాలు చూపాడు.
- తెనాలి రామకృష్ణకవి స్వగ్రామం తెనాలి మండలంలోని కొలకటూరుకు సమీపంలో అదృశ్యమై పోయిన 'గార్లపాడు' అని ఈ పరిశోధకుడు నిరూపించాడు.
- ఇతని కృషికి ఆమధ్య 'అయ్యంకి వెలగా పురస్కారం' లభించింది. ఇలాంటి వారు ప్రచార ఆర్భాటాలకు దూరంగా ఉంటారు. తాము చేయదలచుకున్న పని నిశ్శబ్దంగా చేసుకుంటూపోతారు. వివేకవంతులు దయతో ఇలాంటి వారిని వెలికితీసి, సభ్య సమాజానికి పరిచయం చేస్తూ ఉండాలి. ఇలాంటి పరిచయాలు మరికొందరికి స్ఫూర్తినిస్తూ ఉండాలి. గొప్ప పదవుల్లో ఉండి కూడా చేసింది ఏమీ లేకపోయినా, సిగ్గు లేకుండా అంతర్జాతీయ అవార్డుల కోసం ప్రయత్నాలు చేసుకునే హీన మనస్సులు, మీడియా పిచ్చోళ్ళు ఉన్న ఈ రోజుల్లో ఏమీ ఆశించకుండా ఎవరినీ పట్టించుకోకుండా సత్యాన్ని అన్వేషించే దిశగా నిరంతరం కృషి చేస్తున్న వారిని తప్పకుండా గుర్తించుకోవాలి! గౌరవించుకోవాలి. ❑


# 'గోరఖ్‌పూర్' విషాదానికి అక్షర సాక్ష్యం!?

(38వ పేజీ తరువాయి)

పసిబిడ్డల ప్రాణాలను ఫణంగా పెట్టాల్సిన విషాదం వెనుక సందర్భాలేమిటి? దీని వెనుకున్న కుట్ర కోణం ఏమిటి, ఈ ఆక్సిజన్ ప్లాంట్ టెండర్లు దక్కించుకోవడంలో రాజకీయ శక్తుల ప్రమేయాలేమిటో ఈ పుస్తకం నగ్నంగా చూపుతుంది. అలక్ష్యాన్ని ప్రశ్నించారన్న కారణంగా డాక్టర్ కఫీల్‌ఖాన్‌ను టార్గెట్ చేయడమూ, వారి కుటుంబాన్ని వేధించడమూ, వారి ఆస్తులను ధ్వంసం చేయడమూ, వారి వ్యాపారాలని నాశనం చేయడమూ, కుటుంబ సభ్యుల్లో ఒకరిపై కాల్పులు జరపడమూ, ఆసుపత్రికి తీసుకు వెళ్లేటప్పుడు వెంటాడటమూ, జైల్లో సాధారణ ఖైదీగా ఘోరమైన జీవితాన్ని చవి చూపించడమూ, నెలల తరబడి జైల్లో మగ్గేలా చేయడమూ లాంటి హృదయం చలించిపోయే అనేక ఉదంతాల గురించి చెప్పి కంటతడి పెట్టిస్తుందీ పుస్తకం. ఇది పసిబిడ్డల్ని కోల్పోయిన తల్లిదండ్రుల విషాదమే కాదు, కఫీల్ ఖాన్ స్వయంగానూ, తన కుటుంబం ఎదుర్కొన్న ఒక అమానుష మైన, నిరంతర చిత్ర వధకూ ప్రత్యక్ష సాక్ష్యం. ఈ పుస్తకం చదివినంత సేపూ గుండెలు పిండే వేదన. అనేకసార్లు కళ్ళు చెమ్మగిల్లుతాయి. అలక్ష్యం పట్ల ఆగ్రహావేశాలు కలుగుతాయి.

ఉద్యోగం కోల్పోయినా, కుటుంబ సభ్యుల ఆర్థిక మూలాల్ని విధ్వంసం చేస్తున్నా, నిరంతరం వెంటాడుతూ, వేధిస్తున్నా, వాళ్లు ప్రాణభయంతో విలవిలలాడి పోతున్నా ఏమీ చేయలేని తన అశక్తతని గుండెల్లో దిగమింగుకొని, ఎన్ని ఆటుపోటు లెదురైనా ధైర్యంగా ఒకవైపు న్యాయపోరాటం చేస్తూనే, ప్రజా మద్దతును కూడగట్టుకుంటూనే, అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే, డాక్టర్ కఫీల్‌ఖాన్ మానవీయ కోణంతో దేశవ్యాప్తంగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ రావడం అత్యంత శ్లాఘనీయం.

పోతే పోనీ, హితుల్ సుతుల్, వస్తే రానీ కష్టాల్ నష్టాల్ అనుకుంటూ ముందుకెళ్ళిపోతున్న డాక్టర్ కఫీల్ ఖాన్ ధైర్యాన్నీ, వారి న్యాయ పోరాటాన్నీ ఈ పుస్తకం చదివిన తర్వాత అభినందించకుండా ఉండలేరు. ❑




తొండాట

అబద్ధం









వాషింగ్ పౌడర్

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)
Vol : 2 - Issue No : 7 April 2024


# కొత్త పుస్తకాల స్వీకారం




ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
విజయవాడ




ప్రతులకు
విశాలాంధ్ర పబ్లిషింగ్
హౌస్, విజయవాడ

if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatal Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.